మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 18.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 104 ‖ వెల (Price) రూ.6.50

ద్వాదశి

గురువారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-16. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: ద్వాదశి రాత్రి 11-25 వరకు. నక్షత్రం: పుష్యమి ఉదయం 6-32 వరకు, తదుపరి ఆశ్లేష. వర్జ్యం: రాత్రి 7-36 నుంచి రాత్రి 9-17 వరకు. రాహుకాలం: పగలు 1-41 నుంచి పగలు 3-12 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-08 నుంచి ఉదయం 10-57 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-00 నుంచి పగలు 3-48 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 5-27 నుంచి మర్నాడు ఉదయం 7-05 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ప్రముఖ సాహితీవేత్త ఎస్వీ రామారావు కన్నుమూత



› 6

ఓయూ తెలుగు విభాగాధిపతిగా సేవలు

సాహితీ విమర్శ, పరిశోధనకు దక్కిన పురస్కారాలెన్నో

ఎస్వీఆర్ సేవలను స్మరించుకున్న ప్రముఖులు

నగరంలో కుండపోత



స్తంభించినపోయిన జనజీవనం › 8


హెచ్‌సీయూలో అత్యధికంగా 12.6 సెం.మీ.లు

• ఆర్‌ఆర్‌ఆర్ నిర్వాసితులకు కేటీఆర్ అభయం



రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతో భూములు కోల్పోతున్న వికారాబాద్ జిల్లా రైతులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చి కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధిత రైతులకు అండగా ఉంటామని, అధైర్య పడొద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

• ట్రిపుల్ ఆర్‌పై రైతుల రణం



కాంగ్రెస్ సర్కారు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చడాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని బాధిత గ్రామాల రైతులంతా బుధవారం హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిలోని అన్నెబోయినపల్లి వద్ద పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. నిర్వాసితులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆర్‌ఆర్‌ఆర్ అతిపెద్ద స్కామ్



నేడు మీడియా ముందు బయటపెడతా

పెద్దలవి కాపాడి, పేదల భూముల్ని కొల్లగొట్టేందుకే అలైన్‌మెంట్ మార్పు

పేదల భూముల్ని లాక్కుంటే ఊరుకోం.. వికారాబాద్ రైతులను ఆదుకుంటాం

చట్టప్రకారమే భూసేకరణ జరగాలి.. ఇష్టానుసారం లాక్కుంటే మరో ఉద్యమం

తెలంగాణభవన్‌లో తనను కలిసిన వికారాబాద్ రైతులకు కేటీఆర్ భరోసా

మాకు బతుకుదెరువెట్ల?



రోడ్డు వెంటే మాకు ఎకరన్నర భూమి ఉన్నది. తరతరాల నుంచి కాపాడుకుంటూ వస్తున్న భూమిని ఇప్పుడు రోడ్డుకు తీసుకుంటే మేము ఎట్ల బతకాలె. అంతా రెండు పంటలు పండే భూములు. వ్యవసాయం చేసుకొని బతికేటోళ్లం. ఇప్పుడు మా భూములు గుంజుకుంటే మాకు బతుకుదెరువెట్ల? మీరే న్యాయం చేయాలి.

- సత్తెమ్మ, దేవరంపల్లి, మోమిన్‌పేట మండలం, వికారాబాద్ జిల్లా

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ):'హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్ మార్పుతో అతిపెద్ద స్కామ్ జరగబోతున్నది. పెద్దల భూములు, లే అవుట్లు కాపాడి.. పేదల భూములను కొల్లగొట్టేందుకు అలైన్‌మెంట్‌నే మార్చేశారు. ట్రిపుల్ ఆర్ కుంభకోణం వివరాలను గురువారం మీడియా ముందు బయటపెడతా' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు సంచలన విషయాలను వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే రూపొందించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తన సొంత ప్రయోజనాల కోసం మార్చుకుంటున్నదని విమర్శించారు. ఫోర్త్ సిటీ సమీపంలోని తమ నాయకుల భూముల కోసం అలైన్‌మెంట్ మార్చి, రీజినల్ రింగ్ రోడ్డు స్వరూపాన్నే మార్చేశారని, దీనివల్ల అనేక మంది రైతులు › 3వ పేజీలో

రేవంత్ కమీషన్ల కక్కుర్తి..

పారిపోతున్న ఎల్ అండ్ టీ!



కమీషన్ల కోసం ఎల్ అండ్ టీ సీఈవోకు బెదిరింపులు

ఆయన ఎనుముల కాదు.. ముడుపుల రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రజాపాలనలో సీఎం నియంత పోకడలు

ఎమ్మార్ భూములు అమ్మే కుట్ర.. హైడ్రా పేరిట డ్రామా

సర్కారు తీరుతో తరలిపోతున్న పెట్టుబడులు

బీజేపీతో చీకటి ఒప్పందంలో భాగమే సీబీఐ విచారణ

నాపై కోపంతో సిరిసిల్ల నేతన్నలపై కక్ష సాధింపు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌దే విజయం

మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ నడిబొడ్డున మహారాష్ట్ర పోలీసులు 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకొంటే హోంమంత్రిగా వ్యవహరిస్తున్న సీఎంకు కనీస సమాచారం లేకపోవడం దురదృష్టకరం. నెలల తరబడి ఇంత పెద్ద అరాచకం నడుస్తుంటే ఈగల్ టీం, హైడ్రా తమాషాలు చూస్తున్నాయా?

-కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తేతెలంగాణ): కమీషన్ల కోసం ఎల్‌అండ్‌టీపై రేవంత్‌రెడ్డి బెదిరింపులకు దిగారని, కాబట్టే వారు పారిపోతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన ఇండియాటుడే కాన్‌క్లేవ్‌లో కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌ను జైలులో పెడతానని చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. వివాదంలో ఉన్న భూములను ముడుపులు తీసుకుని తెగనమ్మేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. వివాదాస్పద కంపెనీల బాధ్యులకు కేసులను చూపించి బెదిరించి ముడుపులు కొల్లగొట్టే పనిలో నిమగ్నమయ్యారని › 2వ పేజీలో



బాగ నమ్మిస్తే మోసం జేయడం అల్కగైతది. నమ్మకమనేదే లేకుంటే మోసమనేదే ఉండదు. నువ్వు ఎప్పుడైతే నమ్ముతవో నమ్మకానికి నీడలాగా మోసం దానెంబడే ఉంటది. ఆ నమ్మకాన్ని కలిగించడానికి ఎక్కువ ఎవరన్న ప్రయత్నం చేస్తే ఒకటికి రెండు సార్లు మనం జాగ్రత్తగా చూడాలె.

- ఓ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలివి

మోసం కేరాఫ్ కాంగ్రెస్

ప్రజల నుంచి ప్రజాప్రతినిధుల దాకా బాధితులే

విద్యార్థులు, నిరుద్యోగులు, చివరికి ఉద్యోగులూ వంచితులే

చెప్పినట్టుగానే మోసాల పరంపర కొనసాగిస్తున్న సీఎం

మోసం -1

'విద్యాశాఖకు 21 వేల కోట్లు కేటాయిస్తే, ఇందులో 98 శాతం టీచర్ల జీతాలకే ఖర్చవుతున్నది' బుధవారం నిర్వహించిన ఎడ్యుకేషన్ పాలసీ రూపకల్పనపై సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలివి. అంటే ఈ ప్రభుత్వం ఉపాధ్యాయుల జీతాలకు తప్ప పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూపాయి కూడా విదిల్చడం లేదని సీఎం చెప్పకనే చెప్పారు.

98 శాతం బడ్జెట్ టీచర్ల జీతాలకే

ఎంతచేసినా విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు

విద్యలో ప్రభుత్వ పాత్ర క్రమంగా తగ్గుతున్నది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి › 5

మోసం -2

గురుకులాల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారనే సాకుతో ఏకంగా వారి వేతనాలను సర్కారు కుదించింది. జేఎల్‌కు 35 వేల నుంచి 23,400కు, పీజీటీలకు 31,395 నుంచి 18,200కు, టీజీటీలకు 28,660 నుంచి 18,200కు తగ్గించింది. టీచర్ల జీతాన్ని పెంచాల్సింది పోయి అడ్డంగా తెగ్గోసి అవమానించింది.

డ్రైవర్ కంటే టీచర్ జీతం తక్కువ!

రెండు నెలల బకాయిలు అడిగితే జీతమే తెగ్గోసిన సర్కార్

మైనార్టీ గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ షాక్

డ్రైవర్‌కు 19,500.. టీజీటీ, పీజీటీలకు 18,200 వేతనం › 5

సర్కారు నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గరం గరం

మోసం -3

ఆయిల్‌ఫెడ్.. ఇది వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆధీనంలో ఉన్న శాఖ. కానీ, సదరు మంత్రికి తెలియకుండానే ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్యను కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీ చేసి కొత్త ఎండీగా జితేందర్ రెడ్డిని నియమించింది. ఎవరిని నియమిస్తున్నారనే అంశంపై సంబంధిత మంత్రికి కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని వ్యవసాయ శాఖలో చర్చనడుస్తున్నది.

మంత్రికి తెలియకుండా అధికారి మార్పు!

ఆయిల్ ఫెడ్‌లో ఎండీ తొలగింపు, కొత్త ఎండీ నియామకం

మంత్రి తుమ్మలకు సమాచారం ఇవ్వని వ్యవసాయశాఖ › 5

మూడు నెలల్లోనే మార్పుపై అధికారుల విస్మయం

మోసం -4

జూబ్లీహిల్స్ టికెట్ ఆశించిన కాంగ్రెస్ నాయకుడు అజారుద్దీన్‌ను కూడా సీఎం రేవంత్‌రెడ్డి బోల్తా కొట్టించారు. ఎమ్మెల్సీ పదవి ఎరేసి మెల్లగా పోటీ నుంచి తప్పించారు. ముస్లిం ఓట్ల కోసం ఎమ్మెల్సీగా ఎంపిక చేసినట్టు ఆయనను భ్రమల్లో ముంచారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత ఎమ్మెల్సీ ఎన్నికలపై సుప్రీంకోర్టులో ఇంకా కేసు నడుస్తున్న సమయంలో అజారుద్దీన్ ఎంపికను గవర్నర్ ఆమోదించే పరిస్థితి లేదు.

అజారుద్దీన్‌కు మొండిచెయ్యి

ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం అనుమానమే › 5

జూబ్లీహిల్స్ బరి నుంచి తప్పించేందుకే రేవంత్ ఎత్తుగడ

సుప్రీంలో ఎమ్మెల్సీ కేసు పెండింగ్

తుదితీర్పు తర్వాతనే గవర్నర్ నిర్ణయం.. కాంగ్రెస్ తీరుపై అజార్ అసహనం

మోసం -5

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ సర్కారును నమ్మి మోసపోయామని కాలేజీల యాజమాన్యాలు మథన పడుతున్నాయి. సోమవారం జరిగిన చర్చల్లో ప్రభుత్వం అసలు విషయం చెప్పకుండా యాజమాన్యాలు చెప్పిన రూ. 1,207 కోట్లే బకాయి ఉన్నట్టు నటించింది. కానీ ఆ విలువ రూ.3,543 కోట్లు అని తెలిసి యాజమాన్యాలు అవక్కయ్యాయి. అసలు లెక్కలను దాచి ప్రభుత్వం తమను వంచించిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

ఫీజు బకాయిలపై పచ్చి అబద్ధాలు

టోకెన్లు జారీ అయ్యిందేమో రూ.3,543 కోట్లకు!

రూ.1,207 కోట్లే ఉన్నట్టు చెప్పిన రేవంత్ సర్కార్ › 5

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి వివరాలు గోప్యం

నమ్మితే ఇంత మోసమా? యాజమాన్యాల ఆవేదన

మోసం -6

ఇన్నాళ్లు జీహెచ్‌ఎంసీలో రూ.24000 జీతానికి పనిచేసిన కొందరు సిబ్బందిని కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాలో పడేసింది. బాధ్యతలు పెంచిన తర్వాత ఆ స్థాయిలో జీతాలను కూడా పెంచాల్సింది పోయి విచిత్రంగా రూ.19,500కు కుదించింది. జీహెచ్‌ఎంసీలో ఉన్నప్పుడు ప్రతినెలా 5వ తేదీలోగా వేతనాలు అందేవని, ఇప్పుడు 15, 20, 25 తేదీల్లో వేస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

హైడ్రా సిబ్బంది మెరుపు సమ్మె

జీతాల తగ్గింపుపై ఆగ్రహం

హైడ్రా ఆఫీసు వద్ద నిరసన

మాన్‌సూన్ వర్క్స్‌కు అంతరాయం › 5

కామధేనువు కాళేశ్వరం

తెలంగాణకు పట్టిన శనేశ్వరం కాంగ్రెస్.. ప్రజలకు అర్థమయ్యేదాకా కష్టపడదాం

కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీలవి చిల్లరమాటలు.. మేడిగడ్డలో రూపాయి వృథా కాలే

1,100 కోట్లతో పూర్తయ్యే గండిపేట అంచనాలను 7,400 కోట్లకు రేవంత్ పెంపు

ఢిల్లీకి మూటలు పంపేందుకే: కేటీఆర్.. 'కాళేశ్వరం'పై డాక్యుమెంటరీ ఆవిష్కరణ › 2

మహాలక్ష్మి పథకంతో ఉపాధి కరువు

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు › 2

కేటీఆర్‌తో గోడు వెళ్లబోసుకున్న ఆటోరిక్షా కార్మికులు

తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను కలిసిన నాయకులు

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే మద్దతిస్తూ తీర్మానం

ఈవీఎంపై అభ్యర్థి కలర్ ఫొటో

ఈసీ కొత్త మార్గదర్శకాలు › 7

బీహార్ ఎన్నికలతో అమలు

బాత్రూమ్‌లో 17లక్షలు!

ఏసీబీ సోదాల్లో బినామీ ఇంట్లో లభ్యమైన నగదు

అవినీతి ఏడీఈకి 14 రోజుల రిమాండ్ › 8

అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య

› 3

వర్షాలకు దెబ్బ తిన్న పంటలు

అప్పులు తీర్చలేక మనస్తాపం

మెదక్, నిర్మల్ జిల్లాల్లో విషాదం

బ్యూటిఫుల్‌గా బాదేశారు!

సౌందర్య సంరక్షణ, ఫిజికల్ వెల్‌నెస్, స్పా యోగా తరగతులపై 5 శాతం జీఎస్టీ వాత

- 13% మేర ట్యాక్స్ తగ్గించినట్టు కేంద్రం గప్పాలు
- జీఎస్టీ తగ్గించినా కస్టమర్లకు దక్కే లబ్ధి అంతంతే ఐటీసీ రూల్‌తో వినియోగదారులపై కొత్త భారం

సౌందర్య సంరక్షణ, ఫిజికల్ వెల్‌నెస్ సర్వీసులకు సంబంధించి ఇప్పటివరకూ ఉన్న 18% జీఎస్టీని 5 శాతానికి తగ్గిస్తూ భారీ ఊరట కల్పించామంటూ మోదీ సర్కారు ప్రచారం చేసుకొంటున్నది. అయితే తాజా నిర్ణయంతో సెలూన్‌లు, బ్యూటీ పార్లర్లు, జిమ్ సెంటర్లు, యోగా క్లాసులకు వెళ్లే వేలాది మందికి దక్కే ప్రయోజనం అంతంతేనని.. బ్యూటీ, వెల్‌నెస్ సేవలను అందించే సర్వీస్ ప్రొవైడర్లకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ప్రయోజనాలు కేంద్రం అందించకపోవడమే దీనికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. › 7





కోర్టు అంటే లెక్కలేదా?

పరిహారం చెల్లించాలన్నా పట్టదా?

సిరిసిల్ల కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

వారంట్ జారీ.. అక్టోబర్ 8న › 8

స్వయంగా హాజరు కావాలని ఆదేశం

జాతీయ జెండా సాక్షిగా ప్రభుత్వ విప్‌కు అవమానం

ప్రోటోకాల్ ఉల్లంఘించిన సిరిసిల్ల కలెక్టర్

జాతీయ జెండా ఆవిష్కరణకు గైర్హాజరు › 8

కలెక్టర్ తీరుపై అవమానకరం : ఆది

యువతతో పెట్టుకుంటే సర్కార్ మనుగడ కష్టం

రెండు లక్షల ఉద్యోగాలన్నం.. 50 వేలే ఇచ్చినం



నేపాల్ యువత పోరే నిదర్శనం

కాంగ్రెస్‌తో ఉద్యోగ భర్తీలో జాప్యం

నిరుద్యోగులు భావోద్వేగానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నరు

30లక్షల మంది కన్నీళ్లతో ఉన్నారు

ఏటా జూన్ 2న నోటిఫికేషన్లు ఇవ్వాలి

అమరవీరుల సాక్షిగా అశోక్‌నగర్ వస్తా

రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): 'యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాధించలేదు. యువత అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. నేపాల్‌లో అవినీతి పాలనను కూల్చేందుకు అక్కడి యువకులు పోషించిన పాత్రే ఇందుకు నిదర్శనం' అని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వంపైనే ఆయన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మరోసారి విమర్శల దాడికి దిగారు. ఈ మేరకు › 6వ పేజీలో

పన్నులపై శ్రద్ధ రోడ్లపై లేదా?

'ఇంటిపన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ రోడ్ల మరమ్మతు మీద లేదా? మేము ఇంత వరకు కట్టిన ఇంటి పన్ను వాపస్ ఇవ్వండి. లేదా రోడ్డు వేయండి' అంటూ ఓ కుటుంబం నిరసన తెలిపింది. రోడ్ల మరమ్మతులో కరీంనగర్ నగరపాలక సంస్థ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ నగరంలోని అలకాపురికి చెందిన దుంపెటి రాము కుటుంబం ఇలా బురద రోడ్డుపై బైఠాయించింది.



మందులకు పైసల్లేవ్!

టీజీఎంఎస్ఐడీసీకి రూ.1,019 కోట్ల బకాయిలు

ఏడాదిగా పెండింగ్‌లో పెట్టిన కాంగ్రెస్ సర్కారు

సరఫరాలు ఆపేస్తామంటున్న మెడికల్ ఏజెన్సీలు

మరో మూడు నెలల్లో అయిపోనున్న పాత స్టాక్

ఆ తర్వాత ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం

ఇప్పటికే రాష్ట్రంలో 'ఆరోగ్యశ్రీ' సేవలు బంద్ › 8

అయినా ఏమాత్రం చలించని రేవంత్ ప్రభుత్వం



బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి రూపొందించిన కాళేశ్వరం డాక్యుమెంటరీని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి తదితరులు

కామధేనువు కాళేశ్వరం

తెలంగాణకు పట్టిన శనేశ్వరం కాంగ్రెస్ • ఇది ప్రజలకు అర్థమయ్యేదాకా కష్టపడదాం

- 1940 నుంచి పూర్తి కాని పోలవరం
- మూడేండ్లలోనే కాళేశ్వరం పూర్తి
- కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలవి చిల్లరమాటలు
- మేడిగడ్డలో రూపాయి వృథా కాలేదు
- ఢిల్లీకి మూటలు పంపేందుకే గండిపేట ప్రాజెక్టు అంచనా పెంపు
- 'కాళేశ్వరం'పై డాక్యుమెంటరీ ఆవిష్కరణ సభలో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణకు వరప్రదాయిని అని, కామధేనువు, కల్పతరువు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ర్టానికి పట్టిన శనేశ్వరం కాంగ్రెస్ అని.. ఈ విషయాలు ప్రజలు తెలుసుకునేదాకా కష్టపడుదామని, సమిష్టిగా పోరాడుదామని బీఆర్‌ఎస్ నేతలకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో తెలంగాణలోని ప్రతి బిడ్డ కేసీఆర్‌ను 'కే అంటే కాలువలు, సీ అంటే చెరువులు, ఆర్ అంటే రిజర్వాయర్లు'గా గుర్తు పెట్టుకుంటారని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి రూపొందించిన కాళేశ్వరం డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ డాక్యుమెంటరీని తెలంగాణలోని ప్రతి గడపకు తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరికీ చూపించాలని నేతలకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాయాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తానని చెప్పారు. అవసరమైతే ఫంక్షన్‌హాళ్లలో కూడా దీనిని ప్రదర్శించి కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్నది పచ్చి అబద్ధాలని నిరూపిద్దామని చెప్పారు. 'ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు, ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారం తప్పని నిరూపించేందుకు రాకేశ్‌రెడ్డి చేసిన ప్రయత్నం అభినందనీయం. డాక్యుమెంటరీని రూపొందించిన బృందానికి అభినందనలు' అని కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ పనితనానికి ఇదో ఉదాహరణ

మేడిగడ్డ ప్రాజెక్టులో కుంగిన రెండు పిల్లర్లను 20 నెలలుగా ఎందుకు మరమ్మతు చేయడం లేదని అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీలో అడిగితే ప్రభుత్వం సమాధానమే చెప్పలేదని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం కూలిపోతే హైదరాబాద్‌కి గోదావరి నీళ్లు ఎలా తీసుకొస్తారని ఒవైసీ అడిగితే సీఎం గుడ్లు తేలేశారని తెలిపారు. తెలంగాణ తలరాత మార్చిన కేసీఆర్ పనితనాన్ని ప్రపంచం ముందు ఘనంగా చెప్పుకోవడంలో పార్టీగా విఫలమయ్యామని అన్నారు. 'స్వాతంత్రానికి పూర్వం పోలవరం ప్రాజెక్టు ఆలోచన మొదలైంది. 1940లో పోలవరం ప్రాజెక్టు కట్టాలని అనుకుంటే 1980లో శంకుస్థాపన జరిగింది. 2004లో డిజైన్లు గీశారు. 2014 జూన్‌లో పనులు మొదలయ్యాయి. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పూర్తికాలేదు. 2027 డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నరు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేసి ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా స్వల్ప కాలంలో నిర్మించారు కేసీఆర్. కేసీఆర్ పనితనానికి, ఇతర ముఖ్యమంత్రుల పనితనానికి ఇంతకు మించిన ఉదాహరణ ఉండదు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

చివరి మడికే నీళ్లు రాకపోయేవి

పోచంపాడు ప్రాజెక్టు కింద ఉన్న ఆర్మూరు నియోజకవర్గంలోని చివరి మడికే నీళ్లు రాకపోయేవని కేటీఆర్ గుర్తుచేశారు. 'సముద్రమట్టానికి 110 -120 మీటర్ల ఎత్తులో కృష్ణా నది ప్రవహిస్తే, గోదావరి 80 నుంచి 100 మీటర్ల ఎత్తు నుంచి ప్రవహిస్తుంది. సముద్రమట్టానికి 80 మీటర్ల ఎత్తులో ఉన్న గోదావరి నదిని మేడిగడ్డ వద్ద ఒడిసిపట్టి సముద్ర మట్టానికి 535 మీటర్ల ఎత్తులో ఉన్న హైదరాబాద్‌కు తీసుకొచ్చిన బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం. హైదరాబాద్ నెత్తిపైనున్న నీటి కుండ కొండపోచమ్మ సాగర్‌తో ఇంకో 50 ఏండ్ల వరకు నగరానికి తాగునీటి కొరత రాదు' అని కేటీఆర్ పేర్కొన్నారు. రూ.1,100 కోట్లతో కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేటకు నీళ్లు తీసుకొచ్చే ప్రాజెక్టుకు గతంలోనే కేసీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు పంపేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టు అంచనాలను ఏడు రెట్లు పెంచి రూ.7,400 కోట్లు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాలోతు కవిత, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, పట్నం నరేందర్‌రెడ్డి, పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నోముల భగత్, మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, చిరుమళ్ల రాకేశ్, గజ్జెల నగేశ్, వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు తుల ఉమ, శుభప్రద్‌పటేల్, పడాల సతీశ్, కడారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం మల్టీపర్పస్ ప్రాజెక్టు

కాళేశ్వరం మల్టీపర్పస్ ప్రాజెక్టు అని కేటీఆర్ స్పష్టంచేశారు. కేసీఆర్ సీఎం అయ్యేదాకా తెలంగాణ రైతులు కన్నీళ్లనే తప్ప సాగునీళ్లను చూడలేదన్నారు. సాగు, తాగునీటితోపాటు పరిశ్రమల అవసరాలను తీరుస్తుందని చెప్పారు. రాష్ర్టాన్ని ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్‌గా నిలిపిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో కరువొచ్చినా, కడెం, ఎస్సారెస్పీ నుంచి నీళ్లు రాకపోయినా కాళేశ్వరం నుంచి మూడు మార్గాల ద్వారా నీళ్లు తీసుకొనేలా గొప్ప డిజైన్‌తో నిర్మించినట్టు తెలిపారు. సాధారణ వర్షపాతం నమోదైనా గోదావరి నిండితే కాకతీయ కాల్వ ద్వారా నీళ్లు తీసుకోవడం ఒక మార్గమని చెప్పారు. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైతే ఎస్సారెస్పీ నిండితే వరద కాలువ ద్వారా నీళ్లు నింపుకోవడం మరో మార్గమని తెలిపారు. ఈ రెండూ లేనప్పుడు తెలంగాణకు కరువొస్తే గోదావరిలో నీళ్లు ఉండేది ఒక్క మేడిగడ్డలో మాత్రమే నని, అందుకే కాళేశ్వరం కల్పతరువు, కామధేనువు అని పునరుద్ఘాటించారు.

రైతుల నుంచి కేసీఆర్‌ను దూరం చేసే కుట్ర: జగదీశ్‌రెడ్డి

ఏ రైతుల సంక్షేమం కోసమైతే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారో.. ఆ రైతుల నుంచి కేసీఆర్‌ను దూరం చేయడానికి కొన్ని శక్తులు ఏకమయ్యాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం కట్టడం ద్వారా తమకు నష్టం జరుగుతుందని బనకచర్లకు లైన్ క్లియర్ కావడం లేదని, కాళేశ్వరాన్ని వ్యతిరేకించే శక్తులకు మీడియాను అడ్డం పెట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఉద్యమ సమయంలో 10-14 గంటలు పని చేస్తే, అధికారంలో సీఎంగా 18-20 గంటలు కూడా పనిచేశారని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణాన్ని సీసీ కెమెరాల ద్వారా పరిశీలించేవారని తెలిపారు.

పిట్ట మనసులో కాళేశ్వరం: కేఆర్ సురేశ్‌రెడ్డి

గంగను గుట్ట ఎక్కించి తెలంగాణను గట్టెక్కించిన మహనీయుడు కేసీఆర్ అని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి ప్రశంసించారు. 20 ఏండ్లు అధికార, ప్రతిపక్ష సభ్యుడిగా గోదావరి నీళ్ల కోసం పోరాడానని, నేడు కాళేశ్వరం జలాలు పొలాల్లో పారి రికార్డు స్థాయిలో పంట పండుతుంటే సంతోషమేస్తున్నదని చెప్పారు. 'నాకు చిన్నప్పటి పాట గుర్తుకొస్తున్నది.. 'గోదారి గట్టుంది.. గట్టుమీద చెట్టు ఉంది.. చెట్టు కొమ్మన పిట్టుంది.. పిట్టమనసులో ఏముంది? అంటే.. గోదావరి జలాలు తెలంగాణ ప్రజలకు అందించే కాళేశ్వరం ఉన్నది అని పేర్కొన్నారు. కేవలం ఆరేండ్లలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు నిర్మించి, ప్రజలకు నీళ్లు అందించి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని ప్రశంసించారు.

సవ్వడే తప్ప.. గొంతు తడపలే: గంగుల

మేడిగడ్డ ప్రాజెక్టును కేసీఆర్ కేవలం 37 నెలల్లోనే రికార్డు టైమ్‌లో కేసీఆర్ నిర్మించారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. 2016 మే 2న అడవిలాంటి ప్రాంతంలో మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, 2019 జూన్ 16 నాడు బరాజ్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రపంచంలో ఇంత తక్కువ టైమ్‌లో ఇంత భారీ ప్రాజెక్టును ఎవరూ కట్టి ఉండరని, అలాంటి మహత్తర యజ్ఞంలో తమను భాగస్వాములను చేసిన కేసీఆర్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు తెలిపారు. 'మా ఊరు వెల్లటూరు మండలం పైడిపల్లి గ్రామం. గోదావరికి కిలోమీటర్ దూరంలోనే ఉండేది. రాత్రివేళల్లో గోదావరి ప్రవాహం సవ్వడి వినిపించేది. కానీ, గోదావరి నీళ్లు గొంతును తడపలేదు. పొలాల్లో పారలేదు. సాగు నీళ్లు పొలాలకు మలుపుకొచ్చేందుకు మా తాతలు, తండ్రులు రక్తాలు చిందించాల్సిన పరిస్థితులు ఉండేవి. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరంతో పొలాల్లో భూమికి బరువయ్యేలా పంటలు పండుతున్నాయి' అని చెప్పారు.

కాంగ్రెస్ కూలుతుందే తప్ప ప్రాజెక్టు కూలదు: సత్యవతి రాథోడ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందే తప్ప ప్రాజెక్టు కూలే ప్రసక్తే లేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ స్పష్టంచేశారు. వానకాలంలో నిత్యం 10-12 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నా ప్రాజెక్టు చెక్కు చెదరలేదని తెలిపారు. తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, కేసీఆర్ నాయకత్వంతో తిరిగి అద్భుతంగా ప్రాజెక్టును తయారు చేసుకొని మరిన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చుకుంటామని చెప్పారు. ఎస్సారెస్పీ పునరుద్ధరణ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు అయిన డోర్నకల్ నియోజకర్గం వరకు గోదావరి జలాలను కేసీఆర్ పారించడంతో నాడు పండుగలు చేస్తున్నామని గుర్తుచేశారు.

ప్రజలకు నిజాలు తెలియజెప్పే ప్రయత్నం: డాక్యుమెంటరీ రూపకర్త రాకేశ్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అపోహలు, అబద్ధాలు ప్రచారం చేస్తున్న తరుణంలో ప్రజలకు నిజాలు తెలియాలనే ఉద్దేశంతోనే కాళేశ్వరంపై డాక్యుమెంటరీని రూపొందించినట్టు బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి చెప్పారు. వివిధ అంశాల్లో పట్టు కలిగిన ఐదుగురు సభ్యుల బృందంతో మూడు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి కాళేశ్వరం డాక్యుమెంటరీని రూపొందించామని తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పార్టీ నాయకులు ఇందుకు సహకారం అందించారని పేర్కొన్నారు. అనంతరం రాకేశ్‌రెడ్డితోపాటు ఆయన బృందాన్ని కేటీఆర్ ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ నేతలవి చిల్లర మాటలు

మేడిగడ్డ ప్రాజెక్టులోని 85 పిల్లర్లలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే.. ఆయనకు పిల్లనిచ్చిన మామ మాత్రం అదేమీ లేదని కొట్టి పారేశారని గుర్తుచేశారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుకైన ఖర్చు రూ.93,769 కోట్లు అని పేర్కొన్నారు. ఇందులో మేడిగడ్డ బరాజ్‌కు భూసేకరణతో కలుపుకుని అయిన ఖర్చు దాదాపు రూ.4 వేల కోట్లు అని, సిమెంట్ నిర్మాణానికి మాత్రమే అయిన ఖర్చు రూ.1,500 కోట్లకు మించదని వివరించారు. ఏడో బ్లాక్‌లో కుంగిన రెండు పిల్లర్లను పునరుద్ధరించడానికి అయ్యే ఖర్చు రూ.300 కోట్లు అని, బరాజ్ నిర్మించిన ఎల్ అండ్‌టీ సంస్థనే తన పైసలతో మళ్లీ నిర్మిస్తామని అంటున్నదని పేర్కొన్నారు. ఇందులో ప్రజాధనం ఎక్కడ వృథా అయింది? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కమీషన్ పేరుతో రేవంత్ సర్కారు రూ.3 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసి కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయింది' అని కేటీఆర్ మండిపడ్డారు.

తెలంగాణ ప్రజల జీవితం.. కాళేశ్వరం: పల్లా

కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు అని, రాకేశ్‌రెడ్డి రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ బాగున్నదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు. నాడు కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని, మానవ మాత్రులు ఎవరూ పడనంత కష్టం కేసీఆర్ పడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేశారని చెప్పారు. కాంట్రాక్టు సంస్థ అధిపతులతో కేసీఆర్ మాట్లాడుతూ.. 'ఇది మీకు ఒక ప్రాజెక్టు మాత్రమే. కానీ, తెలంగాణ ప్రజలకు ఇది జీవితం' అని చెప్పారని గుర్తుచేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన పరికరాలు పంజాబ్‌లో దొరుకుతాయి.. అంటే అక్కడి షాపువాళ్లతో కూడా కేసీఆర్ స్వయంగా మాట్లాడి త్వరగా వచ్చేలా చేశారని తెలిపారు.

నీ బతుకెందుకు.. సచ్చిపో!

కరెంట్‌బిల్లు కట్టనందుకు సిబ్బంది అవమానం

మనస్తాపంతో కరెంట్ పోల్ ఎక్కి బాధితుడి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఘటన

ధర్మపురి, సెప్టెంబర్17: 'కరెంటు బిల్లు కట్టలేని నీ బతుకెందుకు? చావు' అంటూ విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది ఘాటైన మాటలతో వినియోగదారుడిని అవమానించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సదరు వినియోగదారుడు సమీపంలోని కరెంట్ స్తంభం ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా, బంధువులు రోదించడంతో కిందికి దిగివచ్చాడు. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బండారి లక్ష్మణ్ కార్ సర్వీసింగ్ సెంటర్ నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. ఇంట్లో పిల్లల ఆరోగ్యాలు బాగో లేకపోవడంతో దవాఖాన ఖర్చులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అతడి ఇంటికి సంబంధించి కరెంటు బిల్లు కొంత పెండింగ్‌లో ఉన్నది. బుధవారం విద్యుత్తు అధికారులు, సిబ్బంది దాదాపు 15మంది లక్ష్మణ్ ఇంటికి వచ్చారు. బిల్లు ఎప్పుడు కడతావని అడిగారు. తన దీనపరిస్థితిని చెప్పుకొని ఒక్కరోజు సమయం ఇవ్వాలని కోరాడు. అధికారులు వినిపించుకోకుండా 'కరెంటు బిల్లు కూడా కట్టలేని నీ బతుకెందుకు? చావు'.. అంటూ ఘాటైన మాటలతో వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మణ్ పక్కనే ఉన్న కరెంటు పోల్ ఎక్కాడు. విద్యుత్తు సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ ప్రాంతంలో కరెంట్ సరాఫరాను నిలిపివేయగా ప్రమాదం తప్పింది. బంధువులు రోదించడంతో లక్ష్మణ్ కిందకు దిగొచ్చాడు. తన ఇంటికి సంబంధించిన కరెంట్ మీటర్‌లో లోపం ఉన్నదని, కేవలం రెండు ఫ్యాన్లు, మూడు ట్యూబ్ లైట్ల వాడకానికి నెలకు రూ.3 వేల పైలుకు బిల్లు వస్తున్నదని, మీటర్ మార్చాలని పలుమార్లు అధికారులతో విన్నవించుకున్నా పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు.



జగిత్యాల జిల్లా ధర్మపురిలో విద్యుత్తు స్తంభం ఎక్కి ఆత్మహత్యకు యత్నిస్తున్న వినియోగదారుడు బండారి లక్ష్మణ్

రేవంత్ కమీషన్ల కక్కుర్తి.. పారిపోతున్న ఎల్ అండ్ టీ!

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చిన అనేక కంపెనీలు ఆయన వైఖరితోనే ఇతర రాష్ర్టాలకు తరలిపోతున్నాయని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 22 నెలల పాలనలో కమీషన్లు దండుకోవడం, ఢిల్లీకి మూటలు పంపడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ మొదలు గ్రూప్-1 పరీక్ష వరకు ప్రతి పనికి ముడుపులు దండుకుంటున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి.. ముడుపుల రేవంత్‌రెడ్డిగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన ముసుగులో నియంత పాలన చేస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్ ఒక్క మంచిపనైనా చేసిండా?

22 నెలల పాలనలో రేవంత్‌రెడ్డి చేసిన మంచి పని ఒక్కటున్నా చెప్పాలని ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాను కోరారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న సబ్బండ వర్ణాలు ఇప్పుడు అరిగోస పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు, ఆరోగ్యశ్రీ సేవల రద్దుతో దవాఖానలు, నిరుపేదలు, యూరియా కొరతతో రైతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, రేషన్ డీలర్లు, పారిశుధ్య కార్మికులు ఆందోళనబాట పడుతున్నారని గుర్తుచేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు సాకులు చూపి, కేంద్రంపై నెపంనెట్టి తప్పించుకునేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ నివసించిన ప్రగతి భవన్, ఆయన నిర్మించిన కాళేశ్వరంపై అబద్ధాలు చెప్పి ఓట్లు దండుకున్న నీచుడని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్‌పై కక్షతోనే మేడిగడ్డకు మరమ్మతు చేయించకుండా పక్కనబెట్టారని ఆరోపించారు. 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (టీఆర్పీ) ఏర్పాటుపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు పార్టీలు పెట్టుకోవచ్చని పేర్కొన్నారు.

ఓ వైపు అవినీతి..మరోవైపు బంధుప్రీతి

కాంగ్రెస్ హయాంలో అవినీతికి, బంధుప్రీతికి తావులేదని, రేవంత్‌రెడ్డి వాటినే విధానాలుగా మార్చుకున్నారని కేటీఆర్ తూర్పారబట్టారు. తన బావమరిది సృజన్‌రెడ్డి, అన్న అమిత్‌రెడ్డికి, మామ పద్మారెడ్డికి కాంట్రాక్టులు ఎందుకిచ్చారని ప్రశ్నించారు.

సిరిసిల్ల నేతన్నలకు దగా

వ్యక్తిగతంగా తనపై పగ సాధిస్తున్న రేవంత్‌రెడ్డి సిరిసిల్ల నేతన్నలను దగా చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఆడబిడ్డకు బతుకమ్మ చీరలు ఇచ్చామని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కారు మాత్రం మహిళా సంఘాల సభ్యులకే పరిమితం చేస్తున్నదని, అవి కూడా ఇస్తదో? లేదో? తెలియదని వ్యాఖ్యానించారు.

అన్నీ 'హైడ్రా'మాలే

రేవంత్ గద్దెనెక్కాక హైడ్రా తెచ్చి పెద్దల ఇండ్లను కాపాడుతూ, పేదల నివాసాలపై బుల్డోజర్లతో విరుచుకుపడ్డారని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా పేరిట డ్రామాలు నడుపుతూ ముడుపులు దండుకుంటున్నారని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ తన గుర్తును హస్తానికి బదులు బుల్డోజర్‌గా మార్చుకోవాలని దెప్పిపొడిచారు. హైదరాబాద్ నడిబొడ్డున మహారాష్ట్ర పోలీసులు రూ. 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకొంటే హోంమంత్రిగా వ్యవహరిస్తున్న సీఎంకు కనీస సమాచారం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. నెలల తరబడి ఇంత పెద్ద అరాచకం నడుస్తుంటే ఈగల్ టీం, హైడ్రా తమాషాలు చూస్తున్నాయా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ నేతలను చూస్తే జాలేస్తున్నది

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలను చూస్తే జాలేస్తున్నదని పేర్కొన్నారు. జగిత్యాలలో ఆ పార్టీ అగ్రనేత జీవన్‌రెడ్డి పరిస్థితే ఇందుకు ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ప్రజలకే కాకుండా పార్టీ నాయకులకు కూడా వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిజంగా అద్భుతమైన పాలన ఉంటే వెంటనే ఉప ఎన్నికలు పెట్టి ప్రజాతీర్పు కోరాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీఫాంపై ఎంపీగా పోటీచేసిన దానం నాగేందర్ స్పీకర్‌ను కలవడం ద్వారా లాభం లేదని, ఆయనపై వేటు తప్పదని చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరైనా గెలుపు ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తాము చేయించిన ఆరేడు సర్వేల్లోనూ ఇవే ఫలితాలు వచ్చాయని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు చేయించిన మూడు సర్వేల్లోనూ తమ పార్టీ గెలుస్తుందనే విషయం స్పష్టమైందని చెప్పారు. ఓటమి భయంతో అధికార పార్టీ అరాచకాలు సృష్టించే ప్రమాదమున్నదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి పాలన నిజంగా అద్భుతంగా ఉంటే వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ పండుగల్లోను ప్రజలు కేసీఆర్‌ను ఎందుకు తలచుకుంటారని ప్రశ్నించారు.

ఆడబిడ్డల ప్రాణాలకు విలువలేదా?

హైదరాబాద్‌లో ఇద్దరు ఆడబిడ్డలు హత్యకు గురైతే ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వారిపై లైంగికదాడి చేసి హత్య చేసినట్టు తెలుస్తున్నా హోంమంత్రికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఆడబిడ్డల ప్రాణాలు అంత చులకనైపోయాయా? ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. రేవంత్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎంపీలను అమ్మేసిన ఘనుడు

పరిపాలించడం చేతగాని రేవంత్‌రెడ్డి అమ్మడం, కొనడంలో మాత్రం అరితేరారని కేటీర్ దెప్పిపొడిచారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో రాష్ర్టానికి చెందిన ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను మేకలు, గొర్రెల మాదిరిగా బీజేపీకి బేరంపెట్టారని ఎద్దేవా చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీడియా, పీఆర్ మేనేజ్‌మెంట్‌పై నడుస్తున్నదని ఎద్దేవా చేశారు.

ముస్లిం ఓట్ల కోసమే అజారుద్దీన్‌కు గాలం

అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. క్రికెట్‌లో స్క్వేర్‌కట్లతో అలరించిన మాజీ క్రికెటర్‌ను సైతం రేవంత్‌రెడ్డి రాజకీయ స్క్వేర్ కట్‌తో బోల్తా కొట్టించారని పేర్కొన్నారు. ముస్లిం ఓట్ల కోసం ఎమ్మెల్సీగా ఎంపిక చేసినట్టు ఆయనను భ్రమలో ముంచుతున్నారని అన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికలపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్న సమయంలో అజారుద్దీన్ ఎంపికను గవర్నర్ ఆమోదించే పరిస్థితిలేదని అన్నారు.

సీఎం కుటుంబానికే 'వికాసం'

యువ వికాసం పేరిట యువత నుంచి లక్షల దరఖాస్తులు తీసుకున్న కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు మొండి చెయ్యి చూపుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఏ వర్గానికీ వికాసం లేదని, ముఖ్యమంత్రి, ఆయన కుటుంబానికి, బంధువులకు వికాసం కలుగుతున్నదని చెప్పారు.

మోదీ మెప్పుకోసమే సీబీఐ విచారణ

ప్రధాని మోదీ మెప్పు పొంది పదవిని కాపాడుకొనేందుకే కాళేశ్వరంపై రేవంత్ సీబీఐ విచారణకు ఆదేశించారని కేటీఆర్ ఆరోపించారు. మంత్రులకు సైతం తెలియకుండా మోదీ, బండి సంజయ్ డైరెక్షన్‌లోనే ఎంక్వైరీ డ్రామాలకు తెరలేపారని విరుచుకుపడ్డారు. బీజేపీ, రేవంత్ సర్కారు, సంజయ్ చీకటి ఒప్పందాలకు అనేక సాక్ష్యాలు ఉన్నాయని చెప్పారు. 'పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ చేసి ఏడాదైనా వివరాలు ఎందుకు వెల్లడించడం లేదు? సెర్చ్ పంచనామా చేయలేదెందుకు? సోదాల్లో భాగంగా నోట్లు లెక్కించే యంత్రాలను తీసుకెళ్లి సాధించిందేంటి?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

అమ్ముకున్నారని అభ్యర్థులే చెప్పారు

అన్ని వర్గాల మాదిరిగానే నిరుద్యోగులకు కూడా రేవంత్‌రెడ్డి శఠగోపం పెడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్రూప్-1లో జరిగిన అక్రమాలే ఇందుకు నిదర్శనమని స్పష్టంచేశారు. రూ. 3 కోట్లకు ఉద్యోగాలను అమ్ముకున్నారని అభ్యర్థులే ఆరోపించిన విషయాన్ని ప్రస్తావించారు. డబ్బులు తీసుకున్న మంత్రుల పేరుచెప్పినా విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతతో పెట్టుకుంటే పతనంకాక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మైత్రీ బంధంతోనే బీజేపీ మౌనం

రాష్ట్రంలో అనేక అరచకాలు జరుగుతున్నా, గ్రూప్-1పై విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నా బీజేపీ నాయకులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ నిలదీశారు. రేవంత్‌తో మైత్రీబంధం కారణంగానే నోరు విప్పడం లేదని విమర్శించారు.

42 శాతం కోటాపై కపట నాటకం


బీసీలకు 42 శాతం కోటాపై కాంగ్రెస్ కపట నాటకం ఆడుతున్నదని కేటీఆర్ ఫైర్ అయ్యారు. మీడియాకు లీకులిస్తూ బలహీనవర్గాల బిడ్డలతో చెలగాటమాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవో, ఆర్డినెన్స్‌ల పేరిట డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు.

> కాంగ్రెస్ హయాంలో అవినీతికి, బంధుప్రీతికి తావులేదని నాడు ఓట్ల ముందర గప్పాలు కొట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు వాటినే విధానాలుగా మార్చుకున్నారు. తన బావమరిది సృజన్‌రెడ్డి, అన్న అమిత్‌రెడ్డికి, మామ పద్మారెడ్డికి కాంట్రాక్టులు ఎందుకిచ్చారు?
> -కేటీఆర్

స్థానిక ఎన్నికలపై వెనుకడుగు ఎందుకు?

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని చెప్తున్న కాంగ్రెస్ సర్కారు స్థానిక ఎన్నికల నిర్వహణకు ఎందుకు వెనుకాడుతున్నదని కేటీఆర్ ప్రశ్నించారు. నాడు ఓట్ల కోసం ఇచ్చిన హామీలకు పాతరేసిన హస్తం పార్టీకి ప్రజల దగ్గరికి వెళ్లే ధైర్యంలేకే ముఖం చాటేస్తున్నదని తూర్పారబట్టారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమని హెచ్చరించారు.

> గ్రూప్-1లో జరిగిన అక్రమాలు జరిగాయని సాక్షాత్తూ హైకోర్టే ఆధారాలతో బయటపెట్టింది. సర్కారు మాత్రం అప్పీల్ అంటూ కొత్త నాటకం ఆడుతున్నది. రూ. 3 కోట్లకు ఉద్యోగాలు అమ్ముకున్నారని అభ్యర్థులే ఆరోపిస్తున్నారు.
> -కేటీఆర్



తెలంగాణభవన్‌లో ఆటో కార్మికులతో చర్చిస్తున్న కేటీఆర్, వేముల మారయ్య

మహాలక్ష్మి పథకంతో ఉపాధి కరువు

కేటీఆర్‌తో గోడు వెళ్లబోసుకున్న ఆటోరిక్షా కార్మికులు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పేరుతో కాంగ్రెస్ తీసుకొచ్చిన ఉచిత ప్రయాణం వల్ల తాము ఉపాధి కోల్పోయి, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, విధిలేని పరిస్థితుల్లో కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆటోరిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు వేముల మారయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మిక నాయకులతో కలిసి బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత తమకు ఆర్థిక సమస్యలు పెరుగుతూ వచ్చాయని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్ హయాంలో తమకు అమలైన రూ.5 లక్షల ప్రమాద బీమా కాంగ్రెస్ సర్కారు అమలు చేయడం లేదని మండిపడ్డారు. మైనారిటీలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం పర్మిట్లతోపాటు సబ్సిడీతో ఆటోలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో తమకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌కే మద్దతునిస్తామని ఆటోరిక్షా కార్మికులు ఏకగ్రీవంగా తీర్మానించుకున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా తమకు 10 లక్షల వరకు ఓట్లు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో సాయి, మహేశ్, స్వామిదాసు, రమేశ్ తదితరులు ఉన్నారు.

మూర్ఖత్వంతోనే ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వే రద్దు

ఎలాంటి భూ సేకరణ అవసరం లేకుండా కేసీఆర్ హయాంలో రూపొందించిన ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రభుత్వం మూర్ఖంగా రద్దుచేసిందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. గతంలో ఎక్స్‌ప్రెస్ వే భూమిని ఓఆర్‌ఆర్ ప్లాన్‌లో ఉంచామని, మెట్రో రైలు కోసం ఉంచిన భూమిని ప్రస్తుతం వాడుకోవచ్చని చెప్పినా వినలేదని మండిపడ్డారు. సర్కారు తెలివిలేని నిర్ణయంతో ఐటీ పరిశ్రమకు నష్టంవాటిల్లే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒక మంత్రేమో మొన్న మా ప్రభుత్వం మళ్లా వచ్చేది లేదు..సచ్చేది లేదని అంటున్నరు. మరో మంత్రేమో రీజినల్ రింగ్ రోడ్డు అయ్యేది కాదు..పోయేది కాదు అని చెప్తున్నరు. ముఖ్యమంత్రి మాత్రం రెండేండ్లలో పూర్తిచేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. అని ఎద్దేవా చేశారు.

ట్రిపుల్ ఆర్ అతిపెద్ద స్కామ్

మొదటిపేజీ తరువాయి...

నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు ఎందుకు అలైన్‌మెంట్ మార్చాల్సి వచ్చిందో రైతులకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పు వల్ల ట్రిపుల్‌ఆర్ భూసేకరణలో ఇబ్బందులు పడుతున్న వికారాబాద్ జిల్లా రైతులకు అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. చట్టప్రకారమే భూ సేకరణ జరగాలని, ఇష్టానుసారంగా పేదల భూములను లాక్కుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) అలైన్‌మెంట్ మార్పుతో భూములు కోల్పోతున్న వికారాబాద్ జిల్లా రైతులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చి కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్.. తమ పార్టీ ప్రతినిధులు బాధిత రైతులతో వస్తారని, వారికి పూర్తి వివరాలు వెల్లడించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో, అనంతరం మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్ కీలక విషయాలను వెల్లడించారు.



తమ భూములు కాపాడాలంటూ తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న వికారాబాద్ జిల్లా దేవరంపల్లికి చెందిన ట్రిపుల్‌ఆర్ బాధితులు

పేదల భూములే ఎందుకు పోతున్నాయ్?

ప్రభుత్వం సేకరించే భూమిని ఎందుకు తీసుకుంటున్నదో చాలా స్పష్టంగా చెప్పాలని, ఎంత తీసుకుంటున్నదో కూడా స్పష్టంచేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల మీదుగా అలైన్‌మెంట్ రూపొందించామని గుర్తుచేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చాల్సి వచ్చిందో తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలైన రంజిత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భూములు అలైన్‌మెంట్‌లో పోవడం లేదు. కానీ పేదల భూములు మాత్రమే ఎందుకు పోతున్నాయని ప్రశ్నించారు. గ్రామస్థులందరూ ఒక్కమాటపై నిలబడాలని, విడివిడిగా సంతకం చేయొద్దని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేను తీసుకొని సీఎం వద్దకు వెళ్లి సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. కచ్చితంగా భూసేకరణ చట్టం ప్రకారమే భూ సేకరణ లక్ష్యాలు ఉండాలని సూచించారు. అవసరమైతే భూములను కోల్పోతున్న ప్రతి రైతుకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సొంత ఎజెండాతోనే భూసేకరణ

గతంలో ఔటర్ రింగ్ రోడ్డు భూసేకరణలో ఆనాటి కాంగ్రెస్ సర్కార్ సొంత అజెండాతోనే ముందుకెళ్లిందని, ఇప్పుడు రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణలోనూ ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సొంత అజెండాతోనే వ్యవహరిస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఒరిజినల్ అలైన్‌మెంట్ కాకుండా సొంత డబ్బుతో రహదారి కడుతున్నామని చెప్పి తమ వారి భూములను కాపాడుకునేందుకు అడ్డగోలుగా అలైన్‌మెంట్‌నే మార్చే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. అందుకోసం వేలాదిమంది రైతుల జీవితాలను చీకటిమయం చేస్తున్నదని తెలిపారు. వికారాబాద్‌లో అలైన్‌మెంట్ మార్పు వల్ల భూములు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ బీఆర్‌ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని, అవసరమైతే వారి తరపున న్యాయ పోరాటం చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

పేదల భూములకు నష్టం కలిగించొద్దు

వికారాబాద్ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులందరినీ కలుపుకొని ముందుకెళ్తామని కేటీఆర్ వెల్లడించారు. ట్రిపుల్ ఆర్‌ను సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భూముల మీదుగా తీసుకెళ్లాలని, పేదల భూములకు నష్టం జరగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే స్థానిక శాసనసభ్యులతో కలిసి స్పీకర్‌తో కూడా మాట్లాడతానని చెప్పారు. ఈ విషయంలో పార్టీలకతీతంగా చొరవ తీసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ బాగుండాలి, ప్రజలు బాగుండాలనేదే తమ ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణ బాధితుల అంశంలో ఏకం కావాలని, పేదలకు నష్టం జరగకుండా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, నాయకులు శుభప్రద్‌పటేల్, కార్తీక్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల నుంచే రోడ్లేయాలె



దేవరంపల్లిలో నాకు ఎకరం 28 గుంటల భూమి ఉన్నది. కొంత ఈత చెట్లు పెట్టిన. కొంత కూరగాయలు పెట్టిన. ఇప్పుడు ఈ భూమి రోడ్డు విస్తరణలో పోతుందని చెప్తున్నరు. మేమెట్ల బతకాలె?. పిల్లలకు ఏం పంచి ఇవ్వాలె? పేదల భూముల నుంచి రాకుండా గుట్టలు, ప్రభుత్వ భూముల నుంచి రోడ్లు వేయాలి.

-జీ వీరాగౌడ్, దేవరంపల్లి, మోమిన్‌పేట మండలం, వికారాబాద్ జిల్లా

రేవంత్, జైపాల్‌రెడ్డి కుటుంబసభ్యుల కోసమే

ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు నిధులు లేవంటున్న ప్రభుత్వం.. ట్రిపుల్ ఆర్ కోసం మాత్రం తమ భూములకు లాభం చేకూర్చడానికి భూములు తీసుకుంటామని చెప్తున్నదని కేటీఆర్ విమర్శించారు. ట్రిపుల్ ఆర్, ఫోర్త్ సిటీకి మధ్యలో వేస్తున్న రోడ్డు కేవలం సీఎం రేవంత్‌రెడ్డి, దివంగత కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి కుటుంబసభ్యుల భూముల కోసమేనని, ఈ రోడ్డు వెంబడి అనేక మందితో భూములు కొనుగోలు చేయించి ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ఎలాంటి భూసేకరణ అవసరం లేకుండా రూపొందించిన ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ వేని రేవంత్‌రెడ్డి రద్దుచేశారని విమర్శించారు. గతంలోనే ఎక్స్‌ప్రెస్ వే కోసం భూమిని ఔటర్ రింగ్ రోడ్డు ప్లాన్‌లో ఉంచామని, మెట్రో రైల్ కోసం ఉంచిన భూమిని ప్రస్తుతం వాడుకోవచ్చని చెప్తున్నా, ఈ ప్రభుత్వం మూర్ఖంగా రద్దు చేసిందని మండిపడ్డారు. ఒక మంత్రి 'మా ప్రభుత్వం వచ్చేది లేదు, చచ్చేది లేదు' అంటుంటే, ఇంకొక మంత్రి 'రీజినల్ రింగ్ రోడ్డు వచ్చేది లేదు' అని అంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

మాకున్న భూమినంతా తీసుకుంటరట!



రీజినల్ రింగు రోడ్డు కోసం మాకున్న భూమినంతా తీసుకుంటరట. మావోడి ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. మాకున్నదే ఒక ఎకరం మూడు గుంటలు. అదే మా కుటుంబానికి ఆధారం. మా ఆయన జరిగిపోయిండు. కొడుకు పోయిండు. మనమడితో బతుకుతున్న ఉన్న భూమినంతా సర్కారే గుంజుకుంటే నేను, వాడు ఎట్ల బతుకుతం. మీరే న్యాయం చేయాలి.

-రుక్కమ్మ, దేవరంపల్లి, మోమిన్‌పేట మండలం, వికారాబాద్ జిల్లా

ఇద్దరు కొడుకులకు ఏం పంచి ఇయ్యాలె



నా పేరు మీద ఎకరం ఐదు గుంటలు, మా ఆయన పేరు మీద ఎకరం ఎనిమిది గుంటల భూమి ఉన్నది. రెండు చోట్ల ఉన్న భూమిని ఇప్పుడు రోడ్డు కోసం సర్కారోళ్లు తీసుకుంటరట. ఇదెక్కడి న్యాయం. మాకున్న ఇద్దరు కొడుకులకు ఏంపంచి ఇయ్యాలె. భూమే మాకు ఆధారం. అదిపోతే మా జీవనాధారమే పోతది.

-లక్ష్మి, దేవరంపల్లి, మోమిన్‌పేట మండలం, వికారాబాద్ జిల్లా


అలైన్‌మెంట్ మార్చిన్రంట



గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏసిన అలైన్‌మెంట్ ప్రకారం.. మా భూములు పోకపోతుండె. కాంగ్రెస్ వచ్చినంక కొందరు పెద్దల కోసం రోడ్డు అలైన్‌మెంట్ మార్చినట్లు చెప్తున్నరు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ఇక్కడ భూములు కొన్నరట.. వారి భూముల్ని కాపాడేందుకు మాలాంటి పేదల భూముల వైపు రోడ్లు మార్చుతున్నరట. ఇప్పుడు నాకున్న ఎకరం భూమి పోయే ప్రమాదమొచ్చింది. ఇప్పుడు నేనేం చేయాలె? నా కొడుకులకు ఏం చెప్పాలె?

-చాకలి రాములు, దేవరంపల్లి, మోమిన్‌పేట మండలం, వికారాబాద్ జిల్లా

లోకం పోకడ



వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వం అవుటాఫ్ స్టేషనే!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.8°c	22.7°c
మెదక్	35.8°c	23.5°c
రంగారెడ్డి	32.4°c	20.8°c
ఖమ్మం	32.0°c	23.0°c
హైదరాబాద్	32.0°c	22.0°c
నిజామాబాద్	31.3°c	24.2°c
వరంగల్	31.0°c	21.0°c
కరీంనగర్	31.0°c	24.0°c
నల్లగొండ	30.5°c	23.4°c
మహబూబ్‌నగర్	28.0°c	23.0°c

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

ఇద్దరు రైతుల ఆత్మహత్య

- **భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు**
- **అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపం**
- **మెదక్, నిర్మల్ జిల్లాల్లో ఇద్దరి బలవన్మరణం**

చిన్నశంకరంపేట/పెంబి, సెప్టెంబర్17 : భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడం.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపంతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కామారం గిరిజన తండాకు చెందిన రైతు లంబాడీ రవీందర్(45) కూతుళ్ల పెండ్లిళ్ల కోసం రూ.3.5 లక్షలు. కూరగాయల సాగుకోసం మరో రూ.2 లక్షలు అప్పు చేశాడు. భారీ వర్షాలకు కూరగాయల పంట దెబ్బతింది. దీంతో మనోవేదనకు గురై మంగళవారం పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వర్షానికి పంట కొట్టుకుపోయిందని..

పెంబి మండలం మందపల్లికి చెందిన రైతు బొమ్మెన పెద్దులు(51) తనకున్న రెండెకరాల్లో పత్తి, పసుపు వేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పత్తి, పసుపు పంట కొట్టుకుపోయింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని మంగళవారం ఉదయం తన చేనులో పురుగుల మందు తాగాడు.

అలైన్‌మెంట్ మార్పుపై భగ్గుమన్న రైతులు

- **సాగర్ రోడ్డుపై ట్రిపుల్ ఆర్ బాధితుల ఆందోళన**
- **పోలీసులు, రైతుల మధ్య తోపులాట**
- **రంగారెడ్డి జిల్లా అన్నెబోయినపల్లి వద్ద ఉద్రిక్తత**
- **ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సీపీఎం నేత మద్దతు**
- **రైతులు, మాజీ ఎమ్మెల్యే అరెస్టు.. యాచారం పీఎస్‌కు తరలింపు**

రంగారెడ్డి, సెప్టెంబర్ 17 (నమస్తేతెలంగాణ): ట్రిపుల్ ఆర్ బాధితుల ఆందోళనతో సాగర్ రోడ్డు దద్దరిల్లింది. రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చడాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని బాధిత గ్రామాల రైతులు బుధవారం హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై అన్నెబోయినపల్లి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, రైతులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, బీఆర్‌ఎస్ మాడ్గుల మండల నాయకుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాడ్గుల మండలంలోని అన్నెబోయినపల్లి, కొత్తబ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, మాడ్గుల, నల్లచెరువు, కలకొండ, చంద్రాయన్‌పల్లి గ్రామాల నుంచి బాధిత రైతులు, మహిళలు పెద్ద ఎత్తున అన్నెబోయినపల్లి గేటు వద్దకు చేరుకున్నారు. సాగర్ రోడ్డుపైకి రావడానికి ప్రయత్నించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసు వలయాన్ని ఛేదించుకుని సాగర్ రోడ్డుపైకి చేరుకుని బైఠాయించారు. పోలీసులు వెంటనే వారిని బలవంతంగా అరెస్టుచేసి వ్యాన్లలో ఎక్కించారు. పోలీసులు, రైతులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, రైతు నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులను బలవంతంగా అరెస్టుచేసి యాచారం పోలీసుస్టేషన్‌కు తరలించారు.



గుడిమల్కాపురంలో ట్రిపుల్ ఆర్ బాధితుల ఆందోళన

పెద్దల భూముల కోసమే అలైన్‌మెంట్ మారిందని ఆవేదన

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 17: బడాబాబుల భూములు కాపాడటం కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి పేద రైతుల భూములు గుంజుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బాధిత రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం వారు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం వద్ద చౌటుప్పల్– నారాయణపురం వెళ్లే రహదారిపై బైఠాయించారు. ఎస్సై జగన్ వచ్చి వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

పెద్దల కోసం పేద రైతులను బలిచేస్తారా? : జైపాల్‌యాదవ్

ముఖ్యమంత్రి బంధువులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పేద రైతులను బలిచేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మండిపడ్డారు. సాగర్ రోడ్డుపై ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీజనల్ రింగ్‌రోడ్డు కోసం ప్రతిపాదనలు తయారుచేసిందని, అప్పట్లో రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి బంధువుల భూములు కాపాడటం కోసం అలైన్‌మెంట్‌ను మార్చిందని విమర్శించారు. మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు, ఫారూక్‌నగర్, కేశంపేట, కొందుర్గు మండలాలకు చెందిన వేలాదిమంది సన్న,చిన్నకారు రైతుల భూములు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే పనులు చేపట్టాలని, అప్పటివరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.



జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కేటీఆర్ తదితరులు

తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ

- **తెలంగాణభవన్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ అని, ఆనాటి సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని 1969 తెలంగాణ ఉద్యమమైనా, కేసీఆర్ నాయకత్వంలో మలిదశ పోరాటమైనా, ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటమైనా.. వీటన్నింటికీ బీజం పడింది తెలంగాణ సాయుధ పోరాటంతోనేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దామని పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి మనకు స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన అమరవీరులకు బీఆర్‌ఎస్ తరపున, కేసీఆర్, ప్రతి గులాబీ సైనికుడి తరపున శిరసు వంచి వినమ్రంగా నివాళులర్పిస్తున్నాం' అని పేర్కొన్నారు. తెలంగాణలో తిరిగి సంక్షేమ రాజ్యం రావాలనిపోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూనాచారి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, నాయకులు ఆర్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, తుల ఉమ, దూదిమెట్ల బాలరాజుయాదవ్, చిరుమళ్ల రాకేశ్, వెంకటేశ్వర్‌రెడ్డి, గజ్జెల నగేశ్, సుమిత్రా ఆనంద్, కురవ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఫీజులపై దాగుడుమూతలు

కేసీఆర్ సుస్థిరపాలనలో గాడినపడ్డ తెలంగాణ బతుకుబండి కాంగ్రెస్ రాకతో ఆగమాగమైంది. దాదాపుగా అన్నిరంగాలూ పడకేశాయి. అందులో భావిభారత పౌరులను తీర్చిదిద్దే విద్యారంగం కూడా సర్కారు చేతకానితనం వల్ల సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా వృత్తివిద్యా కళాశాలల ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం కొత్త సర్కారు వచ్చిన తర్వాత పూర్తి నిర్లక్ష్యానికి గురవుతుండటంతో విద్యార్థులు, వారితల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. గత 20 నెలలుగా నాన్చుతూ వస్తున్న ప్రభుత్వం ఇప్పటికీ తగిన రీతిలో స్పందించకపోగా కాలేజీల తప్పులెన్నే పనిలో పడుతున్నది. భారత సాంకేతిక విద్యామండలి తనిఖీల్లో వెల్లడైన అంశాలను బయటకి తీసి కాలేజీలను బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తున్నది. అంతిమంగా ప్రభుత్వం చెప్పేదేమిటంటే.. 'నిధులు లేవు, అన్నీ పథకాలకే ఖర్చయ్యాయి' అని. ఈ నేపథ్యం లో 'ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది సర్కారు పథకం కిందకు రాదా?' అనే ప్రశ్న తలెత్తుతున్నది. ఫీజు బకాయిలు చెల్లించడానికి డబ్బులు లేవంటున్న సర్కారుకు ప్రాజెక్టులకు విడుదల చేయడానికి మాత్రం నిధులు ఎలా వస్తున్నాయనే దానికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

స్వరాష్ట్ర సాధన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. సమూలమైన మార్పులు తెచ్చారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచారు. కాలేజీలపై కట్టుదిట్టమైన అజమాయిషీ తెచ్చారు. తద్వారా ప్రజాధనాన్ని మిగిలించడమే కాకుండా చదువుల నాణ్యత మెరుగుపడేలా చేశారు. నిజానికి ఉమ్మడి సర్కారు రోజుల నుంచీ బకాయిల సమస్య ఉంది. ప్రతి మూడేండ్లకు ఓసారి ఫీజుల పెంపకం వల్ల బకాయిలు కూడా పెరుగుతున్నాయి. అయినా ఉమ్మడి సర్కారు బకాయిలను బీఆర్ఎస్ సర్కారు చెల్లించింది. అంతేకాదు, ఏటా రూ.2,400 కోట్లు విడుదల చేస్తూ వచ్చింది.

కల్లబొల్లి కబుర్ల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కథ మళ్లీ మొదటికి వచ్చింది. కాలేజీ విద్యలో నాణ్యత పరిశీలనను గాలికొదిలేయడమేకాకుండా నిధుల విడుదలనూ నిలిపివేసింది. బకాయిల కోసం కాలేజీలు పట్టుబట్టడంతో తొలివిడతగా రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ఏడాది క్రితం రేవంత్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ, అందులో ఒక్క పైసా చెల్లించకపోవడంతో మొన్న 15వ తేదీ నుంచి కళాశాలలు నిరవధిక సమ్మె చేస్తామని ప్రకటించాయి. ఇట్లా కాలేజీలన్నీ ఏకమై సర్కారు మీదపోరు చేయడం ఇదే తొలిసారి. పాత బకాయిలతో మాకేం సంబంధం అంటూ కొందరు మంత్రులు వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. పాత బకాయిలు విడుదల చేయడంతోపాటు 2025-26 సంవత్సరానికి రీయింబర్స్‌మెంట్ ఫీజులను రెండు లేదా మూడు వాయిదాల్లో ఇచ్చేలా స్పష్టమైన విధానాన్ని ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు బంద్ నిర్వహించడం సహజమే. కానీ, విద్యాసంస్థలు బంద్ పిలుపునివ్వడం కాంగ్రెస్‌అసమర్థ విధానాలకు అద్దం పడుతున్నది. చర్చల సందర్భంగా కాలేజీ యాజమాన్యాలను ప్రభుత్వం మడతపేచీలు పెట్టి, మెడలు వంచాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు తొలివిడతగా రూ.600 కోట్లు విడుదల చేసేందుకు సర్కారు అంగీకరించింది. కాలేజీలకు ఇచ్చినా, ఖాతాల్లో వేసినా సకాలంలో చెల్లించడం ముఖ్యమని ప్రభుత్వం గుర్తించాలి. ఉన్నతవిద్య పూర్తిచేసుకుని, ఉపాధి వెతుక్కోవాలని తహతహలాడే లక్షలాది బడుగు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సరికాదు.

అది భాషాప్రయుక్త కమిషన్ కాదు



దంటు కనకదుర్గ

భారతదేశానికి స్వాతంత్య్రం రాగానే అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ పటేల్ దేశంలో అప్పటిదాకా స్వతంత్రంగా ఉన్న అనేక రాచరిక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేశాడు. దాదాపు 562 సంస్థానాలను భరణం ఇచ్చి, బెదిరించి, బతిమిలాడి-అనేక రకాలుగా విజయం సాధించిన సర్దార్‌కు రెండు పెద్ద రాష్ర్టాలు సవాలుగా నిలిచాయి. అవే కశ్మీర్, హైదరాబాద్. ఈ రెండింటి మధ్య ఒక తేడా ఉంది. హైదరాబాద్ రాష్ట్రంలో హిందువులు 90 %, ముస్లింలు 10 % మంది ఉండగా, పాలకుడు మాత్రం ముస్లిం. కశ్మీర్‌లో ముస్లింలు 90 %, హిందువులు 10 % మంది ఉండగా, పాలకుడు హిందువు. మొదట్లో అప్పటి రాజు హరిసింగ్ ఇండియాతో గాని, పాకిస్థాన్‌తో గాని కలవకుండా స్వతంత్రంగా ఉండాలని భావించాడు. కానీ, అక్కడ జరిగిన గిరిజన దండయాత్రకు పాకిస్థాన్ సహాయం చేసేటప్పటికి భయపడి, 1947 అక్టోబర్‌లో ఇండియాలో తన రాజ్యాన్ని విలీనం చేశాడు. అయితే వారికి ముస్లిం పక్షపాతి నెహ్రూ చాలా రక్షణలు- ఇతర భారతీయులు వారి రాష్ర్టాన్ని ఆక్రమించకుండా హామీ ఇచ్చి, ప్రత్యేకంగా 370 బిల్లును రూపొందించి సత్కరించాడు.

అదే నెహ్రూ హిందువులు ఎక్కువగా ఉండి, కశ్మీర్ కంటే పెద్దదైన హైదరాబాద్ దేశాన్ని మాత్రం మిలిటరీ బలంతో, మోసంతో, ఏ రకమైన రక్షణలు కల్పించకుండా భారతదేశంలో విలీనం చేశాడు. ఆ మిలిటరీ వారి అరాచకాల కింద 1948 సెప్టెంబర్ నుంచి 1952 మార్చి దాకా తెలంగాణ ప్రజలు దారుణమైన కష్టాలు అనుభవించారు. 50,000 మంది సైనికుల్లో అప్పుడు మద్రాసు రెజిమెంట్‌లో ఉన్న ఆంధ్రవారు కూడా ఉన్నారు. వారు మిగతా వారు చేసిన దారుణాల్లో పాలుపంచుకోవడమే కాకుండా, ఇక్కడ తమ స్థలాలు వదిలేసి పాకిస్థాన్‌కు వెళ్లిపోయిన వారి స్థలాలు, ఇళ్లు కబ్జాచేసి ఇక్కడే స్థిరపడిపోయారు. ఈ రకంగా 1952లో స్థానిక ప్రభుత్వం ఏర్పడేలోపే కొందరు ఆంధ్రవారు, భారతదేశానికి చెందిన ముస్లింలు తెలంగాణలో స్థిరపడిపోయారు.

> చాలామందికి తెలియని విషయం ఏమంటే.. ఈ భారతీయ ముస్లింలు తెలంగాణ ముస్లింలతో కలవలేకపోయారు. ఉన్నత సంస్కారం కలిగిన స్థానిక ముస్లింలు మొదట్లో ఈ వలస ముస్లింలకు దూరంగానే ఉండేవారు. వారి మధ్య పెండిళ్లు జరిగేవి కావు. సామాజిక సంబంధాలు కూడా ఉండేవి కావు. మతం ఒక్కటైనా సంస్కారం ఒక్కటి కాదు కదా!

ఈ సంస్థానాల విలీనంతో భారతదేశంలో రాష్ర్టాలకు ఎల్లలు ఏర్పర్చి, ఒక పద్ధతి ప్రకారం దేశాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద పడింది. అప్పటికే వివిధ ప్రాంతాల్లో వారి స్థానిక భాషలు, తమ సాహిత్యాలతో సహ పరిపుష్టంగా తయారవడంతో భాషా ప్రాతిపదికన రాష్ర్టాలను ఏర్పర్చాలని అప్పటి ప్రధాని నెహ్రూ భావించాడు. ఈ ప్రకటనను 1953, డిసెంబర్ 22న పార్లమెంట్‌లో చేశాడు. 1953, డిసెంబర్ 23న సంబంధిత కమిషన్ ఏర్పడింది. అప్పుడు ఒరిస్సా గవర్నర్‌గా ఉన్న సయ్యద్ ఫజల్ అలీ చైర్మన్ గానూ, కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో సభ్యుడిగా ఉన్న హృదయనాథ్ కుంజ్రూ, ఈజిప్ట్‌లో భారత రాయబారిగా ఉన్న మాధవ ఫణిక్కర్ సభ్యులుగానూ 1953, డిసెంబర్ 29న త్రిసభ్య కమిషన్ ఏర్పడింది. దాన్నే రాష్ర్టాల పునర్వ్యవస్థీకరణ కమిటీ అంటా రు (స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమిషన్-ఎస్ఆర్‌సీ).

ఈ కమిషన్ తన విధి విధానాలను రూపొందించుకుంటూ కొన్ని విషయాలు స్పష్టంగా చెప్పింది. ఒక రాష్ట్ర ప్రతిపత్తిని నిర్ణయించడానికి భాషనే కాకుండా, ఆ ప్రాంత సంస్కృతిని, ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని, చారిత్రక అంశాలను కూడా గమనించాలని కమిషన్ నిర్ణయించింది. దాదాపు వెయ్యేండ్ల తర్వాత సంపూర్ణ స్వాతంత్య్రం పొందిన దేశంలోని రాష్ర్టాన్ని, మరో దేశంగా విలసిల్లిన తెలంగాణ ప్రాంతంతో కలపటానికి ఎంతో విశాల భావనలతో కమిషన్ ఇచ్చిన సిఫారసు ఏమిటో, దానికి వ్యతిరేకంగా నెహ్రూ రెండు రాష్ర్టాలను ఎలా కలిపాడో తెలుసుకుంటే విస్తుపోవాల్సిందే!

రెండు ప్రాంతాల ప్రజలు తమ నివేదికలు, అభ్యర్థనలు సమర్పించుకోవటానికి 1954, ఫిబ్రవరి 23 నుంచి ఏప్రిల్ 24 దాకా ఫజల్ అలీ కమిషన్ గడువు ఇచ్చింది. సుమారు 2 వేల అభ్యర్థనలను పరిశీలిస్తూనే, 1954, జూన్ 29 నుంచి కమిషన్ తన విచారణను ప్రారంభించింది. రాజకీయ పార్టీల నాయకులు, సంస్థల అధిపతులు చాలామంది కమిషన్ ముందు తమ వాదనలు వినిపించారు. ఆంధ్ర ఉద్యమ యోధులందరూ కలిసి విశాలాంధ్ర వాదనలు వినిపించారు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఉంచాలని కోరుతూ కమిషన్‌ను కలిసినవారిలో కేవీ రంగారెడ్డి, జేవీ నర్సింగరావు, హరిశ్చంద్ర హెడా, అరిగె రామస్వామి మొదలైనవారు ఉన్నారు. వీరు నిజాం రాష్ట్రంలో శతాబ్దాల తరబడి ఉన్న ఇతర ప్రాంతాలను కూడా, వారు తెలుగువారు కాకపోయినా, తెలంగాణలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కమిషన్ సభ్యులు రాజ్‌భవన్‌కు వెళ్లి నిజాంను కూడా కలిసి చర్చించారు. హైదరాబాద్‌లోనే కలపాలని ఆంధ్రవారు చెప్పగా, ఆంధ్రులతో కలిసి ఉండటానికి తెలంగాణవారిలో ఒక్కరూ ఆమోదించకపోవడంతో ఇంకా విస్తృత చర్చల కోసం తెలంగాణ జిల్లాల్లో పర్యటన చేసింది కమిషన్. చాలామంది అభిప్రాయాలను సేకరించింది. హైస్కూల్ విద్యార్థుల దగ్గర్నుంచి, అరువై ఏండ్లు పైబడిన వారి దాకా అందరూ ఆంధ్రతో కలవడాన్ని వ్యతిరేకించారు. శ్రీరామిని మృత్యుంజయ లింగం, దుగ్గిశెట్టి వెంకటయ్య గుప్తా కమిషన్‌ను కలిసి తమ అభిప్రాయాన్ని నివేదించారు. 'తమిళుల నుంచి విడిపోవాలని మాత్రమే ఆంధ్రులు ఉద్యమం చేశారు. ఆర్థికంగా చితికిపోయినవారిని సంపన్న రాష్ట్రమైన తెలంగాణతో కలిపితే తెలంగాణకే తీవ్ర నష్టం. అప్పటిదాకా ఆంధ్రులతో ఉన్న పరిచయాన్ని బట్టి చూస్తే, వారు తెలంగాణను ఆక్రమించుకొని ఈ ప్రాంత ప్రజలను అణచేస్తారు' అని వారు గట్టిగా చెప్పారు.



> హైదరాబాద్‌లో అప్పుడే ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఆనందరావు తోట.. కమిషన్ అపాయింట్‌మెంట్ తీసుకొని ఫజల్ అలీని కలిశాడు. ఆ రోజు కేవలం 15 నిమిషాలు మటుకే సమయం ఇచ్చిన ఫజల్ అలీ.. 18 ఏండ్ల యువకుడు, తను కూర్చోమన్నా కూర్చోకుండా నిల్చుని స్వచ్ఛమైన ఉర్దూ భాషలో అనర్గళంగా తెలంగాణ రాష్ట్రం గురించి, వారి సంస్కృతి, చరిత్ర, తెలంగాణ ప్రజల హార్దిక ప్రకృతి గురించి చెప్తుంటే చాలా ముచ్చటపడ్డాడు.

మర్నాడు మళ్లీ తనని కలవాలని రెండు గంటల సమయం కేటాయించాడు. ఆనందరావు తోట మళ్లీ మర్నాడు వెళ్లినప్పుడు ఆంధ్రులతో తెలంగాణ వారి అనుభవాలను కూడా వివరించి, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ వివరాలు, మూడేండ్ల ఆంధ్ర రాజకీయ నాయకులు తమ ప్రజల పట్ల చూపిన నిరాసక్తత, తదితర అన్ని విషయాలను వివరించారు. ఈ రెండు ప్రాంతాలు కలిస్తే ఇంక తెలంగాణ ప్రజలకు విముక్తి ఉండదని, రజాకార్ల సమయంలో కంటే, మిలటరీ చర్య కంటే ఎక్కువ దారుణాలు వారు చూస్తారని చాలా ఆవేదనగా చెప్పారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ స్థాయి నుంచీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అయ్యేదాకా అహర్నిశలు తెలంగాణ ప్రజలను చైతన్యపరుస్తూనే ఉన్నారు వారు.

తెలంగాణ, మరాఠ్వాడా, కన్నడ జిల్లాల్లో పర్యటించి, అదే ఏడాది సెప్టెంబర్ 6 నుంచి కర్నూల్, ఇతర ఆంధ్ర ప్రాంతాల్లో పర్యటించారు కమిషన్ సభ్యులు. 1955 జూలై చివరి వరకు దాదాపు 104 ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. 38,000 మైళ్ల వివిధ రాష్ర్టాల్లో పర్యటించారు.

ఆంధ్ర పాలకుల కథ; తెలంగాణ వ్యథ-12

1955, సెప్టెంబర్ 30న ఫజల్ అలీ కమిషన్ రాష్ర్టాల పునర్విభజన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. నిజానికి ఈ కమిషన్ రాష్ర్టాలను నిర్ణయించడానికే కానీ, భాషాప్రయుక్త రాష్ర్టాలను నిర్ణయించడానికి ఉద్దేశించినది కాదు. ఎస్ఆర్‌సీ అంటే స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమిషన్!

తెలంగాణకు సంబంధించి ఇతర ప్రధాన సిఫారసులను కమిషన్ ఈ విధంగా చేసింది.

1. హైదరాబాద్ (తెలంగాణ), విదర్భలు రాష్ర్టాలుగా 16 రాష్ర్టాలను, 3 కేంద్రపాలిత ప్రాంతాలను ఏర్పాటు చేయాలి.
2. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 45.4 శాతం మంది ఉర్దూ భాష మాట్లాడుతారు. ఆంధ్ర ప్రాంతాన్ని కలిపితే తమ సంస్కృతికి, భాషకు నష్టం కలుగుతుందని వారు భయపడుతున్నారు.
3. ప్రస్తుతం ఆంధ్రలో తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంది. ఆ రాష్ట్రం కోట్ల కొద్దీ అప్పులు చేసింది. తెలంగాణ స్థిరమైన వనరులతో ఖర్చు కంటే ఎక్కువ ఆదాయం కలిగి ఉంది. పరిపాలనా కోణం నుంచి పరిశీలిస్తే, ఆంధ్రతో కలవడం వల్ల తెలంగాణకు ప్రత్యేకంగా ఒనగూడే లాభం ఏమీ లేకపోగా, అపారంగా నష్టం జరిగే అవకాశం ఉంది. ఇక్కడి మిగులు నిధులు ఆంధ్రకు తరలించే ప్రమాదం ఉంది. (పేరా 376)
4. కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీలో తెలంగాణ, ఆంధ్ర విడివిడిగా ఉంటేనే ప్రస్తుతం ఈ ప్రాంతానికి ఉన్న స్వతంత్రత నిలబడుతుంది. ఉమ్మడి రాష్ట్రమైతే, మిగులు నిధుల లాగే జలవనరులను కూడా తెలంగాణ కోల్పోయే ప్రమాదముంది. (పేరా 377)
5. రాజధాని నెపంతో ఆంధ్రలో విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులు హైదరాబాద్, తెలంగాణ జిల్లాల్లో తమ ఉద్యోగాలు ఎగరేసుకుపోతారన్న భయం తెలంగాణవాసులకి చాలా ఉంది. ఇంకా ఆంధ్ర వ్యాపారులు కూడా అధికంగా వలసలు వచ్చి తమ వ్యాపారాలు కొల్లగొడతారనే భావన తెలంగాణవారిలో బలంగా ఉంది. (పేరా 378)
6. తమకు సరిపోయే ఆదాయం ఉండగా; అప్పుల్లో ఉన్న రాష్ట్రంతో కలవటానికి తెలంగాణవారు ఇష్టపడటం లేదు. (పేరా 379)
7. తెలంగాణ ప్రజలు మనస్ఫూర్తిగా, స్వచ్ఛందంగా తమ భవిష్యత్తు గురించి చేసుకునే నిర్ణయాన్ని కేంద్రం గౌరవించాలి. (పేరా 382)
8. రాయలసీమ, ఆంధ్ర మధ్య చేసుకున్న శ్రీబాగ్ ఒడంబడికను గౌరవించలేదని, తమకూ అదే అనుభవం ఎదురవుతుందని తెలంగాణ ప్రజలు భయపడుతున్నారు. (పేరా 383)
8. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడివడి ఆంధ్రప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి మూడేండ్లవుతున్నా, వారి సమస్యలను పూర్తిగా పరిష్కరించుకోలేదు. భూసంస్కరణలకు సంబంధించి విధానమేమీ రూపొందించుకోలేదు. ఇప్పుడు ఈ అసమాన స్థితిలో ఆంధ్రప్రాంతం కలవడం వల్ల తెలంగాణకు పరిపాలనాపరమైన ఇబ్బందులు ఏర్పడుతాయి. (పేరా 385)
9. పై కారణాలు సహేతుకమైనవి కనుక ఈ రెండు ప్రాంతాలను ఇప్పుడు కలపడం తెలంగాణకు చాలా నష్టం. ఈ రాష్ర్టాన్ని ప్రత్యేకంగా, హైదరాబాద్ రాష్ట్రంగా ఏర్పాటుచేయాలి. ఐదు సంవత్సరాల తర్వాత 1961లో హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికల్లో గెలిచిన సభ్యుల్లో 2/3వ వంతు తెలంగాణ సభ్యులు మనస్ఫూర్తిగా అంగీకరిస్తే, అప్పుడు ఆంధ్రరాష్ట్ర విలీనాన్ని హైదరాబాద్ రాష్ట్రం స్వాగతించవచ్చు. (పేరా 386)
10. ఈ ఐదేండ్ల కాలంలో రెండు రాష్ర్టాలు విడివిడిగా స్థిరపడి, ఏ భయాలు, సందేహాలు లేకపోతే 1961లో కలవవచ్చు. (పేరా 387)
11. అప్పుడు కూడా తెలంగాణ శాసనసభ్యులు, ప్రజలు ఉమ్మడి రాష్ర్టాన్ని ఒప్పుకొంటేనే కలపాలి. (పేరా 388)

తెలంగాణ, ఆంధ్ర పరిస్థితులను చక్కగా పరిశీలించి నివేదికలోని 375 పేరా నుంచి 393 పేరా దాకా కమిషన్ ఈ వ్యాఖ్యలు చేసింది. నిజానికి వారు తెలంగాణకు నీళ్లు (నదీజలాలు), నిధులు (మిగులు నిధులు), నియామకాలు (ఉద్యోగాల పంపిణీ)లో నష్టం జరిగే అవకాశం ఉందని స్పష్టంగా గ్రహించారు. ఈ అసమానతలు ఇరు ప్రాంతాల మధ్య భావసమైక్యత కంటే.. వైరాన్ని, వ్యతిరేకతను, వైరుధ్యాన్ని ఇంకా పెంచే అవకాశం ఉంటుందని కూడా గ్రహించారు, నివేదికలో వివరించారు. కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయాలు తెలంగాణ వారిని ఆనందంలో ముంచగా, ఆంధ్ర నాయకులను అశాంతికి, అసంతృప్తికి గురిచేశాయి. వారి ఏడుపులు, కుట్రలు వివరంగా వచ్చే వ్యాసంలో!




నివాళి

సాహిత్య దార్శనికుడు ఎస్వీ రామారావు

తెలుగు సాహిత్యంలో దార్శనిక దృష్టిని, పరిశోధనా వైశిష్ట్యాన్ని సమన్వయపరిచిన ఆచార్య ఎస్వీ రామారావు పేరు సాహిత్య విమర్శా సంప్రదాయంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. 1941 జూన్ 5న వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్‌లో జన్మించిన ఆయన తెలుగు సాహిత్యంలో ఉన్నత విద్యను పూర్తి చేసి ఎంఫిల్, పీహెచ్‌డీ సాధించి బోధన, పరిశోధన, విమర్శ రంగాల్లో విశిష్ట కృషి చేశారు. 19 పీహెచ్‌డీ, 15 ఎంఫిల్ పరిశోధనలకు మార్గనిర్దేశకుడిగా వ్యవహరించిన ఆయన అరుదైన ఖ్యాతి పొందారు.

'తెలుగులో సాహిత్య విమర్శ' ఎస్వీ ముఖ్య రచన. ఇందులో పాశ్చాత్య సిద్ధాంతాల ప్రభావం, తెలుగు విమర్శా బలహీనతలు, బలాలను శాస్త్రీయంగా విశ్లేషించారు. 'The Evolution of Telugu Literary Criticism' ద్వారా తెలుగు విమర్శను అంతర్జాతీయ సాహిత్య పటంలో ప్రతిష్ఠించారు. 'అన్వీక్షణం', 'సమవీక్షణం', 'అభివీక్షణం', 'కావ్యామృతం', 'గ్రంథావలోకనం' వంటి సంపుటాలు ఆయన విమర్శా పటిమకు నిదర్శనం. శ్రీశ్రీ కవిత్వ విశ్లేషణలో రాజకీయ కోణం మాత్రమే కాకుండా శిల్పం, వచన స్వాతంత్య్రం, ప్రజా భావనల అనుసంధానాన్ని ఆయన చూపారు. 'నన్నయ దర్శనం', 'కర్ణపర్వం' వ్యాఖ్యానాల్లో తాత్వికత, సామాజిక సత్యాలను వెలికితీయగా, 'శతాబ్ది కవిత'లో శతాబ్ద కాలపు కవిత్వ పరిణామాన్ని సమగ్రంగా పరిశీలించారు. స్థానికతతో పాటు సమగ్రతకు ఆయన కట్టుబడి ఉన్నారనడానికి 'పాలమూరు సాహితీవైభవం', 'విశ్వనాథ దర్శనం' వంటి రచనలు ఉదాహరణ. సాహిత్య విమర్శలో మానవతా దృష్టిని పెంపొందించినవాడిగా ఆయన గుర్తింపు పొందారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ విమర్శ పురస్కారం, దాశరథి పురస్కారం, సహృదయ సాహితీ పురస్కారం, ఉమ్మెత్తల అవార్డు, జీవీఎస్ సాహితీ పీఠం పురస్కారం, గురజాడ అప్పారావు సాహితీ పురస్కారం, వానమామలై జయంతి పురస్కారం తదితర అనేక అవార్డులు ఆయనను వరించాయి. ఆయన మృతి తెలుగు సాహిత్యరంగానికి తీరని లోటు. అయితే ఆయన రచనలు భవిష్యత్ తరాలకు శాశ్వత మార్గదర్శకంగా నిలుస్తాయి.




రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

వారి ఎత్తిపోతలు సుజలమట!

తెలంగాణ, ఆంధ్రలోని ఒకే తరహా సాగునీటి ప్రాజెక్టుల పట్ల ఒక వర్గం మీడియా ద్వంద్వ వైఖరితో వ్యవహరించడం, సదరు మీడియాలో వెలువడే కథనాలు, వాటి ఉద్దేశం గురించి ప్రధానంగా ఇక్కడ మనం చెప్పుకోవాలి. ఎందుకంటే, తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతుల కండ్లకు గంతలు కట్టి, వాస్తవాలను వక్రీకరించి, ఇక్కడి అన్నదాతల ప్రయోజనాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ, తెలంగాణ సాగు సడుగులిరిగేలా చేసింది, ఇప్పటికీ చేస్తున్నది ఈ పక్షపాతపూరిత కథనాలే.



చంద్రి రాఘవరెడ్డి



నీళ్లు - నిప్పు-3

వాస్తవానికి గాలేరు-నగరి, హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాలు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. కానీ, మీడియా వీటిని 'సుజల స్రవంతి' పథకాలని నొక్కిచెప్తూ, అవి మంచి పథకాలనే భావనను కలిగిస్తున్నది. భారీ ఎలక్ట్రిక్ మోటర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, సొరంగాలు, లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలపై ఆధారపడటం ద్వారా ఈ రెండు పథకాలు లిఫ్ట్ ఆధారిత సాగునీటి ప్రాజెక్టులే తప్ప, గ్రావిటీ ద్వారా నడిచే ప్రాజెక్టులు ఏ మాత్రం కావని స్పష్టమవుతున్నది. ఇవి ఇంచుమించు కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులే.

తెలంగాణ పట్ల చారిత్రక అన్యాయాలు ఎన్నో ఉన్నాయి. గత 60 ఏండ్లలో ఏ పెద్ద ప్రాజెక్టూ గోదావరి, కృష్ణా నదులను సమర్థవంతంగా వాడుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అలుముకున్న 'నిందల' కథనాల వలె ఏపీలోని 'సుజల స్రవంతి' పథకాలపై కథనాలు, వార్తలు ప్రచురితం కాకపోవడంపై తెలంగాణ యువతలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ప్రాజెక్టుల విషయంలో ఆర్థికంగా సాధ్యాసాధ్యాలు, వ్యయం-ప్రయోజనాల విశ్లేషణ, విద్యుత్తు భారం, భూసేకరణ, డీపీఆర్‌లు, ముఖ్యంగా నదీ బేసిన్ల వెలుపల నీటి మళ్లింపులపై పత్రికలు, టీవీ ఛానళ్లలో చర్చలు ఎందుకు జరగడం లేదని వారు ఆలోచిస్తున్నారు.

కృష్ణా, గోదావరి నీటిని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమనేది ప్రభుత్వం, పాలకుల దయకాదు, అది ఆధునిక భారత దేశంలో ప్రతి రైతు హక్కు. ఏపీలో సాగునీటి విజయాల గురించి ఉత్సవాలు జరుపుకోండి. ఎవరూ కాదనరు. కానీ, అదే సమయంలో సాగునీటి కోసం తెలంగాణ చేసే ప్రయత్నాలపై నిందలు వేయడం, ఆరోపణలు చేయడం, లేనిపోని అనుమానాలు వ్యక్తంచేయడం సరికాదు. రెండు రాష్ర్టాల మధ్య పక్షపాత ధోరణితో కూడిన ఈ కథనాలు- రాజకీయాలు, మీడియా సంస్థల్లో లోతుగా పాతుకుపోయిన ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి మీడియా సంస్థలు ఇప్పటికీ హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తుండటం విచారకరం. దశాబ్దాలపాటు కష్టాలను అనుభవించిన తెలంగాణ రైతులు, యువత ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో, పూర్తి స్పష్టతతో ఉన్నారు. పక్షపాత పూరిత మేధావులతో రాజీపడిన ప్రజాస్వామ్య నాలుగో స్తంభం, అంటే మీడియా పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

> 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదంగా సాగిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ గ్రామీణ యువత నేడు తెలంగాణ అవసరాల కోసం గోదావరి, కృష్ణా నదీ జలాలను వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను చాలా నిశితంగా గమనిస్తున్నది. వ్యవసాయం చేసేందుకు తమ తల్లిదండ్రులు పడిన కష్టాలను కండ్లారా చూసిన, సాగునీటి కోసం తమ తాత ముత్తాతలు పడ్డ వ్యథలను విన్న నేటి యువతరం మదిలో పంటలు పండక అప్పుల ఊబిలో చిక్కుకొని వలసపోయిన విషాదకరమైన జ్ఞాపకాలు ఇంకా ఉన్నాయి.

పొట్టకూటి కోసం తమ తల్లిదండ్రులు పట్టణాలకు వలసపోవడం, వృద్ధుల దగ్గర పిల్లలను వదిలివెళ్లడం, గ్రామాలు ఖాళీ అవడం లాంటి భయానక దృశ్యాలను వారు ఇంకా మర్చిపోలేదు. గోదావరి జలాలను వాడుకోవడం; గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ నీటి వాటాలను కాపాడటంలో నేటి పాలకుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం, వైఫల్యంపై గ్రామీణ యువత నేడు ప్రశ్నిస్తున్నది.

కాళేశ్వరం ఫలితంగా తెలంగాణలో కొత్త తరం నిరాశతో కాదు, భవిష్యత్తుపై ఆశతో వ్యవసాయంపై అభిమానం పెంచుకుంటున్నది. రైతుబంధు ద్వారా నేరుగా నగదు సాయం చేయడం, 24 గంటల ఉచిత విద్యుత్తు అందించడం, ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా సమృద్ధిగా సాగునీరు పారడంతో పాటు, ఇతర రైతు సంక్షేమ పథకాల అమలుతో యువత ఇప్పుడు వ్యవసాయాన్ని ఒక ఉపాధిగా భావిస్తున్నారు. ఇప్పుడిప్పుడే వారిలో ఆలోచన మొదలైంది. కాళేశ్వరం లాంటి ప్రయత్నాలు రెండు మూడు దశాబ్దాల కిందటే జరిగినట్లయితే తమ బతుకులు ఎలా ఉండేవోనని అనుకుంటున్నారు. ముఖ్యంగా, ఇంతకాలం ఎందుకు ఆలస్యమైందని యువ రైతులు నేడు ప్రశిస్తున్నారు.

తమకు న్యాయంగా రావాల్సిన కృష్ణా, గోదావరి నీటి వాటా గురించి కూడా ఈ తరానికి పూర్తి అవగాహన ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత నీటి వినియోగం గురించిన అవగాహన కూడా వారికి ఉంది. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తమను మించినవారు లేరని గొప్పలు చెప్తున్న కొన్ని పార్టీల వైఖరిని వారు విమర్శనాత్మకంగా విశ్లేషిస్తున్నారు. రైతులతో కాదు, రైతుల సంక్షేమం కోసం రాజకీయాలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

(వ్యాసకర్త: ప్రొఫెసర్, సోషియాలజీ విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం)

యావత్ ప్రపంచమే మెచ్చిన బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వింతగా వ్యవహరిస్తున్నారు. పూటకో మాట మాట్లాడుతూ నవ్వుల పాలవుతున్నారు. మొన్నటివరకు అభాంబాలు వేస్తూ, ఆరోపణలు చేసిన కాళేశ్వరం నీళ్లనే వాడుకోవాల్సి రావడంతో ఆయన కొత్త అబద్ధాలకు తెరలేపారు. హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపులో భాగంగా మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి నీళ్లు తెస్తామని చెప్తూనే, ఆ నీళ్లు కాళేశ్వరం జలాలు కావని నాలుక మడతేస్తుండటం హాస్యాస్పదం.

నీళ్ల వరద కాదు, కమీషన్ల దురద!



గంగుల కమలాకర్



హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టు శంకుస్థాపన సందర్భంగా గండిపేట వద్ద నిర్వహించిన సభలో సీఎం రేవంత్ మరోమారు తన నోటికి అబద్ధాల పనిచెప్పారు. కాళేశ్వరం ఎప్పుడో కూలిపోయిందని, ఎల్లంపల్లి నుంచి గోదావరి నీళ్లను తెస్తున్నామని కొత్త రాగం ఆలపించారు. ఓ వైపు కాళేశ్వరంపై నిందలు వేస్తూనే, మరోవైపు కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్‌ను వాడుకోవడం కాంగ్రెస్ సర్కార్ కపటనీతికి నిదర్శనం. ఎల్లంపల్లిని కాంగ్రెస్సే నిర్మించి ఉంటే, తెలంగాణ రాకముందు రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు అప్పుడే నీళ్లెందుకివ్వలేదు? హైదరాబాద్‌కు గోదావరి జలాలను ఎందుకు తరలించలేదు? తెలంగాణ వచ్చాక ఎల్లంపల్లిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తిచేసింది కేసీఆర్ ప్రభుత్వం. శంకుస్థాపన జరిగిన 12 ఏండ్లకు, తెలంగాణ వచ్చిన రెండేండ్ల తర్వాత 2016, నవంబర్‌లో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు వేములవాడ మండలంలోని ఫాజిల్‌నగర్ నుంచి చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ మైనర్ ఇరిగేషన్‌కు గోదావరి జలాలను విడుదల చేశారు. ఇక మల్లన్నసాగర్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు దాన్ని కూడా కాంగ్రెస్ సర్కారు నిర్మించిందని చెప్పడం వింతల్లోకెల్లా వింత. మల్లన్నసాగర్‌ను నిర్మిస్తే భూకంపాలు వస్తాయని రైతులను భయపెట్టిన చరిత్రను మర్చిపోతే ఎట్లా రేవంత్‌రెడ్డీ? ప్రాణహితలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మల్లన్నసాగర్ కెపాసిటీ 1.15 టీఎంసీలే. కానీ, కేసీఆర్ కట్టిన మల్లన్నసాగర్ కెపాసిటీ 50 టీఎంసీలు. కాంగ్రెస్ నాయకులు మాటిమాటికీ చెప్పే ప్రాణహిత-చేవెళ్ల మొత్తం కెపాసిటీ 16 టీఎంసీలే.

ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు నీళ్లను చేరవేసేందుకు పెద్ద తతంగమే నడిచింది. కాళేశ్వరం ప్రాజెక్టు రెండో దశలో భాగంగా ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను మధ్య మానేరుకు తరలించారు. రెండో దశలో మొత్తం మూడు ప్యాకేజీలున్నాయి. మొదట ఎల్లంపల్లి నుంచి మేడారం రిజర్వాయర్‌లోకి, అక్కడినుంచి శ్రీరాంసాగర్ వరద కాలువకు, ఆ తర్వాత మధ్యమానేరుకు నీళ్లు చేరుతాయి. మూడో దశలో భాగంగా మధ్యమానేరు నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని తరలిస్తారు. మొదట మధ్యమానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్‌కు, అక్కడినుంచి శ్రీరంగనాయకసాగర్‌కు, అక్కడినుంచి మల్లన్నసాగర్‌కు గోదావరి జలాలు వచ్చి పడుతాయి. కేసీఆర్ నిర్మించిన మేడారం, అనంతగిరి, శ్రీరంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు, అప్రోచ్ కెనాల్స్, టన్నెళ్లు.. లేకుండా ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను మళ్లించగలరా?

హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపును గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రతిపాదించింది. అయితే, కొండపోచమ్మసాగర్ నుంచి వెయ్యి కోట్లతో కేసీఆర్ సర్కార్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దానినే రేవంత్ ప్రభుత్వం మల్లన్నసాగర్‌కు మార్చి, ప్రాజెక్టు వ్యయాన్ని 7,300 కోట్లకు పెంచి, నీళ్లకు బదులు కమీషన్ల వరద పారించాలని చూస్తున్నది. గండిపేట నుంచి మల్లన్నసాగర్ సుమారు 118 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 557 మీటర్ల ఎత్తున ఉంటుంది. అదే కొండపోచమ్మసాగర్ గండిపేటకు 70 కిలోమీటర్ల దూరంలో, 618 మీటర్లపైన ఉంటుంది. 540 మీటర్ల ఎత్తున ఉండే గండిపేటకు 618 మీటర్ల ఎత్తున ఉండే కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా తక్కువ ఖర్చుతో నీళ్లను తీసుకురావచ్చు. ఎక్కువ నిల్వ సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మకు కాళేశ్వరంలో భాగంగా నీళ్లు తరలించే మార్గం అందుబాటులో ఉండనే ఉన్నది. కానీ, అలాచేస్తే కమీషన్లు రావు కదా? ఫలాలిచ్చే చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్టు.. ఇట్లా కాళేశ్వరం ప్రయోజనాలను వాడుకుంటూ దాని మీదనే నిందలు వేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ ప్రజలు, మేధావులు, బుద్ధిజీవులు, ముఖ్యంగా అన్నదాతలు ఇకనైనా కాంగ్రెస్ నైజాన్ని గ్రహించాలి. కాళేశ్వరంతో పాటు తెలంగాణను కాపాడుకోవాలి. అప్పుడే తెలంగాణతోపాటు మనమూ మనగలుగుతాం.

(వ్యాసకర్త: కరీంనగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి)

మోసం కేరాఫ్ కాంగ్రెస్!

జీతాలకు తప్ప విద్యకు కేటాయింపులు శూన్యం


ఒప్పకున్న సీఎం రేవంత్‌రెడ్డి
సీఎం వ్యాఖ్యలపై టీచర్ల ఫైర్
మరో 20 వేల కోట్లివ్వాలని డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): విద్యారంగానికి సంబంధించి తాము టీచర్ల జీతాల మట్టుకే నిధులు కేటాయిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి పరోక్షంగా అంగీకరించారు. మరో విధంగా.. సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు రూపాయి కూడా విదిల్చడంలేదని సెలవిచ్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. ఈ లెక్కన ఏటా రూ.40 వేల కోట్లను కేటాయించాలి. కానీ కేవలం రూ.21 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది. రేవంత్‌రెడ్డి సర్కారు నియమించిన విద్యాకమిషన్ సైతం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నిధులను కేటాయించాలని సిఫారసు చేసింది. దీనిని కూడా పాటించిన దాఖలాల్లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు 7.75 శాతం నిధులను అనగా రూ.21,389 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆ తర్వాత 2024-25 బడ్జెట్‌లో 7.31శాతం, 2025-26లో 7.57 శాతం మాత్రమే బడ్జెట్‌ను కేటాయించింది. టీచర్లకు ప్రతి నెల జీతాల చెల్లింపు అనివార్యం కాగా, అంతమేరకే నిధులు విడుదల చేస్తూ విద్యారంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేయడం విస్మయం కలిగిస్తున్నదని విద్యారంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యాశాఖను తన వద్దనే ఉంచుకున్న ముఖ్యమంత్రి ఓ వైపు ఇస్తున్న నిధుల్లో 98 శాతం జీతాలకే పోతున్నదన్న వాస్తవాన్ని తానే వెల్లడిస్తూ.. మరోవైపు విద్యారంగానికి నిధులు ఇస్తున్నా అభివృద్ధి చెందడం లేదని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉన్నదని అంటున్నారు. సీఎం వ్యాఖ్యలపై టీచర్లు ఫైర్ అవుతున్నారు. ఇలా టీచర్లను అవమానించడం పరిపాటిగా మారిందని మండిపడుతున్నారు. నిధుల్లో 98 శాతం టీచర్ల జీతాలకే పోతున్నదంటే తాము జీతాలు తీసుకోకుండా ఫ్రీగా పనిచేయాల్నా అంటూ ఓ టీచర్ ప్రశ్నించారు.

ఇంకో 20 వేల కోట్లివ్వండి

రాష్ట్రంలో 26 వేల పైచిలుకు బడులున్నాయి. చాలా బడుల్లో సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. తాజా వివరాల ప్రకారం 1,752 సర్కారు బడుల్లో బాలికలకు టాయిలెట్లు లేవు. మరో 1100 బడుల్లో టాయిలెట్లు ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో 4,069 బడుల్లో టాయిలెట్లు లేవని ఇటీవలే విడుదలైన యూడైస్ నివేదిక తేల్చింది. మరో 1,400 బడుల్లో బాలురకు టాయిలెట్లు ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితిలో ఉన్నాయి. నీటి కనెక్షన్ లేకపోవడంతో ఈ టాయిలెట్లను వినియోగించుకోలేని పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో 1,255 స్కూళ్లకు కరెంట్ కనెక్షనే లేదు. 166 సర్కారు బడుల్లో తాగేందుకు నీళ్లు లేవు. ఎయిడెడ్‌లో 25 స్కూళ్లలో నీటికి కటకట నెలకొన్నది. ఈ పరిస్థితులిలా ఉంటే బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయిస్తే ఎట్లా అని టీచర్ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. విద్యకు రాబోయే బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. అందులో టీచర్ల జీతాలకు 50 శాతం పోతే మిగిలిన 50 శాతం నిధులతో బడులను బాగుచేసుకోవచ్చని సూచిస్తున్నాయి.



ఇస్తున్న నిధులు టీచర్ల జీతాలకే: సీఎం

రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఎంత కృషి చేస్తున్నా లోపాలు కొనసాగుతూనే ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యారంగం కోసం కేటాయిస్తున్న నిధుల్లో 98 శాతం టీచర్ల జీతాలకే ఖర్చవుతున్నదని వాపోయారు. ఎంతచేసినా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని అన్నారు. సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ విధానం, అమలుపై మరింత దృష్టిసారించాల్సి అవసరముందని చెప్పారు.

సచివాలయంలో బుధవారం తెలంగాణ నూతన విద్యావిధానం రూపకల్పనపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖకు రూ.21 వేల కోట్లు కేటాయిస్తే, దీంట్లో 98శాతం టీచర్ల జీతాలకే ఖర్చవుతున్నదని అన్నారు. అంతర్జాతీయ స్థాయికి మన విద్యావిధానం సరితూగడంలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యలో ప్రభుత్వ పాత్ర క్రమంగా తగ్గుతున్నదంటూ ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 11 వేల ప్రైవేట్ బడుల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, 27వేల సర్కారు బడుల్లో 18 లక్షల మందే చదువుతున్నారని అన్నారు. విద్యారంగానికి నిధులు కేటాయిస్తున్నా ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నా.. వారిలో 15శాతం మందికే ఉద్యోగాలు దక్కుతున్నాయని చెప్పారు. విద్యా ప్రమాణాలు పెరగకపోవడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. నైపుణ్యాల లేమితో విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. సమగ్ర విద్యావిధానాన్ని సిద్ధం చేసి, డిసెంబర్ 9న తెలంగాణ విజన్ డాక్యుమెంట్ -2047ను విడుదల చేస్తామని, ఇందుకు అనుగుణంగా సబ్ కమిటీలు ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



ఫీజు బకాయిలపై పచ్చి అబద్ధాలు

టోకెన్లు జారీ అయ్యిందేమో రూ.3,543 కోట్లకు!
రూ.1,207 కోట్లే ఉన్నట్టు చెప్పిన రేవంత్ సర్కార్
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి వివరాలు గోప్యం
చర్చలు ముగిశాక తెలుసుకున్న యాజమాన్యాలు
సర్కార్‌ను నమ్మితే ఇంత మోసమా? అని ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఇంత మోసముంటదా? ఇంత దగానా? మొత్తం వివరాలను బయటపెడతామన్నారు.. కానీ కప్పిపుచ్చారు. నమ్మిన వారిని నట్టేట ముంచిన్రా? ఇది ఏ ఇద్దరు కాలేజీ యజమానులు కలిసినా మాట్లాడుకుంటున్న మాటలు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని కాలేజీల నిర్వాహకులు చెప్తున్నారు. అసలు విషయాన్ని ఆలస్యంగా గ్రహించి, తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నమ్మితే ఇంత మోసం చేస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

అసలేం జరిగిందంటే?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలంటూ కాలేజీల యజమాన్యాలు ఏకతాటిపైకి వచ్చి.. నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాలేజీలను మూసివేస్తామని తేల్చిచెప్పడంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. మొదట ఓ సారి చర్చలకు పిలిచింది. ఆ చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాత రెండో దశ చర్చలకు ఆహ్వానించింది. ఈ చర్చల్లోనూ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని వివరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క.. అర్థం చేసుకోవాలని కోరారు. అల్లరి చేస్తే మీకే నష్టం అంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యాజమాన్యాల సంఘం ప్రతినిధులు మెత్తబడి.. మొత్తం కాకున్నా.. ఏడాది క్రితం టోకెన్లు జారీచేసిన మేరకు నిధులు విడుదల చేయాలని ప్రతిపాదించారు. ఇంత వరకు బకాయిలను చెల్లించలేదని తెలిపారు. అవి చెల్లించినా సమ్మెకు వెళ్లబోమని తెలిపారు.

యాజమాన్యాలపై అపనమ్మకం

టోకెన్లు జారీ అయ్యి.. విడుదల కానీ బకాయిలు ఎంత ఉంటాయని ప్రభుత్వం ఆరా తీయగా.. రూ.1,207 కోట్లుంటాయని కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రతినిధులు చెప్పారు. అయితే మీరు చెప్పింది నమ్మలేం. అంత ఉండకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ వద్దనే లెక్కలుంటాయి.. అసలెంతో మీరేం తేల్చండి అని యాజమాన్యాలు కోరగా, ఆదివారం సెలవు కావడంతో సోమవారం చెప్తామని ప్రభుత్వం బదులిచ్చింది. పైగా పెండింగ్ బకాయిలెంత? టోకెన్లు జారీ అయి విడుదలకానివి ఎంత? అన్న వివరాలను బహిర్గతం చేస్తామని తెలిపింది. అంతటితో చర్చలకు బ్రేక్‌పడింది.

అసలు లెక్క రూ.3,543 కోట్లు!

సర్కారు లెక్కలు తీసిన తర్వాత టోకెన్లు జారీ అయిన బకాయిల విలువ రూ.3,543 కోట్లుగా తేలింది. అంటే యాజమాన్యాలు చెప్పినదాని కంటే రెండు రెట్లు అధికం. ఈ వివరాలను సర్కారు బయటపెట్టలేదు. సోమవారం జరిగిన చర్చల్లో టోకెన్లు జారీ అయిన బకాయిలెంత? అన్నది చెప్పలేదు. యాజమాన్యాలు చెప్పిన రూ.1,207 కోట్లే ఉన్నట్టు పేర్కొంది. వీటిలో రూ.600 కోట్లు ఇస్తామన్నది. వీటిని కూడా ఇంతవరకు ఇవ్వలేదు. ఈ విషయం తెలిసిన యాజమాన్యాలు నివ్వెరపోతున్నాయి. సర్కారును నమ్మి మోసపోయామని తలలు పట్టుకుంటున్నారు.

మంత్రికి తెలియకుండా అధికారి మార్పు!

ఆయిల్‌ఫెడ్‌లో ఎండీ తొలగింపు, కొత్త ఎండీ నియామకం
మంత్రి తుమ్మలకు సమాచారం ఇవ్వని వ్యవసాయశాఖ
మూడు నెలల్లోనే మార్పుపై అధికారుల విస్మయం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): అధికారుల బదిలీల్లో భాగంగా ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్యను బదిలీ చేసిన ప్రభుత్వం కొత్త ఎండీగా జితేందర్‌రెడ్డిని నియమించింది. అయితే ఇదంతా కూడా ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలియకుండానే జరిగిపోయినట్టు సమాచారం. ఎవరిని నియమిస్తున్నారనే అంశంపై మంత్రికి కనీస సమాచారం కూడా ఇవ్వలేదనే చర్చ వ్యవసాయ శాఖలో జోరుగా జరుగుతున్నది. మూడు నెలల క్రితం శంకరయ్య నియామకం సైతం మంత్రికి తెలియకుండానే జరిగి నట్టు తెలిసింది. అప్పుడు, ఇప్పుడు ఓ కీలక విభాగంలో కీలక అధికారి మార్పు, కొత్త అధికారి నియామకంపై ఆ శాఖ మంత్రికే సమాచారం ఇవ్వకుండా, ఆయన అభిప్రాయం తీసుకోకుండానే జరిగిపోవడంపై విస్మయం వ్యక్తమవుతున్నది. వాస్తవానికి శంకరయ్య పనితీరుపై మంత్రి తుమ్మల తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. సాధారణంగానే ఆయిల్‌పామ్ సాగుపై మంత్రి తుమ్మల ప్రత్యేకదృష్టి సారించారు. ఆయనకు సుమారు 200 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఆలోచనలకు, భవిష్యత్ ప్రణాళికకు తగ్గట్టు శంకరయ్య పనిచేయడం లేదని భావించేవారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంలో ప్రస్తావించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

డ్రైవర్ కంటే టీచర్ జీతం తక్కువ!

మైనార్టీ గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ షాక్
డ్రైవర్‌కు 19,500.. టీజీటీ, పీజీటీలకు 18,200 వేతనం
ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గరంగరం
ఇదేనా ప్రజాపాలన అంటూ ఆగ్రహం
నాకు తెలియదన్న సొసైటీ సెక్రటరీ



మైనార్టీ గురుకుల టీచర్లకు గతంలో ఉన్న జీతం, కొత్తగా నిర్ణయించిన జీతం

పోస్టు	పాత వేతనం	కొత్త వేతనం	కోత
జేఎల్	35,000	23,400	11,600
పీజీటీ	31,395	18,200	13,195
టీజీటీ	28,660	18,200	10,460

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులపై కాంగ్రెస్ సర్కార్ కత్తి దూసింది. వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారనే సాకుతో ఏకంగా వారికి చెల్లించే వేతనాల్లో కోత విధించింది. ఉన్నతాధికారుల వద్ద డ్రైవర్లుగా పనిచేస్తున్నవారి కంటే తక్కువ స్థాయికి పాఠాలు బోధించే టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు), పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు) వేతనాలను కుదించింది. ఈ మేరకు వేతనాలను సవరిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ చర్యలపై గురుకులాల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇదేనా ప్రజాపాలన అంటూ నిప్పులు చెరుగుతున్నారు.

డ్రైవర్‌కు రూ.19,500.. టీచర్‌కేమో రూ.18,200

తెలంగాణ మైనార్టీ గురుకుల సొసైటీలో 204 గురుకులాలు ఉన్నాయి. వాటిలో రెగ్యులర్ సిబ్బంది కాకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో దాదాపు 3,756 మందిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అందులో టీచింగ్ విభాగంలో ప్రిన్సిపాల్, జూనియర్ లెక్చరర్ (జేఎల్), టీజీటీ, పీజీటీ పోస్టులున్నాయి. నాన్‌టీచింగ్ విభాగంలో డ్రైవర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులున్నారు. గతంలో జేఎల్‌కు రూ.35 వేలు, పీజీటీ, టీజీటీలకు రూ.27వేల వేతనం చెల్లించేవారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి సైతం రెగ్యులర్ సిబ్బందికి చెల్లించిన తరహాలో 30% పీఆర్సీని వర్తింపజేసింది. క్రమం తప్పకుండా కంటిన్యుయేషన్ ఆర్డర్స్ ఇస్తూ వచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం సొసైటీలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది కొనసాగింపునకు సంబంధించి ఆర్డర్స్‌ను గత రెండు నెలలుగా ఇవ్వలేదు. దీంతో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వేతనాలను విడుదల చేయలేదు. దీంతో సొసైటీలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు.. 'బతికెదెట్లా?' అంటూ ఇటీవల ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా సొసైటీలోని సిబ్బంది వేతనాల్లో కోత విధించింది. గత ఏప్రిల్ నుంచి 2026 మార్చి 21 వరకు ఉపాధ్యాయులను, అధ్యాపకులను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం తాజాగా 16న జీవో ఆర్‌టీ నంబర్ 1437 పేరుతో ఉత్తర్వులు జారీచేసింది. అయితే అదే ఉత్తర్వుల్లో వేతనాల విషయంలో మాత్రం భారీ కోతలు పెట్టింది. జేఎల్ వేతనాన్ని రూ.35 వేల నుంచి రూ.23,400కు కుదించింది. ఒక్కసారిగా ఏకంగా రూ.11,600 వేతనాన్ని కోసేసింది. పీజీటీల వేతనాన్ని రూ.31,395 నుంచి రూ.18,200కు, టీజీటీల వేతనాన్ని రూ.28,660 నుంచి రూ.18,200కు తగ్గించింది. మొత్తంగా 1,227 జేఎల్, 435 పీజీటీ, 108 టీజీటీల వేతనాన్ని కోసేసింది. అదేవిధంగా ఔట్‌సోర్సింగ్ విభాగంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, కుక్‌లు, కంప్యూటర్ టీచర్లు, పీడీలు, పీఈటీలు, తదితర సిబ్బంది వేతనాలను సైతం భారీగా తగ్గించింది. ఒక్కో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగికి సగటును రూ.5వేల నుంచి రూ.13వేల వరకు కోత విధించింది. ఉన్నతాధికారుల వద్ద, కార్యాలయంలో పనిచేసే డ్రైవర్ల వేతనం 19,500 కాగా, విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న టీజీటీ, పీజీటీల వేతనాన్ని రూ.18,200గా నిర్ధారించారు. ప్రభుత్వం నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వేతనాల కోత నాకు తెలియదు

మైనార్టీ గురుకులాల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోత విషయం తనకేమీ తెలియదని సొసైటీ సెక్రటరీ షఫియుల్లా జావాబిస్తుండటం గమనార్హం. వేతనాల కోత నేపథ్యంలో గురుకుల సిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించారని తెలిసింది. ఈ సమావేశంలో సెక్రటరీ షఫియుల్లా స్పందిస్తూ.. వేతనాల్లో కోత విషయం తన దృష్టికే రాలేదని చెప్పినట్టు సొసైటీ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ప్రస్తుత ఉత్తర్వులను సవరిస్తారనే భరోసా కూడా ఇచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉంటే సెక్రటరీకి తెలియకుండా ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఎలా వెళ్లాయని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడిదే సొసైటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇదేనా ప్రజాపాలన?

ప్రభుత్వం తీరుపై ఇదేనా ప్రజాపాలన? అంటూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మండిపడుతున్నారు. సర్కారు తీసుకున్న తాజా నిర్ణయం మైనార్టీ గురుకులాలపై ప్రభావం చూపుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇతర గురుకులాలతో పోలిస్తే మైనార్టీ గురుకులాల్లో పనిచేసే జూనియర్ లెక్చరర్లు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లకు వేతనాలు అదనంగా ఉండటం వల్ల సదరు సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో పనిచేస్తూ విద్యార్థులకు బోధన అందించారు. కానీ, సర్కారు తాజా నిర్ణయం వల్ల తగినంత వేతనాలు అందే అవకాశం లేకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో బోధన విషయంలో అంకితభావం కొరపడుతుందని, తద్వారా ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం దిగి రాకపోతే ఆందోళన బాట పట్టేందుకు సదరు అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

వేతన బకాయిలు విడుదల

మైనార్టీ గురుకుల సొసైటీలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సంబంధించి రెండు నెలల వేతన బకాయిలను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల వేతనాల కోసం వారు రోడ్డెక్కారు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు దిగారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. వేతనాలను విడుదల చేసింది. అయితే గతం కంటే భారీగా వేతనాల్లో కోత విధించింది.

పెంచుతామని హామీ.. ఇప్పుడేమో కోతలు

రాష్ట్రంలో మైనార్టీతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు సైతం ఉన్నాయి. ఇతర గురుకులాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న జేఎల్‌కు రూ.27వేలు, టీజీటీ, పీజీటీలకు రూ.24వేలు, పీడీలకు, ఆర్ట్, మ్యూజిక్ టీచర్లకు రూ.20వేల చొప్పున చెల్లిస్తున్నారు. మైనార్టీ గురుకుల సొసైటీ తరహాలోనే తమకు సైతం వేతనాలు ఇవ్వాలని మిగతా సొసైటీల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎప్పటినుంచో విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నికల ముందు గాంధీభవన్‌కు వెళ్లి ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు సైతం వినతిపత్రం అందజేశారు. ప్రజాపాలనలో న్యాయం చేస్తామని, 12 నెలలకు మినిమం టైమ్‌స్కేల్‌ను ఇస్తామని, జాబ్ సెక్యూరిటీ కల్పిస్తామని, జేఎల్‌కు రూ.42 వేల జీతం చెల్లిస్తామని హామీ ఇవ్వడమేకాదు, ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా కాంగ్రెస్ పొందుపరిచింది. కానీ ఆ హామీ సంగతేమో కానీ మైనార్టీ గురుకులాల్లోని నాన్‌రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల్లోనే కోత విధించడం గమనార్హం. గత ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలను పెంచుతూ రావడమేగాక, పీఆర్సీని సైతం వర్తింపజేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందించే అత్తెసరు వేతనాల్లోనే భారీగా కోత విధించింది. ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నది. ఇప్పటికే ఎస్సీ గురుకుల సొసైటీలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను జీవో-1284 పేరిట రోడ్డున పడేసింది.



అజారుద్దీన్‌కు కాంగ్రెస్ మొండిచెయ్యి

ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం అనుమానమే
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల బరి నుంచి తప్పించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఎత్తుగడ
సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కేసు పెండింగ్ • తుదితీర్పు తర్వాతే గవర్నర్ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన ఆ పార్టీ నేతకు మొండిచెయ్యి చూపనున్నదా? జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరి నుంచి తప్పించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎత్తువేశారా? అక్కడి ముస్లిం ఓట్ల కోసమే ఈ డ్రామాకు తెరతీశారా? అనే ప్రశ్నలకు న్యాయ, రాజకీయ నిపుణుల నుంచి అవుననే సమాధానం వస్తున్నది. ఎందుకంటే ఆయనతో పాటు కోదండరాం ఎంపిక రాజ్యాంగ విధానాలకు వ్యతిరకమనే వాదన వినిపిస్తున్నది. గతంలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీ ఖాన్ ఎంపిక చెల్లదని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గతంలోనూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రు సత్యనారాయణ ఎంపిక కేసు ఇప్పటికీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. వారికి రాజకీయ నేపథ్యమున్నందున ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో అమీర్‌అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్‌ను నామినేట్ చేస్తూ గవర్నర్ వద్దకు పంపించారు.

గతంలోనూ తిరస్కరణ

అమీర్‌అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్‌తో పాటు కోదండరాంను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ ఆగస్టు 30న క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. గతంలో రాజకీయ నేపథ్యమున్నదనే కారణంతో దాసోజు శ్రవణ్, కుర్రు సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని 2024 జనవరి 17న అప్పటి గవర్నర్ తమిళిసైసౌందరరాజన్ తిరస్కరించారు. దీనిపై వీరు హైకోర్టుకు వెళ్లారు. అయినా గవర్నర్ ఆమోదించలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమీర్‌అలీఖాన్, కోదండరాంను ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదించారు. దీనిపై దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టుకు వెళ్లగా వారి ఎన్నిక చెల్లదని, తుదితీర్పు అనంతరం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

భంగపాటు ఖాయం!

రాజకీయ నేపథ్యం, మ్యాచ్ ఫిక్సింగ్, హెచ్‌సీఏలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అజారుద్దీన్‌కు కూడా ఎమ్మెల్సీగా చుక్కెదురు తప్పదని న్యాయకోవిదులు చెప్తున్నారు. ఆయన యూపీలో మొరాదాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీగా ప్రాతినిథ్యం వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. అలాగే కోదండరాం కూడా తెలంగాణ జన సమితి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరి ఎంపిక సుప్రీంకోర్టులో నిలబడడం అసాధ్యమని నిపుణులు చెప్తున్నారు. ఈ కారణంగానే గవర్నర్ ఈ ఫైల్‌ను 20 రోజులుగా పెండింగ్‌లో పెట్టారని అంటున్నారు.

జూబ్లీహిల్స్‌లో లబ్ధి కోసమే తెరపైకి

మరో రెండు, మూడు నెలల్లో జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో లబ్ధిపొందేందుకే సీఎం రేవంత్‌రెడ్డి అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా ప్రతిపాదించినట్టు అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అక్కడ ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నందున ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చినట్టు తెలిసింది. అంతేగాని అజారుద్దీన్‌పై ప్రేమతోకాదని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. గతంలో షబ్బీర్‌అలీని నిజామాబాద్ నుంచి పోటీ చేయించి.. నమ్మించి గొంతుకోశారని, అమీర్‌అలీఖాన్‌ను కూడా ఇదే తరహాలో మోసం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అజారుద్దీన్‌కు మొండి చెయ్యి చూపుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

అజారుద్దీన్ అసహనం

గతంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి రెండోస్థానంలో నిలిచిన అజారుద్దీన్ ఉపఎన్నికల్లో తిరిగి బరిలో నిలువాలని భావిస్తున్నారు. రాష్ట్ర నాయకత్వం ఆయనను ఎంత మాత్రం పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీని కలవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆయనకే జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వడం ఖాయమని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఆయనను ఎమ్మెల్సీగా ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్టు చెప్తున్నారు. అవసరమైతే ఆయనకు మంత్రి పదవి కూడా ఇస్తామంటూ ఆశచూపారని పేర్కొంటున్నారు.



తమకు జీతాలు తగ్గించి పొట్టకొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తూ హైడ్రా సిబ్బంది మెరుపు సమ్మెకు దిగారు. జీతంలో రూ.5 వేలు కట్ చేశారంటూ 1100 మంది ఉద్యోగులు బుధవారం ఉదయం విధులు బహిష్కరించి నెక్లెస్‌రోడ్డులోని బుద్ధభవన్ వద్ద హైడ్రా కార్యాలయ ఎదుట ఆందోళన చేపట్టారు. రాత్రిపగలు తమతో పనులు చేయించుకుని ఇప్పుడు వేతనం తగ్గించడంపై డీఆర్‌ఎఫ్ బృందాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. న్యాయం జరగకుంటే విధులకు హాజరయ్యేది లేదని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఒకేలా జీతాలు అందేలా జీవో తెచ్చింది. ఈ జీవో కారణంగా తమ వేతనంలో రూ. 5 వేలు కోతపడిందని డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సిబ్బంది మెరుపు ధర్నాతో హైడ్రా సేవలు స్తంభించిపోయాయి.-హైదరాబాద్ సిటీబ్యూరో

'ఆరోగ్యశ్రీ' సేవలను కొనసాగించాలి

మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రైవేటు దవాఖానాల్లో 'ఆరోగ్యశ్రీ' సేవలను కొనసాగించాలని నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్లను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. బుధవారం అమీర్‌పేట్‌లోని సీహెచ్‌సీలో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' అభియాన్ కార్యక్రమాన్ని ఆయన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేండ్లు చేయని సమ్మె ఇప్పుడెందుకు చేస్తున్నారని అసోసియేషన్‌ను ప్రశ్నించారు. వైద్యసేవలు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

100% సమ్మెలోనే!

'ఆరోగ్యశ్రీ'పై సర్కారు లెక్కలు తప్పు ఐక్యత దెబ్బ తీసేందుకు కుట్ర: రాకేశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'ఆరోగ్యశ్రీ' నెట్‌వర్క్ ఆసుపత్రులు 100శాతం సమ్మెలో పాల్గొన్నట్టు నెట్‌వర్క్ హాస్పిటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్ పేర్కొన్నారు. నెట్‌వర్క్ దవాఖానల ఐక్యతను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ'తో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం 7 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ దవాఖానల యాజమాన్యాలతో రివ్యూ చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం నెట్‌వర్క్ ఆసుపత్రులు 323 మాత్రమే ఉన్నాయని, వాటి సంఖ్యను 477 అని చెప్పడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

'తెలంగాణ రైతాంగ పోరాటంతోనే చైతన్యం'

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశంలో అనేక ఉద్యమాలకు ఊపిరి పోసిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు బహిరంగ సభ బుధవారం రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

చరిత్రను వక్రీకరిస్తున్న మోదీ సర్కార్

సీపీఎం నేత బృందాకారత్

నీలగిరి, సెప్టెంబర్ 17: భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేంద్రంలోని మోదీ సర్కార్ వక్రీకరిస్తున్నదని సీపీఎం మాజీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ బుధవారం నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయుధ పోరాటంలోగాని పాల్గొనని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఈతరం యువతను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి అర్హతే లేదు : రాఘవులు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరిపే అర్హత కాంగ్రెస్, బీజేపీకి లేనేలేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు స్పష్టంచేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టులదే కీలకపాత్ర అన్నారు.

వరంగల్ కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

మంత్రి సురేఖ పాల్గొన్న వేడుకలకు ఎమ్మెల్యేలు దూరం

వరంగల్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరంగల్ కాంగ్రెస్‌లో 'గ్రూప్' వార్ పతాకస్థాయికి చేరింది. మొదటి నుంచి ఎడమొహం, పెడమొహంగా ఉన్న నేతలు బుధవారం ప్రజాపాలన పేరిట నిర్వహించిన అధికారిక కార్యక్రమంలోనూ 'తూర్పు పడమర'లుగా విడిపోయారు. పార్టీ పరంగానే కాకుండా అధికారిక కార్యక్రమాలకు మంత్రి కొండా సురేఖ హాజరైతే తాము ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకునేదిలేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు ఇటు పార్టీ హైకమాండ్‌కు, అటు సీఎం వోకు తెగేసి చెప్పినట్టు సమాచారం. అందువల్లే సెప్టెంబర్ 17న జెండావిష్కరణ అతిథులు మారారని కాంగ్రెస్‌లో జోరుగా చర్చసాగుతున్నది.

ప్రముఖ సాహితీవేత్త ఎస్వీ రామారావు కన్నుమూత

- అస్వస్థతతో దవాఖానలో తుదిశ్వాస విడిచిన ఎస్వీఆర్
- రామారావు సేవలను స్మరించుకున్న ప్రముఖులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 17: ప్రముఖ సాహితీవేత్త ఆచార్య సూగూరు వేంకట రామారావు(84) కన్నుమూశారు. అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఎస్వీ రామారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. అమెరికాలో ఉన్న కుమారుడు గురువారం రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారని, శుక్రవారం హైదరాబాద్‌లోనే రామారావు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్వీ రామారావు మృతిపై వివిధ రంగాల ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాహితీరంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

అలుపెరగని సాహితీసేవ



1941జూన్ 5న వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో జన్మించిన ఆచార్య ఎస్వీ రామారావు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో తెలుగు భాషా సాహిత్యంలో స్నాతకోత్తర పట్టభద్రులై 1966లో తెలుగు శాఖ అధ్యాపకులుగా చేరారు. ఆచార్యులుగా, తెలుగు శాఖాధిపతి పాఠ్యాంశాల నిర్ణాయక మండలి అధ్యక్షుడిగా, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా సేవలందించి, 2001లో ఉద్యోగ విరమణ చేశారు. డాక్టర్ సీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో 'తెలుగులో సాహిత్య విమర్శ–అవతరణ వికాసాలు' అనే అంశంపై పరిశోధన చేసి 1973లో డాక్టరేట్ పొందారు. రామారావు కలం నుంచి 23 గ్రంథాలు వెలువడ్డాయి. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి సాహిత్య విమర్శ పురస్కారం, శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం నుంచి దాశరథి పురస్కారం, జీవీఎస్ సాహిత్య పీఠం నుంచి విమర్శ పురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, బీఎన్ శాస్త్రి పురస్కారం, సారస్వత పరిషత్తు పురస్కారం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ పురస్కారం వంటి అనేక గౌరవాలు ఎస్వీఆర్‌ను వరించాయి. ఆయన పర్యవేక్షణలో 19మంది పీహెచ్‌డీ పరిశోధన, 15మంది ఎంఫిల్ పరిశోధన పూర్తి చేశారు.

సాహిత్య రంగానికి తీరనిలోటు

తెలుగు సాహితీ విమర్శ, పరిశోధనా రంగాల్లో ప్రఖ్యాతి పొందిన ఎస్వీ రామారావు మరణం సాహితీలోకానికి తీరనిలోటు అని తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. రామారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆచార్య ఎస్వీ రామారావు మృతి పట్ల తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, ట్రస్టు సభ్యుడు చింతపల్లి వసుంధరారెడ్డి, ప్రముఖ కాలమిస్ట్, రచయిత్రి దంటు కనకదుర్గ ప్రగాఢ సంతాపం తెలిపారు. రామారావుతో సాహిత్య అనుబంధాన్ని వారు స్మరించుకున్నారు. సారస్వత పరిషత్తుకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంపై దృష్టి పెట్టి, పరిశోధన చేసిన గొప్ప సాహితీవేత్త ఎస్వీఆర్ అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు కొనియాడారు. తెలుగు సాహిత్య విమర్శ పరిణామ వికాసాలపై సాధికారికంగా పరిశోధన చేసిన సాహితీవేత్త అని గుర్తుచేసుకున్నారు.

ఎస్వీఆర్ సేవలు చిరస్మరణీయం

ఎస్వీ రామారావు మృతి పట్ల మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆచార్యుడిగా, పరిశోధకుడిగా తెలుగు సాహిత్యానికి ఎస్వీ రామారావు ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఎస్వీ రామారావు తనకు ప్రత్యక్ష గురువు అని, సుమనస్వి అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్మరించుకున్నారు. ఎస్వీఆర్ సాహిత్య సేవలు తెలుగు సాహితీ లోకంలో శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

యువతతో పెట్టుకుంటే సర్కార్ మనుగడ కష్టం

మొదటిపేజీ తరువాయి...

బుధవారం నిరుద్యోగులతో కలిసి గన్‌పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపానికి నివాళులర్పించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజగోపాల్‌రెడ్డి సొంత ప్రభుత్వ తీరుపైనే విరుచుకుపడ్డారు. 'యువతను గాలికి వదిలేయొద్దు. వారికి దారి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నది' అని స్పష్టంచేశారు. ముఖ్యంగా ప్రభుత్వంలో ఉన్న పెద్దలు, పాలకులు రాజకీయ, ఆర్థిక కోణంలో కాకుండా సామాజిక, మానవీయ కోణంలో ఆలోచించినప్పుడే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 2 లక్షల ఉద్యోగాలు వస్తాయని, గ్రూప్–1, గ్రూప్–2 వంటి ఉద్యోగాలను పారదర్శకంగా నిర్వహిస్తారని నిరుద్యోగులు భావించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేకపోయామని, 50 వేల ఉద్యోగాలే ఇచ్చామని చెప్పారు. మిగతా 1.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని 30 లక్షల మంది నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తున్నదని తెలిపారు.

నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ ఆలస్యమైన మాట వాస్తవమేనని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంగీకరించారు. దీంతో నిరుద్యోగులు భావోద్వేగాలకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నరని తెలిపారు. నిరుద్యోగ యువతకు న్యాయం చేసేలా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా జూన్ 2న ఉద్యోగ ఖాళీలకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని సీఎంను, ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు చెప్పారు. ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

అశోక్‌నగర్ చౌరస్తాకొస్తా

'ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో 30 లక్షల మంది నిరుద్యోగులు కన్నీళ్లతో కష్టాల్లో ఉన్నారు. నేను గన్‌పార్క్‌కు వస్తున్నా అని తెలిసి.. వేలాది మంది విద్యార్థులు ఇక్కడికి రావడానికి సిద్ధమయ్యారు. కానీ వందలాది మంది పోలీసులను పెట్టి వారిని నిర్బంధించారు. మీరు రావాల్సిన అవసరం లేదు. నేనే మీ వద్దకొస్తా. సిటీ సెంట్రల్ లైబ్రరీకి, అశోక్‌నగర్ చౌరస్తాకు, దిల్‌షుక్‌నగర్‌కు వస్తా. అమరవీరుల సాక్షిగా నిరుద్యోగ యువతకు మాటిస్తున్నా. మీకు న్యాయం జరిగే వరకు మీ సమస్యను ప్రభుత్వ, సీఎం దృష్టికి తీసుకెళ్తా. మీరు కన్న కలల కోసం, మీ ఆశయాల కోసం, మీకు తోడుంటా, మీ వెనుకాలే ఉంటా. ఒక అన్నగా, కుటుంబ సభ్యుడిగా మాట ఇస్తున్నా' అని నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు. ప్రజ సమస్యలను భుజంపై వేసుకున్న తాను వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నానని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రభుత్వానికి మేలే చేస్తుందని చెప్పారు.

గ్రామాలను గాలికొదిలేశారు.. ప్రజలు కష్టాల్లో ఉన్నరు

రెండేండ్లు గడుస్తున్నా రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు పెట్టడం లేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. తద్వారా గ్రామాలను గాలికొదిలేశారని సొంత సర్కారుపైనే విమర్శలు గుప్పించారు. గ్రామాల్లో పాలన కుంటుపడిందని, ప్రజలు కష్టాల్లో ఉన్నరని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో కనీసం మురుగు కాలువలు తీసే పరిస్థితి కూడా లేకుండా పోయిందని తెలిపారు. ప్రజలు త్వరగా స్థానిక ఎన్నికలు పెట్టాలని కోరుతున్నరని చెప్పారు.

ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ విఫలం

నిరుద్యోగ జేఏసీ నాయకుడు వెంకటేశ్



చిక్కడపల్లి,సెప్టెంబర్ 17: ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నిరుద్యోగ జేఏసీ నాయకుడు కయ్య వెంకటేశ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డి మాండ్ చేస్తూ తెలంగాణ నిరుద్యోగ హక్కు ల వేదిక అధ్యక్షుడు అశోక్ చేపట్టిన ఆమరణ దీక్షకు సంఘీభావంగా బుధవారం చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ సెంటర్ వద్ద నిరుద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీక్ష చేపట్టిన అశోక్‌ను పరామర్శించడానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు.

యూరియా ఇప్పించలేని ఎంపీలు ఎందుకు?

- కేసీఆర్ ముందుచూపుతో పదేండ్లలో ఎన్నడూ యూరియా కొరత రాలేదు
- చోటే భాయ్‌పై.. భడే భాయ్‌కి కోపం వస్తుందని ఎంపీలు స్పందించట్లేదా?
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, సెప్టెంబర్ 17 : రాష్ట్రంలో యరియా కొరత రోజురోజుకు తీవ్రమవుతుంటే కాంగ్రెస్, బీజేపీలు ఏం చేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో వేముల విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలపై మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు కలిపి 16 మంది ఎంపీలు ఉన్నారని.. రైతులకు ఇబ్బంది పడుతుంటే ఎంపీలు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు ఉపయోగపడని పదవులు ఎందుకని, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసమర్థ పాలకులు, కాంగ్రెస్ ఎంపీలకు ప్రధాని మోదీని నిలదీసే ధైర్యం ఎందుకు లేదని వేముల ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిని తిడుతున్నా.. శాపనార్థాలు పెడుతున్నా కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీకి మూటలు పంపడం తప్ప వేరే ధ్యాస లేదని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

కేసీఆర్ పాలనలో పుల్లుగా ఎరువులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని, కేసీఆర్ దూరదృష్టి గల పాలన.. రైతులకు స్వర్ణ యుగంగా మారిందని చెప్పారు. కేసీఆర్ ముందుగానే లెక్కలు వేసి, మంత్రుల బృందాన్ని కేంద్రం వద్దకు పంపి, యూరియా తెప్పించే వారని గుర్తుచేశారు.

కాంగ్రెస్ ధాన్యం స్కామ్ గుట్టు రట్టు

- ధాన్యం టెండర్ల కుంభకోణంలో ఫలించిన బీఆర్‌ఎస్ పోరాటం
- కాంగ్రెస్ పెద్దలు తిన్న సొమ్ము కక్కేదాకా పోరాటం ఆగదు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు చేసిన తొలి కుంభకోణం గుట్టు రట్టయిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సివిల్ సప్లై డిపార్టుమెంట్‌లో జరిగిన కుంభకోణం వ్యవహారంలో కాంగ్రెస్ సర్కార్‌ను దోషిగా నిలబెట్టింది బీఆర్‌ఎస్ పార్టీయేనని తెలిపారు. గత 20 నెలలుగా సివిల్ సప్లై శాఖలో జరిగిన అవినీతిపై బీఆర్‌ఎస్ సాగించిన పోరాటం ఫలించిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23లో గత సర్కారు హయాంలో కొనుగోలు చేసి 35 లక్షల టన్నుల ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ముసుగులో కాంగ్రెస్ సర్కారులోని పెద్దలే బినామీలుగా ఉండి రూ.1,100 కోట్ల కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ అందుకు సంబంధించిన ఆధారాలు సహా కోర్టులో పిల్ వేసిందని చెప్పారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని 20 నెలల క్రితమే కోర్టు ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం కౌంటర్ వేయకుండా 18 సార్లు వాయిదా కోరిందని పేర్కొన్నారు. దీనినిబట్టే ఈ కేసులో బీఆర్‌ఎస్ పార్టీ అన్ని రకాల ఆధారాలు సేకరించిందనే విషయం స్పష్టమవుతున్నదని తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, సెంట్రల్ విజిలెన్స్, రాష్ట్ర సంబంధిత విచారణ సంస్థలైన ఏసీబీ, రాష్ట్ర విజిలెన్స్ సంస్థలకు 755 పేజీల రాతపూర్వకమైన వివరాలతో కూడా ఫిర్యాదు చేశామని వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల కుంభకోణంలో బీఆర్‌ఎస్ పాక్షిక విజయం సాధించినట్టయిందని, కాంగ్రెస్ పెద్దలు అక్రమంగా తిన్న ప్రజల సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు.

రోదించినా.. రోడ్డెక్కినా..

రైతులపై కనికరం లేని కాంగ్రెస్ సర్కార్

ఆరుగాలం పనిచేసి పంట పండించాల్సిన రైతులు యూరియా కోసం అరిగోస పడుతూ యుద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచే కర్షకులు రైతు వేదికలు, వ్యవసాయ సంఘాల వద్దకు చేరుకొని చెప్పులను క్యూలో పెట్టారు. పెద్దఎత్తున రైతులు తరలిరావడంతో పలుచోట్ల తోపులాట జరిగింది. ప్రభుత్వం యూరియా సక్రమంగా అందించాలని రైతులు వేడుకుంటున్నారు. యూరియా కోసం టోకెన్లు ఇచ్చి రోజుల తరబడి తిప్పకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సరైన సమయంలో పంటకు యూరియా వేయకుంటే దిగుబడి రాదని ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం వెళ్తుండగా మంచిర్యాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా.. 11 మందికి గాయాలయ్యాయి. – నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

● కర్షకుల పక్షాన కదంతొక్కి..



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో రైతులకు మద్దతుగా ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

ప్రాణాల మీదకు తెచ్చిన యూరియా

యూరియా కోసం ఆటోలో వెళ్తుండగా ప్రమాదం

మహబూబాబాద్ జిల్లాలో పదిమందికి గాయాలు

బయ్యారం సెప్టెంబర్ 17: యూరియా కోసం ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో పది మంది రైతులకు గాయాలైన ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురిమళ్ల గ్రామానికి చెందిన రైతులు యూరియా కోసం తెల్లవారుజామున ఉప్పలపాడుకు ఆటోలో బయలుదేరారు. గురిమళ్ల–కంబాలపల్లి గ్రామాల మధ్య ఆటో బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగినప్పుడు ఆటోలో డ్రైవర్‌తో పాటు 12 మంది ఉండగా, 10 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. వీరిని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు పరామర్శించారు. రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వారి వెంట మండల అధ్యక్షుడు తాత గణేశ్, గంగుల సత్యనారాయణ, మురళీకృష్ణ, శ్రీను, వజ్జా భద్రయ్య, రామారావు ఉన్నారు.



మహబూబాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతును పరామర్శిస్తున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

● యూరియా.. ఇంకెప్పడిస్తరు?



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో గంటల తరబడి క్యూలో నిల్చున్నా యూరియా ఇవ్వకపోవడంతో ధర్నా చేస్తున్న రైతులు

● మా గోడు పట్టదా?



నల్లగొండ జిల్లా త్రిపురారం యూరియా కోసం రైతు వేదికకు వచ్చి చెప్పులు క్యూలో పెట్టి, ఆవరణలో కూర్చున్న మహిళా రైతులు

ప్రాణం తీసిన యూరియా



పోగుల నానక్క (ఫైల్)

తాండూర్, సెప్టెంబర్ 17: యూరియా కోసం వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా రైతు మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం గోపాల్‌రావుపేటలో బుధవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలరావుపేటకు చెందిన పోగుల మల్లేశ్, నానక్క దంపతులు యూరియా దొరకక ఇబ్బంది పడుతున్నారు. బుధవారం రేచిని గ్రామంలో యూరియా పంపిణీ చేస్తున్నారని మల్లేశ్ లైన్‌లో నిల్చున్నాడు. ఒక్కొక్కరికీ ఒకే బస్తా ఇస్తుండడంతో యూరియా కోసం లైన్ నిల్చోవడానికి రావాలని భార్య నానక్కకు ఫోన్ చేసి చెప్పాడు. గ్రామానికి చెందిన ఫీట్ల మారుతీ బైక్‌పై నానక్క రేచినికి వస్తుండగా ఎదురుగా వచ్చిన స్కూల్ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మారుతికి కాలు విరగగా, నానక్కకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వారిని బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నానక్కను కరీంనగర్‌కు తరలిస్తుండగా మృతి చెందింది.

● బోర్డుపై రైతు భవితవ్యం



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్(టీ) మండల కేంద్రంలో బుధవారం రైతువేదికలో నోటీసు బోర్డులో తమ పేర్లను వెతుక్కుంటున్న రైతులు

● ఓట్లకొచ్చినప్పుడు సంగతి చెప్తం



అప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు యూరియా బస్తాల కోసం, పత్తి గింజల కోసం లైన్లు కట్టినం. ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో మళ్లీ అదే పరిస్థితి వచ్చింది. పంట సాగుకు మేం పడుతున్న కష్టాలు ప్రభుత్వానికి తెలుస్తలేదు. మా లాగా ఒక రోజు నాగలి పడితే, రోజంతా లైన్లో నిలబడితే అప్పుడు మా బాధ తెలుస్తది. ఉదయం 6గంటలకు వచ్చి సాయంత్రం 7గంటలకు ఇంటికి పోతున్నం. రైతుబంధు ఇయ్యలే, సన్న వడ్లకు బోనస్ ఇయ్యలే. రేవంత్‌రెడ్డి ఏ మేమో చేస్తనన్న డు.. ఏమీ చేస్తలే డు. మా రైతులను అరిగోస పెడుతున్నడు. ఈ సారి ఓట్లు అడిగేందుకు రా వాలి...అప్పుడు చెప్తం.. కాంగ్రెసోళ్ల సంగతి.

–రబియా, రైతు, సముద్రాల, జనగామ జిల్లా

● అర్ధరాత్రి నుంచే జాగారం



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా కోసం నిద్రిస్తున్న రైతులు

ఈవీఎంపై అభ్యర్థి కలర్ ఫొటో

ఈసీ కొత్త మార్గదర్శకాలు ▪ బీహార్ ఎన్నికలతో అమలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ఈవీఎం బ్యాలట్ పేపర్ల రూపును మారుస్తూ ఎన్నికల కమిషన్ బుధవారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి ఈ కొత్త మార్గదర్శకాలు అమలులోకి వస్తాయి. ఎన్నికల నిబంధనావళి, 1961లోని 498 నిబంధన కింద ఇకపై ఈవీఎంలపైన అభ్యర్థుల బ్లాక్ అండ్ వైట్ ఫొటో స్థానంలో కలర్ ఫొటోను ముద్రించడం జరుగుతుంది. ఓటర్లు అభ్యర్థులను స్పష్టంగా గుర్తు పట్టేందుకు వీలుగా ఈసీ ఈ మార్పు చేపట్టింది. బ్యాలట్ పేపర్‌లో ఫొటో కోసం కేటాయించిన ప్రదేశంలో మూడు వంతులు నిండేలా ఫొటోను ముద్రిస్తారు. దీని వల్ల అభ్యర్థుల ముఖం స్పష్టంగా కనపడుతుంది. దీంతోపాటు అభ్యర్థి సీరియల్ నంబర్‌ని బ్యాలట్ పేపర్‌పైన మరింత ప్రస్ఫుటంగా కనిపించేలా ముద్రించనున్నారు. గతంలో ఉన్న మార్గదర్శకాల ప్రకారం బ్యాలట్ పేపర్‌లో అభ్యర్థి పేరు, పార్టీ చిహ్నం, సీరియల్ నంబర్ వంటి వివరాలతోపాటు అభ్యర్థి బ్లాక్ అండ్ వైట్ ఫొటో చాలా చిన్నదిగా ఉండేది. సవరించిన నిబంధనల కింద బ్యాలట్ పేపర్ డిజైన్, ప్రింటింగ్ మారనున్నాయి. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు గందరగోళానికి గురి కాకుండా ఓటరు హితంగా ఉండే విధంగా ఈసీ మార్పులు తీసుకువస్తోంది.

వెళ్లి ఆ దేవుడికే మొరపెట్టుకోండి!

- పిటిషనర్‌కి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సూచన
- ఆయన వ్యాఖ్యలపై భగ్గుమన్న న్యాయవాదులు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: మధ్యప్రదేశ్‌లో దెబ్బతిన్న శ్రీమహావిష్ణు విగ్రహ పునరుద్ధరణను కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. సీజేఐ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు గాయపరిచే విధంగా ఉన్నాయంటూ కొందరు న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషన్‌ని తోసిపుచ్చిన సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశం భారత పురావస్తు పరిశోధనా శాఖ(ఏఎస్ఐ) పరిధిలోనిదని, ఆ మహావిష్ణువే ఏదో రకంగా జోక్యం చేసుకోవాలని మొరపెట్టుకోవాలని పిటిషనర్‌కి సూచించింది. "ఇది పూర్తిగా ప్రచార ప్రయోజన వ్యాజ్యం. ఏదో ఒకటి చేయమని ఆ దేవుడికే మొరపెట్టుకోండి. విష్ణుమూర్తికి పరమ భక్తుడినని మీరే చెప్పుకున్నారు. ఇక ఆ దేవుడినే ప్రార్థించండి" అని పిటిషనర్ రాకేశ్ దలాల్‌కి ధర్మాసనం సూచించింది. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఖజురహో ఆలయ సముదాయంలో భాగమైన జవారీ ఆలయంలో ధ్వంసమైన 7 అడుగుల శ్రీమహావిష్ణు విగ్రహాన్ని పునరుద్ధరించడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విగ్రహ పునరుద్ధరణ పురావస్తు పరిరక్షణగా మాత్రమే పరిగణించరాదని, ఇది మత విశ్వాసాలకు సంబంధించిందని పిటిషనర్ వాదించారు. మంగళవారం సీజేఐ గవాయ్ చేసిన వ్యాఖ్యలు బహిర్గతం కావడంతో సోషల్ మీడియాలో సీజేఐపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. సీజేఐ గవాయ్‌ని అభిశంసించాలన్న డిమాండు కూడా వైరల్ అయింది. సీజేఐ వ్యాఖ్యలు ప్రజల మత మనోభావాలను గాయపరిచినట్లు కొందరు పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ పలువురు న్యాయవాదులు సీజేఐకి లేఖ రాశారు. ఈ లేఖ ప్రతిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన వినీత్ జిందాల్ అనే న్యాయవాది ఈ వ్యవహారాన్ని రాష్ట్రపతి తీవ్రంగా పరిగణించి ప్రజల మత విశ్వాసాల పట్ల గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మరో న్యాయవాది సత్యం సింగ్ రాజ్‌పుత్ సీజేఐకి ఓ బహిరంగ లేఖ రాస్తూ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వివరణ ఇవ్వాలని సీజేఐని కోరారు.

'బ్యూటీ'ఫుల్‌గా బాదేశారు!

సౌందర్య సంరక్షణ, ఫిజికల్ వెల్‌నెస్, స్పా, యోగా తరగతులపై 5 శాతం జీఎస్టీ వాత

- 13% మేర ట్యాక్స్ తగ్గించినట్టు కేంద్ర ప్రభుత్వం గప్పాలు
- జీఎస్టీ తగ్గించినా కస్టమర్లకు దక్కే లబ్ధి అంతంత మాత్రమే
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూల్‌తో వినియోగదారులపై కొత్త భారం
- బ్యూటీ, వెల్‌నెస్ ఛార్జీలు పెరగొచ్చు: నిపుణులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): సౌందర్య సంరక్షణ, ఫిజికల్ వెల్‌నెస్ సర్వీసులకు సంబంధించి ఇప్పటివరకూ ఉన్న 18 శాతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 5 శాతానికి తగ్గిస్తూ తామేదో గొప్ప పని చేశామని కేంద్రంలోని మోదీ సర్కారు ప్రచారం చేసుకొంటున్నది. అయితే తాజా నిర్ణయంతో సెలూన్‌లు, బ్యూటీ పార్లర్లు, జిమ్ సెంటర్లు, యోగా క్లాసులకు వెళ్లే వేలాది మందికి దక్కే ప్రయోజనం అంతంతేనని తెలుస్తున్నది. బ్యూటీ, వెల్‌నెస్ సర్వీసులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించినప్పటికీ, కస్టమర్లకు ఆ స్థాయిలో ప్రయోజనం చేకూరబోదని పారిశ్రామిక నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు, ఇప్పుడు ఉన్న బిల్లు పెరుగవచ్చని కూడా హెచ్చరిస్తున్నారు. బ్యూటీ, వెల్‌నెస్ సేవలను అందించే సర్వీస్ ప్రొవైడర్లకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ప్రయోజనాలు అందకపోవడమే దీనికి కారణమని విశ్లేషిస్తున్నారు.

ఐటీసీకి 'నో'

సౌందర్య సంరక్షణ, ఫిజికల్ వెల్‌నెస్ సర్వీసులకు ఇప్పటివరకూ 18 శాతం జీఎస్టీ అమల్లో ఉండేది. దీనిని ప్రస్తుతం 5 శాతానికి తగ్గించారు. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) స్పష్టత ఇచ్చింది. ఈ నెల 22వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నది. తాజా నిర్ణయంతో బ్యూటీ సేవలు చవగ్గా అందుబాటులోకి వస్తాయని కేంద్రంలోని పెద్దలు చెప్తున్నారు. అయితే ఈ సేవలపై జీఎస్టీని 5 శాతానికి చేర్చిన కేంద్రం.. ఐటీసీ క్లెయిములకు ఆస్కారం ఉండబోదని వెల్లడించింది. ఇది అంతిమంగా కస్టమర్లకే భారంగా మారనున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

సౌందర్యం భారమే

ప్రస్తుతం బ్యూటీ, వెల్‌నెస్, యోగా క్లాసులను నిర్వహించే సర్వీసు ప్రొవైడర్లు, వ్యాపారులు కస్టమర్ల నుంచి 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. అలాగే ఈ సంస్థలు తాము పెట్టుకున్న కార్యాలయాలకు చెల్లిస్తున్న అద్దెకు, పీఆర్ టీమ్‌కు, వారికి ఇస్తున్న కమీషన్లకు, మార్కెటింగ్ తదితర కార్యకలాపాలకుగాను అన్ని దశల్లో ప్రభుత్వానికి జీఎస్టీని చెల్లిస్తూపోతున్నాయి. చివరకు ఈ మొత్తాన్ని కస్టమర్ల ద్వారా వచ్చే జీఎస్టీ ఆదాయంలో మినహాయించుకొని మిగిలిన దాన్నే సర్కారుకు చెల్లిస్తున్నాయి. ఈ సర్దుబాటు సౌకర్యాన్నే ఐటీసీగా పేర్కొంటారు. అయితే, సౌందర్య సర్వీసుల్లో ఐటీసీ క్లెయిములకు ఆస్కారమే ఉండదని కేంద్రం తాజాగా తేల్చి చెప్పింది. దీంతో తమ వ్యాపార కార్యకలాపాలకు చేసే చెల్లింపుల భారం ఇకపై సర్వీసు ప్రొవైడర్ల మీదనే పడబోతున్నది. అందుకే ఐటీసీని కోల్పోనున్న సర్వీస్ ప్రొవైడర్లు దాన్ని భర్తీ చేసుకునేందుకు తమ సర్వీసు ఛార్జీలను కస్టమర్లపై అదనంగా వేసే వీలుందని ఇండస్ట్రీ విశ్లేషకులు చెప్తున్నారు. ఇదే జరిగితే బ్యూటీ, వెల్‌నెస్ బేస్ ఛార్జీలు పెరగవచ్చని అంటున్నారు. ఇది వినియోగదారులకు కనిపించని కొత్త భారమేనని వివరిస్తున్నారు.

9 నెలల్లో 19 మంది మృతి

కేరళను వణికిస్తున్న 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా'

తిరువనంతపురం: కేరళను 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా' వణికిస్తున్నది. ఈ వ్యాధి బారిన పడి 9 నెలల్లో 19 మంది మృత్యువాతపడ్డారు. ఇప్పటివరకు 61 కేసులు నమోదయ్యాయి. దీనిని ప్రైమరీ అమీబిక్ మెనింగోఎన్‌సెఫలటిస్ (పీఏఎం) అని పిలుస్తారు. ఇది అత్యంత అరుదైన మెదడుకు సోకే వ్యాధి. లక్షణాలు ప్రారంభమైన తర్వాత వేగంగా ఈ వ్యాధి వృద్ధి చెందుతున్నది. కేరళ ఆరోగ్య మంత్రి వీణ జార్జి మాట్లాడుతూ, మొదట్లో ఈ వ్యాధి కొజిక్కోడ్, మలప్పురంలలో మాత్రమే కనిపించేదని, ఇప్పుడు పలు ప్రాంతాల్లో నమోదవుతున్నాయని తెలిపారు.

గాజాలో 65 వేలు దాటిన మరణాలు

జెరూసలేం, సెప్టెంబర్ 17: గత రెండేండ్లుగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో గాజాలో 65,062 మంది మరణించగా, 1,66,697 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ బుధవారం వెల్లడించింది. మృతుల్లో సగం మంది మహిళలు, పిల్లలు ఉన్నారని తెలిపింది. 2023 అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో గాజాలోని చాలా ప్రాంతాలు ధ్వంసం అయ్యాయని చెప్పింది. ఒక వినాశకరమైన సంక్షోభం కారణంగా 90 శాతం మంది నిర్వాసితులుగా మారారని తెలిపింది. అయితే మృతుల్లో పౌరులు ఎంతమంది, మిలిటెంట్లు ఎంతమంది అన్న విషయాన్ని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించ లేదు.

విషప్రయోగంతోనే నావల్నీ మృతి!

- ల్యాబొరేటరీ నివేదికలు ఉన్నాయి: భార్య యూలియా

మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యర్థి అలెక్సీ నావల్నీ మరణంపై ఆయన భార్య యూలియా నావల్నియా మరోమారు సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త అలెక్సీ నావల్నీని జైల్లో విషమిచ్చి చంపారని, బయలాజికల్ శాంపిల్స్ నివేదికల్లో అదే తేలిందని ఆమె అన్నారు. ఆ రిపోర్ట్‌లను విడుదల చేయాలని రెండు దేశాల్లోని ల్యాబొరేటరీలను ఆమె కోరారు. బుధవారం 'ఎక్స్' వేదికగా ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. గత ఏడాది జైల్లో శిక్ష అనుభవిస్తూ అలెక్సీ నావల్నీ మరణించటం రష్యాలో తీవ్ర కలకలం రేపింది. దీనిపై యూలియా మాట్లాడుతూ, 'రెండు దేశాల్లోని ల్యాబొరేటరీలు ఇచ్చిన నివేదికలో ఒకే ఫలితం వెలువడింది. అలెక్సీ హత్యకు గురయ్యారు. విషమిచ్చి చంపారన్నది నివేదికల సారాంశం' అని తెలిపారు.

టాప్ 100 బీ-స్కూల్స్‌లో మూడు ఐఐఎంలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోని టాప్ 100 బిజినెస్ స్కూల్స్‌లో మూడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు చోటు దక్కింది. క్యూఎస్ గ్లోబల్ ఎంబీఏ, ఆన్‌లైన్ ఎంబీఏ, బిజినెస్ మాస్టర్స్ ర్యాంకింగ్స్, 2026ను లండన్ కేంద్రంగా పని చేస్తున్న క్యూఎస్ విడుదల చేసింది. ఐఐఎం బెంగళూరు నిరుటి కన్నా ఒక స్థానం ఎగబాకి 52వ స్థానానికి చేరింది. ఐఐఎం అహ్మదాబాద్ రెండు స్థానాలను ఎగబాకి 58వ స్థానానికి, ఐఐఎం కలకత్తా ఒక స్థానం ఎగబాకి 64వ స్థానానికి చేరాయి. ఎంప్లాయబిలిటీ, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్, థాట్ లీడర్‌షిప్ ఇండికేటర్స్‌లో పటిష్టమైన స్కోర్లు సాధించడంతో ఈ విజయం లభించిందని క్యూఎస్ ఓ ప్రకటనలో తెలిపింది.

పార్లమెంట్, 26/11 ఉగ్రదాడులు మసూద్ అజర్ పనే

జైషే మహ్మద్ కమాండర్ వెల్లడి

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 17: భారత పార్లమెంట్‌పై జరిగిన ఆత్మాహుతి దాడి, 26/11 ముంబై మారణకాండలో జైషే మహ్మద్ అగ్రనేత మసూద్ అజర్ ప్రమేయం ఉందని ఆ సంస్థ కమాండర్ మసూద్ ఇలియాస్ కాశ్మీరీ అంగీకరించాడు. తమ గడ్డపై ఉగ్రవాదులకు ఎలాంటి ఆశ్రయం కల్పించడం లేదని, ఇక్కడి నుంచి ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలు జరగడం లేదంటూ పాకిస్థాన్ బుకాయిస్తుండగా, భారత్‌లోని ఢిల్లీ, ముంబైలో ఉగ్రవాద దాడులకు తమ బాస్ మసూద్ అజర్ పాకిస్థాన్ గడ్డపై నుంచే ప్రణాళిక వేశారంటూ కాశ్మీరీ అంగీకరించడం గమనార్హం. పాకిస్థాన్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో కాశ్మీరీ మాట్లాడుతూ తమ సంస్థ చీఫ్ మసూద్ అజర్ బాలాకోట్ నుంచే భారత్‌పై ఉగ్ర దాడులకు ప్రణాళికలు రచించి, అమలు పరిచారని ప్రకటించారు.

పశువుల్లా ఫుట్‌పాత్‌పై కూర్చోబెట్టి!

- జార్జియాలో భారతీయులకు ఘోర అవమానం
- వీసా, పాస్‌పోర్టు ఉన్నా 5 గంటలపాటు నిలిపివేత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: తమ వద్ద చెల్లుబాటయ్యే పాస్‌పోర్ట్, ఈ-వీసాలు ఉన్నప్పటికీ తనతో పాటు 56 మంది భారతీయుల పట్ల జార్జియా అధికారులు అమానుషంగా ప్రవర్తించారని ఒక మహిళ ఇన్‌స్టాలో ఆరోపించింది. ఆర్మేనియా సడఖ్‌లో సరిహద్దు నుంచి జార్జియాలోకి తమ బృందం ప్రవేశిస్తుండగా, తమను సరిహద్దు వద్ద నిలిపివేశారని తెలిపింది. అక్కడ తమను ఐదు గంటల పాటు చలిలోనే ఉంచేశారని, ఎలాంటి ఆహారం ఇవ్వలేదని, కనీసం బాత్‌రూమ్‌కు కూడా వెళ్లనీయలేదని ఆమె వాపోయారు. అధికారులు రెండు గంటల పాటు తమ పాస్‌పోర్టులు తమ వద్ద ఉంచుకున్నారని, తాము అడిగినా ఎలాంటి సమాచారం తెలపలేదని చెప్పారు. తమను పశువుల్లా బలవంతంగా ఫుట్‌పాత్‌పై కూర్చోబెట్టారని, తామేదో నేరస్థులమైనట్టు తమ వీడియోలు తీశారని, తాము వీడియోలు తీయడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నారని ఆరోపించారు. ఎలాంటి తనిఖీలు చేయకుండానే తమ వీసాలు తప్పుడువని పేర్కొన్నారని, తమ పట్ల జార్జియా అధికారులు ప్రవర్తించిన తీరు సిగ్గు చేటు, ఎంతమాత్రం ఆమోదనీయం కాదు అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దానిని ప్రధాని నరేంద్ర మోదీకి, విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌కు ట్యాగ్ చేశారు. జార్జియా అధికారులు తమ పట్ల అవమానకరంగా, దురుసుగా ప్రవర్తించారని మరికొందరు ఆరోపించారు.

భారత కాన్సులేట్‌ను సీజ్‌చేస్తాం

ఖలిస్థానీల హెచ్చరిక

వాషింగ్టన్: కెనడాలోని వాంకోవర్‌లో ఉన్న ఇండియన్ కాన్సులేట్‌ను సీజ్ చేస్తామని సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) తీవ్రవాద సంస్థ హెచ్చరించింది. 2023 జూన్‌లో హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య జరిగింది. దీనికి నిరసనగా ఈ నెల 18న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపింది. దీంతో కెనడాలోని భారతీయ దౌత్యవేత్తలు, మిషన్స్ భద్రత, రక్షణ పట్ల ఆందోళన వ్యక్తమవుతున్నది. ఎస్ఎఫ్‌జేపై భారత్ 2019లో నిషేధం విధించింది. ఎస్ఎఫ్‌జే విడుదల చేసిన రెచ్చగొట్టే పోస్టర్‌లో, కెనడాలోని ఇండియన్ హై కమిషనర్ దినేశ్ పట్నాయ్‌పై తుపాకీ గురి గుర్తును ముద్రించారు. ఖలిస్థానీ మద్దతుదారులపై కెనడాలోని ఇండియన్ మిషన్స్ నిఘా పెడుతున్నాయని ఓ ప్రకటనలో ఆరోపించింది. కెనడాలో హిందుత్వ ఉగ్రవాదానికి కొత్త నాయకుడిగా దినేశ్‌ను అభివర్ణించింది.

ఎస్‌బీఐలో రూ. 20 కోట్ల దోపిడీ

- సిబ్బందిని కట్టేసి, లూటీకి పాల్పడిన ముగ్గురు దొంగలు
- కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఘటన

విజయపుర, సెప్టెంబర్ 17: కర్ణాటకలోని విజయపుర జిల్లాలో మంగళవారం నాటు తుపాకులు, కత్తులతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోకి ప్రవేశించిన ముగ్గురు ముసుగు దొంగలు బ్యాంకు సిబ్బందిని తాళ్లతో కట్టేసి రూ. 20 కోట్ల విలువైన నగదు, బంగారు ఆభరణాలను దోపిడీ చేసి పరారయ్యారు. విజయపుర జిల్లాలోని చద్చన్ పట్టణంలోని ఎస్‌బీఐ శాఖలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. రూ. కోటికి పైగా నగదు, దాదాపు 20 కిలోల బంగారు ఆభరణాలతో దొంగలు పారిపోయారని పోలీసుల ఎఫ్ఐఆర్ పేర్కొంది. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. నకిలీ నంబర్ ప్లేటుగల వాహనాన్ని నిందితులు ఉపయోగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని విజయపుర ఎస్పీ లక్ష్మణ్ నింబర్గీ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

బలవంతపు బర్త్‌డే విషెస్!

- సోషల్ మీడియాలో మోదీపై ట్రోలింగ్
- "మైమోదీస్టోరీ" పెయిడ్ పీఆర్ ప్రచారం.. నెటిజన్ల విమర్శలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా సెలబ్రిటీల పుట్టినరోజు శుభాకాంక్షలతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సినీ, క్రీడా, పారిశ్రామిక రంగాలకు చెందినవారితోసహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రధాని మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడమేగాకుండా ఆయనతో తాము గడిపిన సందర్భాలను గుర్తు చేసుకుంటున్నారు. మైమోదీస్టోరీ అనే హ్యాష్‌ట్యాగ్‌తో వీరంతా మోదీకి శుభాకాంక్షలు చెప్పడంపై నెటిజన్లలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పెయిడ్ పీఆర్(కూలీ తీసుకుని ప్రచారం చేయడం) అంటూ బీజేపీ ఐటీ సెల్‌పై నెటిజన్లు విమర్శలు గుప్పించడమేగాక ఉత్తర కొరియా తరహా బలవంతపు ప్రచారంగా కూడా వారు అభివర్ణిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా చెస్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఎక్స్‌లో పోస్టు చేసి డిలీట్ చేసిన ట్వీట్‌ని నెటిజన్లు బయటపెడుతున్నారు. మోదీతో కలసి తాను అహ్మదాబాద్‌లో తిన్న భోజనాన్ని గుర్తు చేసుకుంటూ మోదీ పుట్టినరోజు సందర్భంగా విశ్వనాథన్ ఆనంద్ ఓ ట్వీట్ పెట్టారు. అందులో పైన విశ్వనాథన్ ఆనంద్‌జీ అని రాసి ఉంది. తనకు బీజేపీ ఐటీ సెల్ నుంచి ఫార్వర్డ్ అయిన ట్వీట్‌ని యథాతథంగా అట్లాగే తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన విశ్వనాథన్ ఆనంద్ జరిగిన పొరపాటుని వెంటనే గుర్తించి ఆ పోస్టును డిలీట్ చేసి విశ్వనాథన్ ఆనంద్ అని సరిచేసి మళ్లీ ట్వీట్ చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. బీజేపీ ఐటీ సెల్ ప్రచార కండూతిని పసిగట్టిన నెటిజన్లు ఎందుకీ కక్కుర్తి అంటూ నిలదీశారు. పనిలోపనిగా మోదీకి బర్త్‌డే విషెస్ చెప్పేందుకు పోటీపడుతున్న సెలబ్రిటీలపై కూడా విమర్శల దాడి చేశారు. దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యల గురించి ఏనాడూ ప్రభుత్వాన్ని ప్రశ్నించని సెలబ్రిటీలు నేడు నిస్సిగ్గుగా నకిలీ మైమోదీస్టోరీ పేరుతో మోదీకి ప్రచారం చేస్తున్నారని, ఇది చాలా సిగ్గుచేటైన విషయమని ఓ ఎక్స్ యూజర్ మండిపడ్డాడు. విశ్వనాథన్ ఆనంద్ పీఆర్ ప్రయత్నం అభాసుపాలు కావడాన్ని మరో నెటిజన్ ప్రస్తావించారు. బీజేపీ ఐటీ సెల్ వాట్సాప్‌లో పంపించిన స్క్రిప్టును విశ్వనాథన్ ఆనంద్ కాపీ చేసి తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారని, అయితే విశ్వనాథన్ ఆనంద్‌జీని తొలగించడం మరచిపోయారని, ఆ తర్వాత దాన్ని డిలీట్ చేసి జీ లేకుండా రీపోస్టు చేశారని వీణా జైన్ అనే నెటిజన్ పేర్కొన్నారు. మైమోదీస్టోరీ హ్యాష్‌ట్యాగ్‌తో బీజేపీ ఐటీ సెల్ చేస్తున్న పెయిడ్ పీఆర్‌కు సెలబ్రిటీలు వంతపాడడం పట్ల పార్థ్ ఎంఎన్ అనే మరో నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అదానీపై పోస్టులు తొలగించండి

మీడియా, సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: అదానీ గ్రూప్‌కు వ్యతిరేకంగా ఉన్న 138 వీడియోలు, 83 ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లను తొలగించాలని కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వశాఖ రెండు మీడియా సంస్థలకు, పలు యూట్యూబ్ చానళ్లకు, సామాజిక మాధ్యమాలకు ఆదేశాలు జారీచేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ వేసిన ఓ పరువునష్టం దావాపై విచారణ జరిపిన వాయవ్య ఢిల్లీ జిల్లా కోర్టు ఈ నెల 6న జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీచేస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. పరంజోయ్ గుహ ఠాకుర్తా, రవి నాయర్, అబీర్ దాస్ గుప్తా, అయస్కాంత్ దాస్, ఆయుష్ జోషి సహా పలువురు జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలకు చెందిన వార్తా కథనాలు, సోషల్ మీడియా పోస్ట్‌లను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అయితే ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న కొందరి వాదన వినకుండానే ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నుంచి నోటీసులు అందుకున్న కొందరు అసలు ఈ కేసులో ప్రతివాదులుగా కూడా లేరని తెలిసింది.

డ్రగ్స్ సరఫరాదారుగా భారత్‌పై ముద్ర!

చైనా, పాక్, అఫ్గాన్ సహా 23 దేశాలు కూడా ..అమెరికా పార్లమెంట్‌లో ట్రంప్



వాషింగ్టన్, సెప్టెంబర్ 17: మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేక వాటిని ఉత్పత్తి చేస్తున్న ప్రధాన దేశాలలో భారత్, చైనా, పాకిస్థాన్ అఫ్గానిస్థాన్‌తోసహా 23 దేశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మాదకద్రవ్యాలు, వాటిని తయారుచేయడానికి ఉపయోగించే రసాయనాలను అక్రమ రవాణా, ఉత్పత్తి చేయడం ద్వారా ఈ దేశాలు అమెరికాకు, తమ దేశ ప్రజల భద్రతకు ముప్పు తీసుకువస్తున్నాయని ట్రంప్ ఆరోపించారు. అమెరికన్ పార్లమెంట్‌కు సోమవారం సమర్పించిన ఓ నివేదికలో 23 దేశాలను డ్రగ్స్ అక్రమ రవాణా లేక ఉత్పత్తి చేస్తున్న ప్రధాన దేశాలుగా తాను గుర్తించినట్లు ట్రంప్ తెలిపారు. ట్రంప్ ప్రకటించిన దేశాలలో భారత్, చైనా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బహమాస్, బెలీజ్, బొలీవియా, బర్మా, కొలంబియా, కోస్టారికా, డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, హైతీ, హోండురాస్, జమైకా, మెక్సికో, నికరగువా, పనామా, పెరూ, వెనిజులా ఉన్నాయి. అమెరికాలోకి అక్రమంగా డ్రగ్స్ రావడానికి ఈ దేశాలే కారణమని ఆయన తన నివేదికలో ఆరోపించారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడంతో అఫ్గానిస్థాన్, బొలీవియా, బర్మా, కొలంబియా, వెనిజులా ఘోరంగా విఫలమయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ దేశాలు నార్కోటిక్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

దిశా పటానీ ఇంటి వద్ద కాల్పులు జరిపిన

ఇద్దరు నిందితుల ఎన్‌కౌంటర్

బరేలీ, సెప్టెంబర్ 17: యూపీలోని బరేలీలో నటి దిశా పటానీ ఇంటి వద్ద కాల్పులు జరిపిన ఇద్దరు నిందితులు ఘజియాబాద్‌లోని ట్రోనికా నగరంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. మృతులను రవీంద్ర అలియాస్ కల్లు, అరుణ్‌లుగా గుర్తించారు. వీరిద్దరూ రోహిత్ గొడారా-గోల్డ్ బ్రార్ గ్యాంగ్‌లో చురుకైన సభ్యులని, వీరిపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ నెల 12న బైక్‌పై వచ్చిన వీరిద్దరూ దిశా పటానీ ఇంటి బయట కాల్పులు జరిపారు. వీరు ఉపయోగించిన బైక్ ఆధారంగా పోలీసులు వీరి కదలికలు గుర్తించారు. యూపీ స్పెషల్ టాస్క్ ఫోర్స్, హర్యానా స్పెషల్ టాస్క్‌ఫోర్సు, ఢిల్లీ పోలీసులు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో వీరి జాడను పసిగట్టి కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన వీరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 12న దిశా పటానీ తండ్రి, రిటైర్డ్ పోలీస్ అధికారి జగదీశ్ పటానీ లక్ష్యంగా ఇద్దరు నిందితులు కాల్పులు జరిపారని పోలీసులు చెప్పారు.

గిరిజన మహిళకు మూడు వజ్రాలు లభ్యం

భోపాల్, సెప్టెంబర్ 17: మధ్యప్రదేశ్ పన్నా జిల్లాలోని గని ప్రాంతంలో ఒక గిరిజన మహిళకు అత్యంత ఖరీదైన మూడు వజ్రాలు దొరికాయి. 1.48 క్యారెట్, 20, 7 సెంట్ల బరువున్న మూడు వజ్రాలను వేలం వేస్తామని, అప్పుడు వాటి ధర ఏంటన్నది తెలుస్తుందని పన్నా జిల్లా ప్రభుత్వ అధికారి అనుపమ్ సింగ్ మంగళవారం మీడియాకు తెలిపారు. 'మూడు వజ్రాల్లో ఒకటి అధిక నాణ్యత కలిగినది. దీని ఖరీదు చాలా ఉంటుందని భావిస్తున్నాం' అని ఆయన చెప్పారు. పన్నా జిల్లా రాజ్‌పూర్‌కు చెందిన వినీతా గోండ్‌కు పటీ అనే ప్రాంతంలో ఆ వజ్రాలు లభ్యమయ్యాయి. డైమండ్ ఆఫీస్‌కు చెందిన ఈ ప్రాంతాన్ని వినీతా గోండ్ లీజ్‌కు తీసుకున్నారు.

బాబోయ్ బెంగళూరు!

- అధ్వాన రోడ్లు.. అస్తవ్యస్త ట్రాఫిక్
- తమ కార్యాలయాన్ని తరలిస్తున్నట్టు ప్రకటించిన లాజిస్టిక్స్ స్టార్టప్ బ్లాక్‌బక్
- కాంగ్రెస్ సర్కారుపై వ్యాపారుల ధ్వజం




బెంగళూరు, సెప్టెంబర్ 17: స్టార్టప్‌ల హబ్‌గా పేరొందిన బెంగళూరు ప్రతిష్ట అధ్వాన రోడ్లు, అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌తో మసక బారుతోంది. ఈ పరిస్థితులకు విసిగి వేసారిన బ్లాక్‌బక్ అనే లాజిస్టిక్స్ స్టార్టప్ కంపెనీ నగరంలోని ఔటర్‌రింగ్ రోడ్ ప్రాంతం నుంచి తన కార్యాలయాన్ని తరలిస్తున్నది. ఘోరమైన గోతులతో నిండిన రోడ్లు, గంటల తరబడి ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్‌లు, ఉద్యోగులు కార్యాలయాలకు చేరుకోవడానికి గంటల కొద్దీ సమయం పట్టడం తమ కార్యాలయ తరలింపునకు ప్రధాన కారణాలని నిర్వాహకులు ప్రకటించారు. పలు టెక్నాలజీ సంస్థలకు, స్టార్టప్‌లకు కేంద్రంగా ఉన్న బెల్లందూర్‌లోని ఓఆర్ఆర్ రోడ్ ప్రాంతంలో తన కార్యాలయాన్ని తొమ్మిదేండ్ల క్రితం ఏర్పాటు చేసినట్టు సంస్థ సీఈవో రాజేశ్ యబాజీ తెలిపారు. అయితే నగరంలో రోజురోజుకు మౌలిక సదుపాయాలు దిగజారుతున్నాయని, రోడ్లన్నీ అడుగు లోతుకు పైగా గోతులతో నిండి ఉన్నాయని, తమ ఉద్యోగులు కార్యాలయానికి రావడానికి గంటన్నరకు పైగా సమయం పడుతున్నదని చెప్పారు. నగరమంతా దుమ్ముతో నిండిపోతున్నదని, రానున్న ఐదేండ్లలో కూడా ఈ పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం కన్పించకపోవడంతో తాను కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. బ్లాక్‌బక్ ప్రకటనతో కాంగ్రెస్ సర్కారుపై పారిశ్రామికవేత్తలు ధ్వజమెత్తారు. ఇది పాలనా వైఫల్యమేనని కిరణ్‌మజుందార్ షా, మోహన్‌దాస్ పాయ్ తదితరులు మండిపడ్డారు.

గుంతలు పూడిస్తే ఐఫోన్

సిలికాన్ సిటీ బెంగళూరు రోడ్ల దుస్థితిపై విసిగిపోయిన ప్రజల నిస్సహాయతను శిఖర్ అనే ఓ స్టార్టప్ కంపెనీ ఫౌండర్ వినూత్నంగా వెలుగులోకి తెచ్చారు. తన నివాస ప్రాంతంలోని గుంతలమయంగా మారిన రోడ్ల ఫొటోలను ఎక్స్‌లో షేర్ చేస్తూ 'ఈ ఫొటోలు మా వీధిలో ఉన్న గుంతలకు సంబంధించినవి. మూడేండ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు కూడా ఆశలు వదులుకున్నారు. దీనిపై ఎవరైనా ప్రభుత్వాన్ని కదిలించగలిగితే నేను వారికి ఐఫోన్ బహుమతిగా ఇస్తాను' అని అందులో రాసుకొచ్చారు.

ఫ్యాటీ లివర్‌కు తొలి ఔషధం!

- అభివృద్ధి చేసిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు
- ఊబకాయం, టైప్ 2 మధుమేహం ఉన్నవారికి ఈ వ్యాధి ప్రాణాంతకం



కాలిఫోర్నియా: శరీరంలోని జీవ కణాలలో కలిగే రసాయనిక మార్పులకు సంబంధించిన స్టెటోహెపటైటిస్ (ఎంఏఎస్‌హెచ్)కు చికిత్సలో భరోసానిచ్చే ఔషధాన్ని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, శాన్ డియాగో స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు గుర్తించారు. ఎంఏఎస్‌హెచ్ అనేది ఊబకాయం, టైప్ 2 మధుమేహంతో సంబంధం గల ఫ్యాటీ లివర్ తీవ్ర రూపం. ఇది సిరోసిస్, లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉంటుంది. ఈ మందును ఐఓఎన్224 అని పేర్కొంటున్నారు. ఇది కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని, మంట పుట్టడాన్ని ఆపుతుంది.

మూడోదశ పరీక్షలు విజయవంతమైతే..

ఊబకాయం, టైప్ 2 మధుమేహం వంటి శరీరంలోని జీవ కణాలలో కలిగే రసాయనిక మార్పులతో బాధపడేవారికి ఎంఏఎస్‌హెచ్ సోకుతుంది. దీనిని నిశ్శబ్ద రోగం అంటారు. ఎందుకంటే, ఇది ఎటువంటి లక్షణాలను ప్రదర్శించకుండా సంవత్సరాల తరబడి క్రమంగా పెరుగుతూ ఉంటుంది. మూడో దశ పరీక్షల్లో కూడా ఈ కొత్త ఔషధం విజయవంతమైతే, రోగులకు చికిత్సలో ఉపయోగిస్తామన్నారు. వ్యాధి ప్రాణాంతక దశకు చేరుకోక ముందే చికిత్స చేయగలుగుతామని తెలిపారు.



అబుదాబిలో తొలి డ్రైవర్‌లెస్ డెలివరీ వాహనం

అబుదాబి: అబుదాబి తన తొలి అటానమస్ (డ్రైవర్ రహిత) డెలివరీ వాహనం పైలట్ ప్రోగ్రామ్‌ను మస్దర్ సిటీలో ప్రారంభించింది. స్థానిక టెక్నాలజీ, లాజిస్టిక్ సంస్థలతో కలిసి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో దీనిని అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లాజిస్టిక్స్‌ను రోజువారీ జీవితంలో ఉపయోగించుకునేందుకు చేపట్టిన మొదటి కార్యక్రమం ఇదే. ఈ వాహనాలను ఆటోగో అభివృద్ధి చేసింది. వీటికి డ్రైవర్లు అవసరం లేదు. కృత్రిమ మేధ, అడ్వాన్స్‌డ్ స్మార్ట్ మొబిలిటీ సిస్టమ్స్‌తో ఇవి పని చేస్తాయి. వెహికల్‌కు అబుదాబి మొట్టమొదటి అధికారిక లైసెన్స్ ప్లేట్‌ను మంజూరు చేసింది.

పోలీస్ పోస్టులు భర్తీ చేయకపోవడంపై

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్ శాఖలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఆ పోస్టుల భర్తీలో ప్రభుత్వం రాజీ పడుతోందని ఆరోపిస్తూహైదరాబాద్‌కు చెందిన కే అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారించింది.

స్పోర్ట్స్ అథారిటీని ప్రతివాదిగా చేర్చండి

డీఎస్సీ-2024 నియామకాలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో స్పోర్ట్స్ అథారిటీని ప్రతివాదిగా చేర్చాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. 96 ఎస్‌జీటీ పోస్టుల నియామకంలో అవకతవకలు జరిగాయంటూ కొత్తగూడెం జిల్లాకు చెందిన టీ జోత్స్న దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పీ కార్తీక్ విచారణ చేపట్టారు.

జీవో 150పై పిటిషన్ కొట్టివేత

ఎంబీబీఎస్ , బీడీఎస్ సీట్ల భర్తీ కోసం జారీ అయిన జీవో 33, జీవో 150లో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది.

సైనిక్ స్కూల్ విద్యార్థికి ఊరట

తెలంగాణకు చెందిన తనకు స్థానిక కోటాలో సీటు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన 'నీట్' అభ్యర్థి శశికిరణ్‌కు కోర్టులో ఊరట లభించింది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు















ఆర్ఎస్ బ్రదర్స్‌లో ప్రత్యేక పండుగ ఆఫర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 17: రిటైల్ షాపింగ్‌లో తనదైన ముద్ర వేసుకున్న ఆర్ఎస్ బ్రదర్స్ ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని 'దసరా బ్లాక్‌బస్టర్ స్పాట్ గిఫ్ట్స్' పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.2 వేల విలువ చేసే ప్రతీ కొనుగోలుపై విశేషమైన కానుకలు అందిస్తున్నది. కొద్ది రోజులు మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద రూ.4,495 విలువైన స్వర్ణ పట్టుచీరను కొనుగోలు చేసిన వారికి రూ.45 లకే మరో చీరను కానుకగా అందిస్తున్నది. అలాగే రూ.4,995 విలువైన పట్టు చీరను కొన్నవారికి మిక్సీగ్రైండర్‌ను ఉచితంగా ఆఫర్ చేస్తున్నది.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్‌లో సెలబ్రేషన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 17: పెండ్లిళ్ల సీజన్, దసరా పర్వదిన వేడుకలను దృష్టిలో పెట్టుకొని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. సూపర్ ధమాకా ఆఫర్స్, స్పాట్ గిఫ్ట్స్‌లో భాగంగా రూ.2 వేల విలువ చేసే ప్రతీ కొనుగోలుపై ఆకర్షణీయమైన బహుమతులను అందిస్తున్నది. దీంతోపాటు రూ.4,335 విలువ చేసే కామాక్షి పట్టుచీరను కొనుగోలు చేసిన వారికి మరో చీరను కేవలం రూ.45కే అందిస్తున్న సంస్థ..రూ.4,995 విలువ చేసే పట్టుచీరతో పాటు మిక్సీగ్రైండర్‌ను కానుకగా అందిస్తున్నది. వీటితోపాటు మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, లీడింగ్ బ్రాండ్స్‌పై స్పెషల్ కాంబో ఆఫర్లను కొనుగోలుదారులకు అందిస్తున్నది.

పావుశాతం వడ్డీరేట్లను తగ్గించిన ఫెడ్ రిజర్వ్

న్యూయార్క్, సెప్టెంబర్ 17: అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఎట్టకేలకు వడ్డీరేట్లను తగ్గించింది. 9 నెలల తర్వాత అంచనాలకు తగ్గట్టుగానే బుధవారం కీలక వడ్డీరేటుకు పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టింది. ఈ ఏడాదిలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, తాజా నిర్ణయంతో ప్రస్తుతం వడ్డీరేట్ల శ్రేణి 4-4.25 శాతంగా ఉన్నది. ఇక అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నిసార్లు వడ్డీరేట్లను తగ్గించాలని సూచించినా ద్రవ్యోల్బణం, ప్రతీకార సుంకాల నేపథ్యంలో ఫెడ్ మాత్రం పట్టించుకోలేదు. అయితే ఈసారి మెజారిటీ సభ్యులు తగ్గింపునకే ఓటేశారు. ఇదిలావుంటే ఈ ఏడాది మరో రెండుసార్లు వడ్డీరేట్లను ఫెడ్ తగ్గించే వీలుందన్న అంచనాలున్నాయి.

విస్తరణ బాటలో తనైరా

హైదరాబాద్, సెప్టెంబర్ 17: టాటా గ్రూపునకు చెందిన తనైరా విస్తరణ బాట పట్టింది. ప్రతి యేటా 15 నుంచి 20 కొత్తగా స్టోర్లను తెరవబోతున్నట్టు కంపెనీ సీఈవో అంబుజ్ నారాయణ్ తెలిపారు. వచ్చే రెండు నుంచి మూడేండ్లకాలంలో లాభాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న ఆయన.. ప్రస్తుత పండుగ సీజన్‌లో 30 శాతం వృద్ధిని సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా సంస్థకు 80 స్టోర్లు ఉండగా, అలాగే హైదరాబాద్‌లో ఏడు ఉన్నాయన్నారు.

బెంగళూరులో కిమ్స్ దవాఖాన




హైదరాబాద్, సెప్టెంబర్ 17: కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్ హాస్పిటల్స్)..తాజాగా కర్ణాటకలో అడుగుపెట్టింది. తన తొలి దవాఖానను బెంగళూరులో ప్రారంభించింది. 450 పడకల విస్తీర్ణంతో నెలకొల్పిన తొలి మల్టీ-స్పెషాల్టీ హాస్పిటల్‌లో 35 మెడికల్ అండ్ సర్జికల్ స్పెషాల్టీ, 120కి పైగా అడ్వాన్స్ ఐసీయూ బెడ్స్, 100కి పైగా అవుట్‌పేషెంట్ రూమ్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా కిమ్స్ సీఎండీ భాస్కర్ రావు మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బెంగళూరులో తొలి దవాఖానను ప్రారంభించినట్టు, రోగులకు ఉత్తమ క్లినికల్ సేవలు అందించడానికి ఎల్లప్పుడు మా వైద్య బృందం కృషి చేయనున్నట్టు చెప్పారు. అలాగే బెంగళూరులోని ఎల్రక్టానిక్ సిటీలో రెండో దవాఖానను కూడా త్వరలో తెరవనున్నట్టు ఆయన ప్రకటించారు.

గోరంతకు కొండంత దీర్ఘాలు

కాంగ్రెస్ తెచ్చిన పెట్టుబడులు రూ.18,600 కోట్లే!

రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని సర్కారు గొప్పలు • రాష్ట్రంలో గత 20 నెలల్లో 2,900 పరిశ్రమలకే అనుమతి

మూడింటా రెండొంతులు సూక్ష్మ పరిశ్రమలే • కార్యరూపం దాల్చని ఎంవోయూలు • సగానికి కొత్త పరిశ్రమల స్థాపన



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కుంటుబడింది. గతంతో పోల్చుకుంటే సగానికి పడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో టీజీ ఐపాస్ ద్వారా కేవలం 2,900 పరిశ్రమలకు మాత్రమే అనుమతులు మంజూరయ్యాయి. వాటి ద్వారా వచ్చిన పెట్టుబడులు రూ.18,600 కోట్లు మాత్రమే. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్తున్న రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు కేవలం కాగితాల (ఎంవోయూల)కే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానంలో సులభంగా అనుమతులు జారీ చేసేందుకు 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం (టీజీ ఐపాస్) పేరుతో సరికొత్త చట్టాన్ని ప్రవేశపెట్టిన విషయం విదితమే. ఆన్‌లైన్‌లో ఒకే దరఖాస్తుతో నిర్ణీత గడువులోగా అన్ని రకాల అనుమతులు మంజూరు కావడమే ఈ విధానం ప్రత్యేకత. విప్లవాత్మకమైన ఈ విధానం అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో ఒక్కసారిగా పెట్టుబడులు ఊపందుకున్నాయి. 2014-15 నుంచి ఇప్పటివరకు మొత్తం 28,078 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయి. వాటి ద్వారా రూ.3.03 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు, 19 లక్షల పైచిలుకు ఉద్యోగావకాశాలు వచ్చాయి. బీఆర్ఎస్ హయాంలో 2014-15 నుంచి 2023-24 వరకు ఏటా సగటున 2,800 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయి. 2021-22లో రికార్డు స్థాయిలో ఏకంగా 4 వేల పరిశ్రమలకు అనుమతులివ్వడం విశేషం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ అనుమతుల సంఖ్య సగానికి పడిపోయింది. 2024-25లో కేవలం 2,050 పరిశ్రమలకు, 2025-26లో ఇప్పటివరకు 915 పరిశ్రమలకు మాత్రమే అనుమతులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ హయాంలో వచ్చిన 2,900 పరిశ్రమల్లో సూక్ష్మ పరిశ్రమలే 1,900లకు పైగా ఉన్నాయి. గత 20 నెలల్లో దావోస్, జపాన్, అమెరికా పర్యటనల సందర్భంగా దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్తున్నప్పటికీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. దీన్నిబట్టి రాష్ట్రంలో పారిశ్రామిక రంగం ఎంత అధ్వానంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

బీఆర్ఎస్ హయాంలో పెట్టుబడుల వెల్లువ

బీఆర్ఎస్ హయాంలో టీజీ ఐపాస్‌ను ప్రవేశపెట్టాక తొలి రెండేండ్లు మినహా ప్రతి సంవత్సరం 2,700కుపైగా అనుమతులు మంజూరయ్యాయి. 2019-20 నుంచి 2022-23 వరకు ఏటా 3 వేలకుపైగా పరిశ్రమలకు అనుమతులిచ్చారు. 2021-22లో రికార్డు స్థాయిలో ఏకంగా 4 వేలకుపైగా పరిశ్రమలకు అనుమతులు జారీ అయ్యాయి. ముఖ్యంగా కొవిడ్ సంక్షోభ సమయంలోనూ రాష్ట్రానికి పెట్టుబడుల వరద ఆగలేదు. అలా ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన మొత్తం రూ.3.03 లక్షల కోట్ల పెట్టుబడుల్లో రూ.18,600 కోట్లు మినహా మిగిలినవన్నీ బీఆర్ఎస్ హయాంలో వచ్చినవే. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం శరవేగంగా పరుగులు పెట్టిందనడానికి ఇదే నిదర్శనం.

రంగాలవారీగా వివరాలు

స్థాయి	తయారీ	సేవా
సూక్ష్మ	17,085	1,839
చిన్న	6,595	504
మధ్యతరహా	770	92
పెద్ద	647	118
భారీ	269	159
మొత్తం	25,366	2,712

2014-15 నుంచి వచ్చిన పరిశ్రమల వివరాలు

సంవత్సరం	అనుమతులిచ్చిన పరిశ్రమల సంఖ్య	తయారీ రంగం	సేవా రంగం	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉద్యోగావకాశాలు
2014-15	174	173	1	1,805.80	5,051
2015-16	1,526	1,511	15	28,954.60	94,196
2016-17	1,701	1,561	140	33,492.76	95,058
2017-18	2,789	2,475	314	57,661.01	2,73,362
2018-19	2,775	2,416	359	34,201.18	5,99,168
2019-20	3,004	2,656	348	40,068.36	3,14,825
2020-21	3,382	3,019	363	16,047.26	1,62,592
2021-22	4,001	3,567	434	18,073.01	99,609
2022-23	3,107	2,864	243	26,917.13	1,01,002
2023-24	2,659	2,469	190	28,100.14	84,342
2024-25	2,050	1,820	230	13,730.79	50,326
2025-26	915	830	85	4,869.06	23,455
మొత్తం	28,078	25,361	2,717	3,03,921.10	19,02,986

ఒకే వెబ్‌సైట్‌పై అన్ని బీమా సంస్థల సేవలు

బీఎస్ఐఎఫ్ అధికారిక పోర్టల్‌ను ప్రారంభించిన ఐఆర్‌డీఏఐ చీఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్ సేథ్.. బుధవారం బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ (బీఎస్ఐఎఫ్) అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. 2047కల్లా అందరికీ బీమాతోపాటు ప్రధాన మంత్రి 'వికసిత్ భారత్ 2047' మిషన్ లక్ష్యాల సాధనలో భాగంగా దీన్నో ముందడుగుగా ఓ ప్రకటనలో ఐఆర్‌డీఏఐ పేర్కొన్నది. పాలసీదారుల సాధికారతకు కృషి చేస్తున్నట్టు అజయ్ సేథ్ ఇందులో తెలిపారు. అందరికీ బీమా ప్రయోజనాలు అందేలా, ఎక్కడా పారదర్శకత లోపించకుండా కావాల్సిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఒకే వేదికపై అన్నిరకాల బీమా సేవలను పాలసీదారులకు అందించేలా ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించినట్టు అజయ్ సేథ్ వివరించారు. వివిధ సంస్థలు అందిస్తున్న విస్తృత శ్రేణి జీవిత, ఆరోగ్య, జనరల్ ఇన్సూరెన్స్ ప్లాన్లను ఇక్కడ ఎంపిక చేసుకోవచ్చు. పాలసీ ఎంపిక, కొనుగోలు దగ్గర్నుంచి క్లెయిమ్ సెటిల్మెంట్, రెన్యువల్‌దాకా కేవలం పాలసీ నెంబర్‌ను వినియోగించి ఎలాంటి పత్రాలు లేకుండానే సులువుగా పనిని పూర్తిచేసుకోవచ్చు.

తగ్గిన పసిడి ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపారు. ఫలితంగా ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.1,300 తగ్గి రూ.1,13, 800కి దిగొచ్చింది. మంగళవారం పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,800 ఎగబాకి రికార్డు స్థాయి రూ.1,15,100కి చేరుకున్న విషయం తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధర రూ.1,670 తగ్గి రూ.1,31, 200కి దిగొచ్చింది.

వ్యవసాయేతర కమోడిటీ డెరివేటివ్‌ల్లోకి..

బ్యాంకులు, బీమా సంస్థల పెట్టుబడులను అనుమతించే దిశగా సెబీ

ముంబై, సెప్టెంబర్ 17: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. నాన్-క్యాష్, నాన్-అగ్రికల్చర్ కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లలో బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులను అనుమతించాలని యోచిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని చూస్తున్నట్టు బుధవారం సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. కాగా, నాన్-క్యాష్ సెటిల్డ్, నాన్-అగ్రికల్చరల్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టుల్లో ట్రేడింగ్‌కు ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీవో)ను అనుమతించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నట్టు ఇక్కడ ఎంసీఎక్స్ నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లు కీలకపాత్ర పోషిస్తాయన్న పాండే.. ప్రపంచ స్థాయిలో ధరలను అనుసరించే స్థాయి నుంచి ఆ ధరలను నిర్ణయించే స్థాయికి భారత్ ఎదగాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ఇక డిసెంబర్ కల్లా కాంప్లియెన్స్ రిపోర్టుల కోసం కామన్ రిపోర్టింగ్ మెకానిజంలో కమోడిటీ-స్పెసిఫిక్ బ్రోకర్లనూ సమ్మిళితం చేయనున్నట్టు పాండే ఈ సందర్భంగా తెలియజేశారు.

'పెద్ది' ఫస్ట్‌సింగిల్ అప్పుడే!



సాధారణంగా క్రీడా నేపథ్య చిత్రాలంటే ఏదో ఒక ఆట మీద నడుస్తుంటాయి. కానీ 'పెద్ది' అలా కాదు. ఇందులో కథానాయకుడు రామ్‌చరణ్ ఏ ఆటనైనా ఆడగలిగే ప్రతిభాసామర్థ్యాలున్న ఆటకూలీగా కనిపిస్తాడని సమాచారం. దాంతో ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేస్తున్నది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్నది. వచ్చే ఏడాది మార్చి 27న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం దసరా కానుకగా ఈ సినిమాలోని తొలి గీతాన్ని విడుదల చేయబోతున్నారని తెలిసింది. నాయకానాయికలు రామ్‌చరణ్, జాన్వీకపూర్లపై చిత్రీకరించిన మెలోడీ గీతమిదని, దీనికి ఏ.ఆర్.రెహమన్ అద్భుతమైన ట్యూన్ సమకూర్చారని అంటున్నారు. ఈ చిత్రాన్ని గ్లోబల్ రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నందున ఓవైపు షూటింగ్ జరుపుతూనే..దసరా నుంచి ప్రమోషనల్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నది మేకర్స్ ఆలోచనగా చెబుతున్నారు. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

తెలంగాణ గ్రామీణ ప్రేమకథ
బ్యాండ్ మేళం



'కోర్ట్' చిత్రంతో ప్రేక్షకుల్ని మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవి జంట మరోమారు ఓ అందమైన ప్రేమకథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. ఈ సినిమాకు 'బ్యాండ్ మేళం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఎవ్రీ బీట్ హ్యాజ్ యాన్ ఎమోషన్' ఉపశీర్షిక. సతీష్ జవ్వాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన ఫిల్మ్స్ పతాకంపై కావ్య, శ్రావ్య నిర్మిస్తున్నారు. బుధవారం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. తెలంగాణ జానపద గీతంతో గ్లింప్స్ మొదలైంది. తెలంగాణ యాసలో నాయకానాయికల మధ్య జరిగే సంభాషణ ఆకట్టుకునేలా ఉంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఓ అందమైన ప్రేమకథగా చిత్రాన్ని తీర్చిదిద్దారని గ్లింప్స్‌ను బట్టి అర్థమవుతున్నది. చంద్రబోస్ సాహిత్యాన్నందిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: విజయ్ బుల్గానిన్, సమర్పణ: మ్యాంగో మాస్ మీడియా, రచన-దర్శకత్వం: సతీష్ జవ్వాజీ.

ఐదు రూపాయల చుట్టూ నడిచే కథ



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'కాయిన్'. జైరామ్ చిటికెల దర్శకత్వంలో శ్రీకాంత్ రాజారత్నం రూపొందిస్తున్నారు. బుధవారం హీరో చంద్రహాస్ పుట్టిన రోజు సందర్భంగా టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు. పాత ఐదు రూపాయల కాయిన్ ఎందుకు బ్యాన్ అయిందనే నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, కథలోని క్రైమ్ ఎలిమెంట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుందని దర్శకుడు తెలిపారు. కాయిన్ చుట్టూ ఉత్కంఠభరితంగా సాగే కథాంశమిదని హీరో చంద్రహాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సాయిరాజేష్, సంగీత దర్శకుడు నిమిషి జాకియాస్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రం

రెండు వేలకు మించి ఖర్చుపెట్టను!




అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ, తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

మిడిల్ క్లాస్‌కు నచ్చే సినిమా




'సినీరంగంలో సక్సెస్ పర్సంటేజ్ చాలా తక్కువ. ఒక సినిమా తీసి హిట్ కొడదామంటే కుదరదు. ఫలితాలతో సంబంధం లేకుండా మంచి కథలతో సినిమాలు చేయాలన్నదే నా లక్ష్యం' అన్నారు విజయ్‌పాల్ రెడ్డి అడిదల. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా ఆయన నిర్మించిన 'బ్యూటీ' చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి మాట్లాడుతూ ''బ్యూటీ' సినిమా టైటిల్ క్యాచీగా ఉండటంతో ప్రేక్షకులకు బాగా రీచ్ అయింది. ప్రచార చిత్రాలకు కూడా మంచి స్పందన లభించింది. ఈ సినిమాలో అందమైన ప్రేమకథతో పాటు హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి. ప్రతీ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ చూడాల్సిన సినిమా ఇది. తల్లిదండ్రులకు కూడా ఈ సినిమాలో చర్చించిన అంశం బాగా నచ్చుతుంది. దాదాపు 150 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సినిమాను ఇప్పటికే చాలా మంది చూశారు. కొందరైతే 'బేబీ' 'కోర్ట్' స్టైల్లో ఉందని మెచ్చుకున్నారు. తప్పకుండా ఈ సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు.

సందిగ్ధంలో దాదాసాహెబ్‌ఫాల్కే బయోపిక్



భారతీయ సినీ పితామహుడుగా అభివర్ణించే దాదాసాహెబ్‌ఫాల్కే జీవిత కథను వెండితెర దృశ్యమానం చేయడానికి అగ్ర హీరో అమీర్‌ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హీరానీ గతకొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. స్క్రిప్ట్‌వర్క్ మొత్తం పూర్తయిందని, అక్టోబర్‌లో సినిమాను లాంఛనంగా ప్రారంభిస్తారని వార్తలొచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్‌ను అమీర్‌ఖాన్ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిసింది. అమీర్‌ఖాన్-రాజ్‌కుమార్ హీరానీ కలయికలో గతంలో త్రీ ఇడియట్స్, పీకే వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ వచ్చాయి. దాంతో తాజా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి మొదలైంది. అయితే ఈ సినిమా స్క్రిప్ట్ విషయంలో అమీర్‌ఖాన్ అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు. 'ప్రేక్షకుల్ని థియేటర్‌కు రప్పించే ఎలిమెంట్స్ ఈ స్క్రిప్ట్‌లో లేవు. మొత్తం సీరియస్ డ్రామాలా డిజైన్ చేశారు. వినోదం మచ్చుకైనా లేదు. స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తే ఈ సినిమా విషయంలో నిర్ణయం తీసుకోవచ్చు' అని అమీర్‌ఖాన్ రాజ్‌కుమార్ హీరానీకి తేల్చిచెప్పారట. ఈ నేపథ్యంలో ఈ సినిమా కార్యరూపం దాల్చేది అనుమానమేనని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

ప్రధాని మోదీ బయోపిక్



భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవిత చరిత్ర వెండి తెరకెక్కబోతున్నది. 'మా వందే' పేరుతో రూపొందించనున్న ఈ చిత్రానికి క్రాంతికుమార్ సి.హెచ్. దర్శకత్వం వహిస్తారు. నరేంద్ర మోదీ పాత్రను మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ పోషిస్తున్నారు. మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని ఆసక్తికరమైన సంఘటనలు, ఆయన ఎదుర్కొన్న సవాళ్లను ఈ సినిమాలో చూపించబోతున్నామని, అంతర్జాతీయ ప్రమాణాలతో పాన్ ఇండియాతో పాటు ఇంగ్లీష్‌లోనూ తెరకెక్కించబోతున్నామని నిర్మాత వీర్ రెడ్డి ఎం. తెలిపారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితంలోని యథార్థ సంఘటనలను ఈ సినిమాలో ఆవిష్కరించబోతున్నామని దర్శకుడు క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కె.కె.సెంథిల్ కుమార్, సంగీతం: రవి బస్రూర్, నిర్మాణ సంస్థ: సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్, ప్రొడక్షన్ డిజైన్: సాబు సిరిల్, రచన-దర్శకత్వం: క్రాంతికుమార్ సి.హెచ్.


ప్రీ వెడ్డింగ్ షూట్ కహానీ



'ప్రపంచానికి తెలియటం కంటే ముందే తిరువీర్ గురించి నాకు తెలుసు. తను కలల ప్రపంచంలో జీవించటాన్ని చూసి నేను సంతోషపడుతుంటాను. ఈ సినిమా టీజర్ చల్లటిగాలి మనసుని హత్తుకున్నట్లుగా ఆసక్తికరంగా ఉంది' అని విజయ్ దేవరకొండ 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రబృందాన్ని అభినందించారు. తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర టీజర్‌ను అగ్ర హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. 'ఇదేన్నా మా ఊళ్లో రమేష్ ఫొటో స్టూడియో. ఈ మండలంలో బర్త్‌డే అయినా, వెడ్డింగ్ అయినా, ప్రీ వెడ్డింగ్ అయిన మన దగ్గరే చేయించుకుంటారన్నా..' అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ వినోదాత్మకంగా సాగింది. ప్రీ వెడ్డింగ్ షూట్ ఈవెంట్ నేపథ్యంలో నాయకానాయికల మధ్య నడిచే ప్రేమకథ..ఈ క్రమంలో పండే వినోదంతో ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె.సోమశేఖర్, సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాత: సందీప్ అగరం, ఆస్మితా రెడ్డి బాసిని, రచన-దర్శకత్వం: రాహుల్ శ్రీనివాస్.

పొలిటికల్ బ్రోకర్‌గా కనిపిస్తా!

'నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తీసిన సినిమా 'భద్రకాళి'. ఇప్పటివరకూ వచ్చిన పొలిటికల్ కాన్సెప్ట్ చిత్రాలకు భిన్నంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు హీరో విజయ్ ఆంటోని. ఆయన తాజా చిత్రం 'భద్రకాళి' ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. అరుణ్‌ప్రభు దర్శకుడు. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయకుడు విజయ్ ఆంటోని పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు...



- 'భద్రకాళి' పొలిటికల్ థ్రిల్లర్. దేశ సమకాలీన రాజకీయాలను చర్చిస్తుంది. ఇందులో నేను పొలిటికల్ మీడియేటర్ (బ్రోకర్) పాత్రలో కనిపిస్తా. సాధారణంగా రాజకీయ కథాంశాల్లో డ్రామా ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ ఇందులో పాలిటిక్స్‌ను సహజంగా, వాస్తవికత ప్రధానంగా చూపించడం జరిగింది. రాజకీయాల్లో మీడియేటర్ ఏం చేస్తాడు? ఓ పెద్ద కుంభకోణంలో అతని పాత్ర ఏమిటి? అనే అంశాలు ఆసక్తికరంగా అనిపిస్తాయి.
- నా కెరీర్‌లో 25వ సినిమా ఇది. దర్శకుడు అరుణ్‌ప్రభు అద్భుతమైన కథ తయారు చేశాడు. ఇలాంటి పొలిటికల్ బ్రోకర్ క్యారెక్టర్ ఇప్పటివరకూ రాలేదు. ప్రతి సన్నివేశం రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇందులో నేను మేకప్ లేకుండా నటించాను. కథలో భాగంగా వచ్చే నాలుగు పాటలు ఆకట్టుకుంటాయి.
- నటుడిగా నాకు ప్రతిభ ఉందో లేదో తెలియదు కానీ..ప్రతీ సినిమా కోసం రాత్రి పగలు కష్టపడతాను. 'బిచ్చగాడు' చిత్రం నుంచి తెలుగు ప్రేక్షకులు నన్ను గొప్పగా ఆదరిస్తున్నారు. భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయుక్తమయ్యే చిత్రాల్లోనే నటించాలనుకుంటున్నా. ప్రస్తుతం యాక్టింగ్, ప్రొడక్షన్స్‌పైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నా. అందుకే మ్యూజిక్ డైరెక్షన్‌కు కాస్త దూరమయ్యా. భవిష్యత్తులో మ్యూజిక్ కోసం సమయం కేటాయించాలనుకుంటున్నా. ప్రస్తుతం 'బిచ్చగాడు' దర్శకుడు శశితో 'వందదేవుళ్లు' సినిమా చేస్తున్నా. బిగ్‌స్కేల్ మూవీ అది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రిలీజ్ అవుతుంది.

మిత్ర పురుగులతో మేలు



పెరటి తోటలను ఆశించే చీడపీడలను నివారించడానికి రసాయన మందులనే ఆశ్రయించాల్సిన అవసరం లేదు. మొక్కలకు మేలుచేసే మిత్ర పురుగులను ఆకర్షిస్తే సరిపోతుంది. ఫలితంగా.. కొన్నిరకాల తెగుళ్లను నియంత్రించి, తోటను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. సాలె పురుగులు, తూనీగలు, పైరేట్ నల్లులతోపాటు కొన్నిరకాల ఈగలు కూడా పంటలకు మేలు చేస్తాయి. మొక్కలకు హానిచేసే రకరకాల కీటకాలను నివారించడంలో ఇవి సాయపడతాయి. ముఖ్యంగా పేనుబంక, దోమలు, తెల్లదోమ వంటి హానికర పురుగులను తిని మొక్కలను కాపాడతాయి. అయితే, రసాయన మందులు ఎక్కువగా వాడితే.. మిత్రపురుగులు కూడా చనిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి, వాటి వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను పాటించండి. దీనివల్ల రసాయనాల అవశేషాలు లేని కూరగాయలు, ఆకు కూరలు చేతికి అందుతాయి. ఇక కొన్నిరకాల పక్షులు కూడా చీడపురుగులను తింటాయి. వాటికోసం తోటల్లో పక్షిస్థావరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిది. తోటలో మొక్కల వైవిధ్యాన్ని పెంచడం కూడా ఓ చిట్కానే! తోటలోకి మిత్ర పురుగులను ఆకర్షించే కొన్ని మొక్కలను నాటండి. సోంపు, కొత్తిమీర, మెంతులు నాటడం వల్ల లేడీబగ్స్, హోవర్‌ఫ్లై లాంటి ఈగలు వస్తాయి.

నమస్తే తెలంగాణ

జిందగీ

గురువారం | 18 సెప్టెంబర్ 2025
హైదరాబాద్ | www.ntnews.com



ఆమెకు పుస్తకాలంటే ఇష్టం. చదవడం అంటే ప్రాణం. ఏదో నచ్చిన పుస్తకం చదివేసి వదిలేసే మనస్తత్వం కాదు ఆమెది. తను చదివిన మంచి విషయాన్ని పదిమందితో పంచుకోవాలని భావించింది. అంతేకాదు ఆ పుస్తకంపై తన అభిప్రాయాన్ని నేరుగా దాన్ని రాసిన రచయితకు చెప్పకొంటే భలేగా ఉంటుంది కదా! అనుకుంది. ఆ తపనలో నుంచి పుట్టిందే 'ఆథర్ మీటర్' కాన్సెప్ట్. ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టినామె దశాబ్దాల అనుభవం ఉన్న వ్యక్తి కాదు! ఇరవై ఏండ్ల వయసున్న హైదరాబాదీ యువతి. స్మార్ట్ దునియాలో, రీల్స్ చుట్టూ కొట్టుమిట్టాడుతున్న ఈ తరానికి చెందిన బిస్వరూప బారిక్ తన చుట్టూ ఉన్నవాళ్లకు పుస్తక పఠనాన్ని చేరువ చేస్తున్నది. ఆఫ్‌లైన్ క్లబ్ స్థాపించి రచయితలకు, పాఠకులకు వారధిగా నిలుస్తున్న బిస్వరూపను జిందగీ పలకరించింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

ఇక్కడ పుస్తకాలతో మాట్లాడొచ్చు!

నాకు పుస్తకంతో స్నేహం ఏర్పడటానికి ప్రధాన కారణం మా అమ్మ. తను ఉపాధ్యాయురాలు. దాంతో క్రమశిక్షణ మా ఇంటి చిరునామాగా మారిపోయింది. ఖాళీ సమయం దొరికితే పుస్తకం చేతికి ఇచ్చేది. అలా నాకు పఠనాసక్తి కలిగింది. మేం ఉండేది హైదరాబాద్‌లోనే కాబట్టి కావాల్సిన పుస్తకాలన్నీ ఇట్టే దొరికిపోయేవి. పని గట్టుకొని మరీ బుక్ స్టాల్స్ చుట్టూ తిరిగేదాన్ని. మొదట్లో ఒక్కదాన్నే బుక్స్ చదివేదాన్ని. కొన్ని రోజులకు నేను చదివిన పుస్తకంలోని విషయాలు ఎవరితో



నైనా పంచుకుంటే బాగుంటుంది కదా! అన్న ఆలోచన మొదలైంది. డిగ్రీ సెకండ్ ఇయర్‌లో ఉన్నప్పుడు కమ్యూనిటీ రీడింగ్ సెంటర్ల గురించి తెలుసుకున్నాను. ప్రతీ ఆదివారం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్‌లో పుస్తకాలు చదువుతుంటారని విన్నాను. నేను కూడా వాళ్లలో ఒకదానిగా చేరి క్రమం తప్పకుండా పుస్తకాలను చదవడం... అందులోని విషయాలు పంచుకోవడం చేసేదాన్ని. కానీ, సికింద్రాబాద్‌లో ఉండే నేను ప్రతి ఆదివారం కేబీఆర్ పార్క్ వరకు వెళ్లడం కాస్త ఇబ్బందిగా అనిపించింది. అందుకే మా ఏరియాలోనే రీడింగ్ కమ్యూనిటీ ఏర్పాటు చేయాలనుకున్నాను. కానీ అప్పుడున్న పరిస్థితుల్లో అది సాధ్యపడలేదు.

ఏడాదిలో క్లబ్ ఏర్పాటు..

పరిస్థితులు అనుకూలించకపోయినా రీడింగ్ కమ్యూనిటీ ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని మాత్రం విడిచిపెట్టలేదు. చాలామంది ఓ పది నిమిషాలు పుస్తకం పట్టుకోగానే అలసిపోతుంటారు. బుక్ పక్కన పెట్టేసి ఫోన్ పట్టుకుంటారు! అదేమిటో కానీ, ఫోన్ చేతిలోకి రాగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేస్తుంది. గంటల తరబడి దానికి అతుక్కుపోతారు. అలాంటి వ్యక్తులు చాలామంది ఎదురయ్యారు నాకు. ఏదేమైనా రీడింగ్ కమ్యూనిటీ ఏర్పాటు చేసి పుస్తకాలు చదివే అలవాటును బతికించాలనుకున్నా! ఆ సమయంలోనే పఠనాసక్తి ఉన్న నా స్నేహితుడు ఖాద్రితో కలిసి ఆఫ్‌లైన్ క్లబ్ ఏర్పాటు చేశాను. నా దృష్టిలో బుక్ రీడింగ్ మంచి ఫిట్‌నెస్ మంత్రం. మంచి పుస్తకం చదివితే మనసుకు కావాల్సినంత వ్యాయామం అవుతుంది. ఫోన్లలో మునిగిపోతున్న నగరవాసులకు పుస్తక పఠనంతో ఆరోగ్యాన్ని అందివ్వాలన్నదే మా క్లబ్ ధ్యేయంగా పెట్టుకున్నాం. అలా 2024లో 'ఆఫ్‌లైన్ క్లబ్' ప్రారంభించాను. ఇందులో ప్రతివారం 'ఆథర్ మీటర్' పేరుతో పుస్తక పఠనం, పుస్తక రచయితతో పాఠకుల ముఖాముఖి నిర్వహిస్తున్నాం.



రచయితతో ముఖాముఖి

'ఆథర్ మీటర్' ప్రారంభించి ఏడాదైంది. అందరినీ ఒక్కతాటిపైకి తేవడానికి కాస్త సమయం పట్టింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ లాంటి ప్రాంతాల్లో ఉండే పుస్తక ప్రియులందరు ప్రతి ఆదివారం ఈ కార్యక్రమానికి హాజరవుతుంటారు. వారిలో ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు, వ్యాపారులు ఇలా భిన్న వర్గాలకు చెందినవారు ఉన్నారు. ప్రతి ఆదివారం అనుకూలంగా ఉన్న ఒక కెఫేలో ఆథర్ మీటర్‌ను నిర్వహిస్తాం. మా వాట్సాప్ గ్రూప్ ద్వారా కార్యక్రమం ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తున్నామో తెలియపరుస్తాం. కొందరు రచయితలు మా క్లబ్ గురించి తెలుసుకొని వచ్చారు. మరికొంతమందిని మేమే సెలెక్ట్ చేసుకున్నాం. వాళ్లంతా వచ్చి తమ పుస్తకాలను మాకిచ్చి చదివిస్తారు. ఆ తర్వాత పుస్తకంలో రచయిత భావాలను, వారి వ్యక్తిగత విషయాలను మేమంతా అడిగి తెలుసుకుంటాం. ఆ విషయాలన్నిటినీ వాళ్లు సవివరంగా తెలియజేస్తారు. మొదట్లో పాఠకుల సంఖ్య పరిమితంగా ఉండేది. నెమ్మదిగా ఆ సంఖ్య పెరిగింది. ప్రస్తుతం వంద మంది వరకు వస్తున్నారు. గత నెల టాలీవుడ్ నటుడు ప్రియదర్శి వాళ్ల భార్య రాసిన 'ఫైండింగ్ హోమ్ అగైన్' అనే పుస్తకాన్ని మా క్లబ్‌లోనే పరిచయం చేశారు.

> **నిజానికి** చాలామందికి పుస్తకాలు చదవాలనే కోరిక సహజంగానే ఉంటుంది. కానీ, ఎలాంటి పుస్తకాలు చదవాలనే విషయంలో గందరగోళానికి గురవుతుంటారు. మరోవైపు యువ రచయితలు ప్రజెంట్ జనరేషన్‌కు తగ్గట్టు రచనలు చేస్తున్నా... వాటిని ప్రమోట్ చేయడంలో వెనుకపడుతున్నారు. మా ఆథర్ మీటర్ వేదిక రీడర్‌కు, రైటర్‌కు మధ్య వారధిలా పనిచేస్తున్నది. పుస్తకం చదువుతున్న సందర్భంలో ఆ రచయితను కలుసుకొని పాఠకులు తమ అభిప్రాయాలు చెప్పాలనుకుంటారు. సాంకేతికత ఎంత పెరిగినా కూడా నేరుగా మనిషిని కలిసి తన ఫీలింగ్‌ను చెప్పడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుంది కదా! అందుకే రచయితతో ఇంటరాక్షన్ ఏర్పాటు చేస్తున్నాం. మా ప్రయత్నానికి మంచి స్పందన వచ్చింది. మా క్లబ్ గురించి సామాజిక మాధ్యమాల్లో ఆరోగ్యకరమైన చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఉన్న కమ్యూనిటీ రీడింగ్ గ్రూప్ సభ్యులు కూడా మా బృందంలో చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవాళ్లు మా ఇన్‌స్టా పేజీ (Ofline Club Hyderabad) ద్వారా సంప్రదించవచ్చు.

ఇదొక వారధిలా..

భవిష్యత్తులో..

'ఆథర్ మీటర్'లో పాల్గొనే పాఠకుల అభిప్రాయం మేరకే పుస్తకాల ఎంపిక ఉంటుంది. భాష కూడా వారి ఎంపికే. ఎక్కువగా ఐటీ ఉద్యోగులు ఉంటారు కాబట్టి ఇప్పటివరకు ఇంగ్లిష్ సాహిత్యాన్ని పరిచయం చేశాం. దానితోపాటు తెలుగు బుక్స్‌ను ప్రమోట్ చేస్తున్నాం. వారంలో ఒక్కరోజైనా ఫోన్‌లు పక్కన పెట్టేసి... పుస్తకం పట్టాలన్నదే నా అభిలాష. రచయితలను పాఠకుల ముందుకు తీసుకురావడంలో సఫలీకృతం అయ్యాననే చెప్పుకోవచ్చు. భవిష్యత్తులో మా రీడింగ్ క్లబ్ కార్యక్రమాలు దేశంలోని ప్రముఖ పట్టణాలకు విస్తరించే యోచనలో ఉన్నాను. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా. ఇప్పటికైతే నేనింకా పాఠకురాలినే! రచయితల వేదికగా నిలిచిన 'ఆథర్ మీటర్' ద్వారానే నేనూ రచయితగా పరిచయం అవ్వాలనుకుంటున్నా! నా ఆకాంక్ష త్వరలోనే నెరవేరుతుందని నమ్ముతున్నా!

... రాజు పిల్లనగోయిన

మన ప్రవర్తనను బట్టే ఎదుటివాళ్లు మనమేంటో తెలుసుకుంటారు. కానీ, మన నిద్ర కూడా మనల్ని అంచనా వేస్తుందట. నిత్యం ఒక్కొక్కరు ఒక్కో భంగిమలో నిద్రపోతుంటారు. ఆ భంగిమలే మనం ఏ తరహా మనుషులమో ముద్ర వేస్తాయని ఓ పరిశోధన చెప్పుకొచ్చింది. నిద్రలో మీరు ఎక్కువ కంఫర్ట్ ఫీలయ్యే భంగిమేంటో మీకైతే తెలుసు కదా! దాన్ని బట్టి మీరెలాంటి వారో తెలుసుకోండి..

నిద్ర భంగిమలో మన ముద్ర

ముడుచుకొని పడుకుంటే: కొంతమంది అచ్చం చిన్నపిల్లల్లాగే ముడుచుకొని నిద్రపోతారు. అలాంటివాళ్లు సైలెంట్‌గా, అమాయకంగా కనిపిస్తారు. బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడతారు. అందర్నీ ఇట్టే నమ్మేసి.. చివరికి మోసపోతుంటారట.

బోర్లాపడుకుంటే: మంచం ఎక్కగానే కొందరు బోర్లా పడుకుంటారు. వీరి స్వభావం కాస్త చిత్రంగానే ఉంటుందట. చాలా ఉల్లాసంగా ఉంటారట. కలుపుగోలుగా మాట్లాడే స్వభావం ఉంటుందట. కొన్నిసార్లు చాలా డల్‌గా ప్రవర్తిస్తుంటారు కూడా! రిస్క్ తీసుకోవడానికి వెనుకంజ వేయరు.

దిండును హత్తుకుంటే..: ఇంకొందరు రాత్రంతా దిండును గట్టిగా హత్తుకొని నిద్రపోతుంటారు. వీళ్లు బంధాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారట. తమకు నచ్చిన వ్యక్తికోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధపడతారు. కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయడానికి వెనుకాడరు.




వెల్లకిలా: కొందరు నిద్రలోనూ క్రమశిక్షణ పాటిస్తుంటారు. రాత్రంతా కదలకుండా, మెదలకుండా వెల్లకిలా పడుకుంటారు. వీళ్లు మెలకువలోనూ చాలా క్రమశిక్షణతో మెలుగుతుంటారట. ప్రతి విషయాన్నీ సీరియస్‌గా తీసుకునే స్వభావం వీరిలో ఎక్కువగా ఉంటుంది.

కులాసాగా: పలువురు నలుగురు నవ్వుకుంటే నాకేంటి అన్నట్లుగా కాళ్లూ, చేతులు బారజాపి స్టార్‌ఫిష్‌లా పడుకుంటూ ఉంటారు. అలాంటి వ్యక్తులు ప్రశాంతంగా, ఓపికగా ఉంటారట. స్నేహ బంధాలకు ఎక్కువ విలువ ఇస్తారట. నలుగురికీ సాయం చేసే స్వభావం కలిగి ఉంటారు.

వ్యాయామం.. బహుదూరం!

అమ్మాయిలకు వ్యాయామం.. అనేది అందని ద్రాక్షగానే మిగులుతున్నది. కుటుంబ కట్టుబాట్లు, అభద్రత.. వారిలో వ్యాయామంపై ఆసక్తి తగ్గిస్తున్నది. 'టైమ్ యూజ్ ఇన్ ఇండియా–2024' నివేదిక.. ఈ విషయాన్ని వెల్లడించింది. ఫిట్‌నెస్‌లో మహిళలు–పురుషుల మధ్య ఉన్న అంతరాన్ని బయటపెట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 4,50,000 మందికి పైగా ప్రజలను అధ్యయనం చేశారు. 15–29 సంవత్సరాల మహిళల్లో 3.9 శాతం మంది మాత్రమే రోజువారీ క్రీడలు, వ్యాయామంలో పాల్గొంటున్నట్లు గుర్తించారు. అదే పురుషులలో 14.8 శాతం మంది నిత్యం ఆటలతోపాటు వ్యాయామం ద్వారా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నారు. ఇక వ్యాయామం చేసే సమయంలోనూ లింగ అంతరం



స్పష్టంగా కనిపిస్తున్నది. యువతులు రోజుకు సగటున 46 నిమిషాల చొప్పున వర్కవుట్లకు కేటాయిస్తున్నారు. అదే పురుషులు 64 నిమిషాలు జిమ్‌లు, గ్రౌండ్‌లలో గడుపుతున్నారు. ఈ 18 నిమిషాల అంతరం మరీ ఎక్కువగా కనిపించపోవచ్చు. కానీ, వారాలు, నెలల్లో.. ఆడవాళ్ల ఫిట్‌నెస్‌లో గణనీయమైన వ్యత్యాసానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణాలను అధ్యయనకారులు వివరించారు. క్రీడలు, ఫిట్‌నెస్ కంటే మహిళలు ఎక్కువగా ఇంటి పనులు, పిల్లల సంరక్షణకే పరిమితమైపోతున్నారు. ఇంటి పెద్దలతోపాటు సాంస్కృతిక నిబంధనలు కూడా వారికి వ్యతిరేకంగానే ఉన్నాయి. 13 ఏళ్లు దాటిన తర్వాత బాలికలు బహిరంగ వ్యాయామాలు, ఆటలకు దూరం అవుతున్నారు. అదే సమయంలో చాలా కుటుంబాలు అబ్బాయిలను ఆటల్లో ప్రోత్సహిస్తున్నాయి. అమ్మాయిలు మాత్రం ఇంట్లోనే ఉండాలని, చదువులపై దృష్టిపెట్టాలని ఒత్తిడి చేస్తున్నాయి. మెట్రో నగరాల్లో ఈ మనస్తత్వం ఇప్పుడిప్పుడే మారుతుండగా.. చిన్నస్థాయి పట్టణాలు, పల్లెల్లో ఈ వివక్ష ఇంకా తీవ్రంగానే ఉన్నది. ఇక బహిరంగ ప్రదేశాల్లో భద్రత లేకపోవడం కూడా మహిళలు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టలేకపోవడానికి మరో కారణం. పార్కులు, ఆట స్థలాల్లో ఆధిపత్యమంతా పురుషులదే! దాంతో, చాలామంది మహిళలు బహిరంగంగా వ్యాయామం చేయడం సురక్షితం కాదని భావిస్తున్నారట. ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రిపూట.. వారు వ్యాయామానికి దూరం అవుతున్నారట. అయితే, ఫిట్‌నెస్ కాపాడుకోవడం అనేది.. దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, ఒత్తిడి ప్రమాదం తగ్గుతుందని అంటున్నారు. యుక్తవయసులో ఫిట్‌నెస్ బలహీనంగా ఉంటే.. అది వారి జీవితాంతం వెంటాడుతూనే ఉంటుందని హెచ్చరిస్తున్నారు. రోజువారీ వ్యాయామం.. మహిళల జీవనశైలి వ్యాధులను నివారించడంతోపాటు వారి జీవన నాణ్యతను మెరుగుపరుస్తుందని చెప్పుకొస్తున్నారు.

స్వీట్‌కార్న్ పకోడి

కావలసిన పదార్థాలు

స్వీట్ కార్న్: ఒక కప్పు, **శనగపిండి:** పావు కప్పు, **పచ్చిమిర్చి:** రెండు, **ఉల్లిగడ్డ:** ఒకటి, **కారం:** ఒక టీస్పూన్, **ఉప్పు:** తగినంత, **కొత్తిమీర తరుగు:** కొద్దిగా, **నూనె:** వేయించడానికి సరిపడా.

తయారీ విధానం

స్వీట్‌కార్న్ ఉడికించి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో స్వీట్‌కార్న్, శనగపిండి, చిన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, కారం, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి కొద్దిగా నీళ్లుపోసి ముద్దలా కలపాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా వేయాలి. సన్నని మంటపై దోరగా వేయించుకుంటే కరకరలాడే స్వీట్‌కార్న్ పకోడి సిద్ధం.



పనీర్ ఓకే! టోఫు ఓకే!

శాఖాహారులు ఇష్టంగా తినే వాటిలో 'పనీర్' ముందుంటుంది. 'టోఫు' కూడా అచ్చం పనీర్‌లాగే ఉంటుంది. కానీ, చాలామందికి ఈ రెండిటి మధ్య తేడాలు సరిగ్గా తెలియదు. మరి.. మీ ఆహార అవసరాలకు ఏదైతే సరిపోతుంది? బరువు తగ్గాలంటే, మధుమేహం అదుపులో ఉండాలంటే.. దేన్ని తీసుకోవాలి? ఆరోగ్యానికి వీటిలో ఏది మంచిది? తెలుసుకోవాలంటే.. ఇది చదివేయండి.

పనీర్.. అచ్చంగా బర్రె, ఆవు పాల నుంచి తయారవుతుంది. ఇందులో క్యాల్షియం, కొవ్వు ఎక్కువగా ఉంటుంది. అదే.. టోఫును సోయా పాలతో తయారు చేస్తారు. దీనిలో తక్కువ కొవ్వు, ఎక్కువ ఫైబర్ లభిస్తుంది. ఈ రెండూ దేనికవే ప్రత్యేకమైనవి. దేని ఆరోగ్య ప్రయోజనాలు, పోషక విలువలు దానికి ఉంటాయి. కాబట్టి, మీ ఆరోగ్య అవసరాలను బట్టి ఎంపిక చేసుకోవడం మంచిది.

ఐరన్: పనీర్‌తో పోలిస్తే టోఫులో ఎక్కువ ఐరన్ ఉంటుంది. 100 గ్రాముల టోఫులో 5.4 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది. పనీర్‌లో 0.1 మిల్లీగ్రాములు మాత్రమే ఉంటుంది. కాబట్టి, రక్తహీనతతో బాధపడేవారికి టోఫు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రొటీన్లు: 100 గ్రాముల పనీర్‌లో 18.3 గ్రాముల ప్రొటీన్ ఉన్నట్లు తేలింది. అదే టోఫులో.. 6.9 గ్రాములు మాత్రమే ఉంటుంది. కాబట్టి, జిమ్‌కు వెళ్లేవారు, బరువు పెరగాలని అనుకునే వాళ్లు పనీర్‌ను ఎంపిక చేసుకోవాలి. పనీర్.. కండరాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

కొవ్వు: పనీర్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. 100 గ్రాముల పనీర్‌లో 20.8 గ్రాముల కొవ్వు లభిస్తుంది. మరోవైపు.. టోఫులో 2.7 గ్రాముల కొవ్వు మాత్రమే ఉంటుంది. కాబట్టి, బరువు తగ్గాలంటే.. టోఫును ఆహారంలో భాగం చేసుకోవాలి. అధిక బరువుతో బాధపడేవాళ్లు.. పనీర్‌ను పక్కన పెట్టేయాలి.



క్యాల్షియం: పనీర్‌లోనే క్యాల్షియం ఎక్కువగా లభిస్తుంది. 100 గ్రాముల పనీర్ తీసుకుంటే.. శరీరానికి 208 మిల్లీ గ్రాముల క్యాల్షియం అందుతుంది. అదే టోఫులో 130 మిల్లీ గ్రాములు మాత్రమే ఉంటుంది! కాబట్టి, దంతాలు, ఎముకల ఆరోగ్యం కోసం పనీర్‌ను తీసుకోవడం బెటర్.


కార్బోహైడ్రేట్స్: పాలతో తయారైనప్పటికీ.. పనీర్‌లో కార్బోహైడ్రేట్ స్థాయులు తక్కువగా ఉంటాయి. 100 గ్రాముల పనీర్‌లో దాదాపు 1.2 గ్రాముల కార్బోహైడ్రేట్స్ లభిస్తాయి. అదే.. టోఫులో 2.4 గ్రాములు, అంటే పనీర్ కంటే రెట్టింపు కార్బోహైడ్రేట్ కంటెంట్ ఉంటుంది. కాబట్టి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పనీర్ మంచి ఎంపిక.

కేలరీలు: 100 గ్రాముల పనీర్‌తో 265 కేలరీలు అందుతాయి. టోఫులో 62 కేలరీలు మాత్రమే లభిస్తాయి. బరువు తగ్గాలని అనుకుంటే.. టోఫును తీసుకోవాలి.

ఫైబర్: జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఫైబర్ అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇది టోఫులో అధికంగా లభిస్తుంది. అదే సమయంలో కొందరిలో పాల ఉత్పత్తులు పడవు. అలాంటివారికి పనీర్ త్వరగా జీర్ణమవ్వదు. దీన్ని తీసుకుంటే.. కడుపు ఉబ్బరం, అజీర్ణం, గ్యాస్ లాంటి సమస్యలూ వస్తాయి. కాబట్టి, ఇలాంటి వాళ్లు టోఫును ఎంచుకోవడం మంచిది.

ఫైనల్లో నీరజ్

- ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీ



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్లేయర్ నీరజ్ చోప్రా అదరగొట్టాడు. బుధవారం జరిగిన పురుషుల జావెలిన్‌త్రో ఈవెంట్‌లో బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ తన తొలి ప్రయత్నంలోనే అర్హత మార్క్(84.50మీ)ను అధిగమించాడు. గ్రూపు-ఏ నుంచి పోటీపడ్డ నీరజ్..బరిసెను 84.85మీటర్ల దూరం విసిరి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న నీరజ్ టోక్యోలో తన టైటిల్‌ను నిలబెట్టుకోవడంపై దృష్టి పెట్టాడు. గ్రూపు-ఏలో జర్మన్ జావెలిన్‌త్రోయర్ జులియన్ వెబర్‌తో సహా కేశర్న్ వాల్కట్, జాకబ్ వాల్దిచ్‌తో కలిసి పోటీకి దిగిన చోప్రా స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచాడు. గురువారం జరిగే ఫైనల్లో పసిడి పతకం సాధించడం ద్వారా రెండు సార్లు టైటిల్ సాధించిన దిగ్గజ అథ్లెట్లు జాన్ జలెంజీ(93,95), పీటర్స్(19, 22) సరసన నిలిచేందుకు చోప్రా పట్టుదలతో ఉన్నాడు. పారిస్(2024) ఒలింపిక్స్ తర్వాత పాకిస్థాన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌తో కలిసి నీరజ్ పోటీపడబోతున్నాడు.

భారత్ రికార్డు విజయం

- రెండో వన్డేలో ఆసీస్ ఓటమి
- సిరీస్ ఆశలు సజీవం

ముల్లాన్‌పూర్: స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తొలి పోరులో ఓడిన భారత మహిళల జట్టు రెండో వన్డేలో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటింది. ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టును 102 పరుగుల తేడాతో ఓడించి రికార్డు విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో సిరీస్ (1-1) ఆశలను సజీవంగా ఉంచుకుంది. వన్డేలలో ఆస్ట్రేలియాకు పరుగుల పరంగా ఇదే అతిపెద్ద (ఇంతకుముందు ఇంగ్లండ్‌పై 92 రన్స్ తేడాతో) పరాభవం. మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. 49.5 ఓవర్లలో 292 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (91 బంతుల్లో 117, 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఈ ఫార్మాట్‌లో 12వ శతకాన్ని పూర్తి చేసింది. 77 బంతుల్లోనే ఆమె శతకం పూర్తయింది. దీప్తి శర్మ (40) రాణించింది. అనంతరం ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా జట్టు.. 40.5 ఓవర్లలో 190 రన్స్‌కే చేతులెత్తేసింది. యువ పేసర్ క్రాంతి గౌడ్ (3/28) నిప్పులు చెరిగే బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లను కంగారెత్తించగా బ్యాట్‌తో మెరిసిన దీప్తి బంతి (2/24)తోనూ మాయ చేసింది. రేణుకా, స్నేహ్ రాణా, అరుంధతి, రాధా యాదవ్‌కు తలో వికెట్ దక్కింది. కాగా వన్డేల్లో ఆస్ట్రేలియాపై స్వదేశంలో 18 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు ఇదే మొదటి విజయం. చివరిసారి 2007లో చెపాక్ (చెన్నై) వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఓడించింది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా 13 వన్డేల జైత్రయాత్రకు బ్రేక్ పడినట్టైంది. ఇరుజట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే ఈనెల 20న ఢిల్లీలో జరుగుతుంది.


మంధాన (117)

ఆసీస్ 'ఏ' భారీ స్కోరు

లక్నో: భారత 'ఏ' జట్టుతో లక్నో వేదికగా జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో ఆస్ట్రేలియా 'ఏ' ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 532/6 డిక్లేర్డ్ చేసింది. రెండో రోజు వికెట్ కీపర్ ఫిలిప్పీ (87 బంతుల్లో 123 నాటౌట్), స్కాట్ (81) దూకుడుగా ఆడి ఆసీస్‌ను పటిష్ట స్థితిలో నిలిపారు. అయితే భారత్ కూడా దీటుగా స్పందిస్తున్నది. జగదీశన్ (50*) అజేయ అర్ధశతకంతో క్రీజులో ఉండగా అభిమన్యు (44) రాణించాడు. రెండో రోజు వర్షం వల్ల ఆట ముగిసే సమయానికి భారత్.. 116/1తో నిలిచింది. జగదీశన్‌తో పాటు సాయి సుదర్శన్ (20*) క్రీజులో ఉన్నాడు.

సాత్విక్ జోడీ జోరు

పురుషుల సింగిల్స్‌లో ముగిసిన భారత పోరు



షెన్‌జెన్ (చైనా): ఇటీవలే ముగిసిన హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రన్నరప్‌తో సత్తాచాటిన భారత పురుషుల డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్‌లోనూ జోరు కొనసాగిస్తున్నది. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత జోడీ.. 24-22, 21-13తో జునైది అరిఫ్, రాయ్ కింగ్ యాప్ (మలేషియా)ను మట్టికరిపించింది. 42 నిమిషాల్లోనే ముగిసిన పోరులో వరుస గేమ్స్‌ను గెలుచుకున్న భారత ద్వయానికి ప్రత్యర్థి నుంచి తొలి గేమ్‌లో తీవ్ర పోటీ ఎదురైంది. రెండు జంటలు నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. 21 నిమిషాల పాటు సాగిన తొలి గేమ్‌ను నెగ్గాక రెండో గేమ్‌లో భారత జోడీ దూకుడు పెంచింది. 11-6తో ఆధిక్యంలో ఉన్న సాత్విక్ జంట.. తర్వాత అలవోకగా మ్యాచ్‌ను ముగించి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. కాగా పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్.. 11-21, 10-21తో జూనియర్ పోపొవ్ (ఫ్రాన్స్) చేతిలో చిత్తయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ధృవ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ.. 19-21, 13-21తో ఫెంగ్ యాన్ ఝె-హువాంగ్ డోంగ్ పింగ్ (చైనా) చేతిలో ఓడింది.



వరుణ్ @1

- టీ20 ర్యాంకుల్లో భారత ఆటగాళ్ల ఆధిపత్యం

దుబాయ్: భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకుకు చేరుకున్నాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అతడు అగ్రస్థానానికి చేరుకున్నాడు. తద్వారా భారత్ నుంచి జస్‌ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. ఏడాదికాలంగా ఈ ఫార్మాట్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న ఈ తమిళనాడు స్పిన్నర్.. తాజా ర్యాంకుల్లో మూడు స్థానాలు ఎగబాకి 733 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక ఈ ఫార్మాట్ ర్యాంకింగ్స్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ (884 రేటింగ్ పాయింట్లు) మొదటి స్థానాన్ని నిలబెట్టుకోగా ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా (237) నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లోనూ టీమ్‌ఇండియా.. 271 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆసీస్, ఇంగ్లండ్, కివీస్ తదుపరి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

పాక్ కష్టంగా!

యూఏఈపై విజయం


జమాన్ (50)

దుబాయ్: ఆసియాకప్ టోర్నీలో పాకిస్థాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మధ్య ఆసక్తికర పోరు జరిగింది. బుధవారం నాటకీయ పరిణామాల మధ్య నిర్ణీత సమయం కంటే గంట ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో పాక్ 41 పరుగుల తేడాతో యూఏఈపై చెమటోడ్చి నెగ్గింది. దీంతో నాలుగు పాయింట్లతో పాక్ సూపర్-4కు అర్హత సాధించగా, యూఏఈ నిష్క్రమించింది. తొలుత పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 146/9 స్కోరు చేసింది. 9 పరుగులకే ఓపెనర్లు ఫర్హాన్(5), ఆయూబ్(0) వికెట్లు కోల్పోయిన జట్టును ఫకర్ జమాన్(36 బంతుల్లో 50, 2ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు ఆఖర్లో షాహిన్ షా అఫ్రిదీ(14 బంతుల్లో 29 నాటౌట్, 3ఫోర్లు, 2సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో గౌరవప్రదమైన స్కోరు అందుకుంది. ముఖ్యంగా జమాన్..యూఏఈ బౌలింగ్‌ను సమర్థంగా నిలువరిస్తూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో మూడు భారీ సిక్స్‌లతో చెలరేగిన జమాన్..మూడో వికెట్‌కు కెప్టెన్ సల్మాన్ ఆగా(20)తో 63 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆఖర్లో అఫ్రిదీ బ్యాటు ఝులిపించడంతో పాక్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. సిద్ధిఖి(4/18), సిమ్రన్‌జీత్ సింగ్(3/26) రాణించారు. లక్ష్యఛేదనలో యూఏఈ 17.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ చోప్రా(35), ధృవ్ ప్రశార్(20) ఆకట్టుకున్నారు.

పాకిస్థాన్ హైడ్రామా

మ్యాచ్ ఆడబోమంటూ ప్రగల్భాలు
ఐసీసీ చర్యతో దిగివచ్చిన పీసీబీ

ఆసియా కప్‌లో పాకిస్థాన్ హైడ్రామా రక్తికట్టించింది. భారత ప్లేయర్లు తమకు షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడానికి మ్యాచ్ రిఫరీ అండీ పైక్రాఫ్ట్ కారణమంటూ పీసీబీ చిందులు తొక్కింది. బుధవారం యూఏఈతో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ టీమ్, పీసీబీ పగటి వేషాలు వేశాయి. షేక్‌హ్యాండ్ వివాదానికి రిఫరీ పైక్రాఫ్ట్ ప్రధాన కారణమని ఆరోపిస్తూ ఐసీసీకి పీసీబీ మరో లేఖాస్త్రం సంధించింది. ఈ విషయంలో పైక్రాఫ్ట్ క్షమాపణ చెప్పాల్సిందేనని పేర్కొంటూ పీసీబీ లేఖ రాసింది. మ్యాచ్ మొదలుకావడానికి రెండు గంటల ముందు స్టేడియానికి చేరుకోవాల్సి ఉన్నా..పాక్ టీమ్ హోటల్ రూమ్‌లకే పరిమితమైంది. పీసీబీ ఆదేశాల మేరకు ప్లేయర్లు హోటల్‌లోనే ఉండిపోయారు. దీంతో వెంటనే అప్రమత్తమైన రిఫరీ పైక్రాఫ్ట్ ఈ విషయాన్ని పీసీబీ చైర్మన్, ఏషియన్ క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) హెడ్ మోహిసిన్ నక్వీతో పాటు ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా దృష్టికి తీసుకెళ్లాడు. ఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాన్ఫరెన్స్ కాల్ ద్వారా వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇందులో రిఫరీ పైక్రాఫ్ట్‌ది ఎలాంటి తప్పిదం లేదని, నిబంధనల ప్రకారమే అతను వ్యవహరించాడని ఐసీసీ కరాఖండిగా చెప్పడంతో పాటు వివాదాన్ని నక్వీతో పాటు టోర్నీ డైరెక్టర్ అండీ రస్సెల్ ముందు ఉంచింది. ఒకవేళ టోర్నీ నుంచి తప్పుకుంటే 16 యూఎస్ మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ కోల్పోవాల్సి వస్తుందని పీసీబీకి స్పష్టం చేసింది. దీంతో మల్లాగుల్లాలు పడ్డ పీసీబీ..మాజీ చైర్మన్లు రమీజ్‌రాజా, నజామ్ సేథీతో మాట్లాడి ఆడేందుకు మొగ్గుచూపింది. ఈ కారణంగా షెడ్యూల్ ప్రకారం 8 గంటలకు మొదలుకావాల్సిన మ్యాచ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఇదిలా ఉంటే పైక్రాఫ్ట్ క్షమాపణ చెప్పిన తర్వాతే మేము మ్యాచ్ ఆడేందుకు ఒప్పుకున్నామని పీసీబీ ట్వీట్ చేసింది.

కాంస్య పోరుకు అంతిమ్

- ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్



జాగ్రెబ్(క్రొయేషియా): ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ల నిరాశజనక ప్రదర్శన కొనసాగుతున్నది. సెమీఫైనల్‌కు చేరి ఆకట్టుకున్న యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ ముందంజ వేయలేకపోయింది. బుధవారం జరిగిన మహిళల 53కిలోల సెమీస్ బౌట్‌లో అంతిమ్ 3-5 తేడాతో లుసియా యెపెజ్ గుజ్‌మన్(ఈక్వెడార్) చేతిలో ఓడింది. సెమీస్ వరకు అద్భుత ప్రదర్శన కనబరిచిన అంతిమ్..అదే దూకుడు కనబర్చలేకపోయింది. పారిస్ ఒలింపిక్స్ రజత విజేత అయిన లుసియా తన ఎత్తును అనుకూలంగా మలుచుకుంటూ అంతిమ్‌పై ఆధిపత్యం చెలాయించింది. ఏ దశలోనూ పట్టు వదలని లుసియా తొలి అర్ధభాగంలోనే 4-1 ఆధిక్యం ప్రదర్శించింది. కీలకమైన ద్వితీయార్ధంలోనూ ఈ ఈక్వెడార్ యువ రెజ్లర్ పోరుపై పూర్తి పట్టు సాధించింది. అంతిమ్ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా పైచేయి సాధించలేకపోయింది. దీంతో మ్యాచ్ చేజార్చుకున్న అంతిమ్..కాంస్య పతక పోరుకు సిద్ధమైంది. మరోవైపు మనీశా భన్వాల(62కి) రెపేచేజ్‌లో బరిలోకి దిగనుండగా, రాధిక(68కి), జ్యోతి బేరివాల్(72కి) ప్రత్యర్థుల చేతిలో ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో వర్గపోరు!

అసోసియేషన్‌లో అక్రమాలపై విచారణ చేయాలి • అధ్యక్షుడు సాయిలు తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌లో వర్గపోరు పతాకస్థాయికి చేరుకుంది. కొంత మంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమాలకు పాల్పడుతున్నారని, ఒక మహిళ ఫోర్జరీ సంతకాలతో సంఘాన్ని ఆమె చేతుల్లో తీసుకుందని సంఘం అధ్యక్షుడు సాయిలు ఆరోపణలు చేశారు. కోదాడకు చెందిన శృతి అనే మహిళ..విశాఖపట్నంలో నివసిస్తూ తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘంలో అక్రమాలకు పాల్పడుతున్నారని సాయిలు విమర్శించారు. నకిలీ అసోసియేషన్ ఏర్పాటు చేసి అందులో కొంతమంది సన్నిహితులను చేర్చుకుని టోర్నీల పేరిట నిధుల దుర్వినియోగానికి పాల్పడుతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, హన్మంత్‌రాజ్‌తో పాటు సాట్స్ డీడీ సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి కమిటీ ఏర్పాటు చేశారని సాయిలు ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటి క్రీడా మంత్రి శ్రీహరికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

సీఎస్ఎస్‌హెచ్‌తో శ్రీనిధి ఒప్పందం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) తమ ప్లేయర్ల ఫిట్‌నెస్ విషయంలో మరో ముందడుగు వేసింది. క్లబ్ గెలుపు, ఓటముల్లో కీలకంగా వ్యవహరించే ప్లేయర్ల ఫిట్‌నెస్, ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ జాగ్రత్త వహించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా మంగళవారం సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్(సీఎస్ఎస్‌హెచ్)తో శ్రీనిధి ఎఫ్‌సీ ఎంవోయూ కుదుర్చుకుంది. ఇక నుంచి తమ క్లబ్ అధికారిక స్పోర్ట్స్ సైన్స్ భాగస్వామిగా సీఎస్ఎస్‌హెచ్ కొనసాగనుంది. ఈ మేరకు సీఎస్ఎస్‌హెచ్ కోఫౌండర్, బ్యాడ్మింటన్ ఐకాన్ పుల్లెల గోపీచంద్‌తో కలిసి ఎస్‌డీఎఫ్‌సీ చీఫ్ ఫుట్‌బాల్ ఆఫీసర్ ఫాబియో పెరీరా ఒక అంగీకారం కుదుర్చుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కోర్టు అంటే లెక్కలేదా?

- పరిహారం చెల్లించాలన్నా పట్టదా?
- సిరిసిల్ల కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం.. వారంట్ జారీ
- అక్టోబర్ 8న స్వయంగా హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): భూసేకరణ పరిహారం చెల్లించాలన్న హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తామిచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోగా వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వకపోవడంపై మండిపడింది. కోర్టు అంటే లెక్క లేదా అని నిప్పులు చెరిగింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయని కలెక్టర్‌తోపాటు భూసేకరణ అధికారికి బెయిలబుల్ వారంట్ జారీచేసింది. అక్టోబర్ 8న జరిగే విచారణ సమయంలో కలెక్టర్‌ను తమ ముందు హాజరుపర్చేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులను ఐఏఎస్ స్థాయి అధికారి అమలు చేయలేదంటే ఏమనుకోవాలని వ్యాఖ్యానించింది.

ఇదీ జరిగింది...

తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన వేపుల ఎల్లయ్య పరిహారం నిమిత్తం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు నాలుగు వారాల్లో ఎల్లయ్యకు రూ.7.86 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు అమలు చేయలేదన్న విషయాన్ని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ 3న జరిగిన విచారణలో గుర్తించారు. గత జూన్‌లో వెలువరించిన ఉత్తర్వులను అమలు చేయడానికి మరో రెండు వారాల గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరగా న్యాయమూర్తి అనుమతిచ్చారు. పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో కలెక్టర్, భూసేకరణ అధికారి వ్యక్తిగతంగా హైకోర్టు హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టంచేశారు. బుధవారం మరోసారి ఆ పిటిషన్ విచారణకు వచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను కలెక్టర్ అమలు చేయకపోవడంతోపాటు వ్యక్తిగతంగా విచారణకు కూడా హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ జెండా సాక్షిగా విప్‌కు అవమానం

- విప్ వచ్చినా రాని కలెక్టర్
- ఆయన కోసం ఎదురుచూసి జెండా ఆవిష్కరించిన ఆది
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆది శ్రీనివాస్ ఆవేదన
- కలెక్టర్‌పై అధిష్ఠానానికి ఫిర్యాదు!

కరీంనగర్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజాపాలన దినోత్సవ జెండా ఆవిష్కరణ సాక్షిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అవమానం జరిగింది. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జెండా వందనం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం ముఖ్య అతిథికి కలెక్టర్ స్వాగతం పలకాలి. కానీ, ఆయన వచ్చినా కలెక్టర్ జాడ లేదు. దీంతో ఎస్పీ గితే మహేశ్, మరికొందరు అధికారులతో కలిసి ఆయన వేదికపైకి వెళ్లారు. అనంతరం కలెక్టర్ రాకకోసం కొంతసేపు ఎదురుచూశారు. అయినప్పటికీ ఆయన రాకపోవడంతో ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయగీతం ఆలపిస్తున్న సమయంలో కలెక్టర్ వేదికపైకి రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రొటోకాల్ ఉల్లంఘనపై విప్‌కు కలెక్టర్ సారీ చెప్పినట్టు తెలిసింది. అయితే, అప్పటికే అసహనంతో ఉన్న శ్రీనివాస్ 'ఈ కార్యక్రమం సాక్షిగా పరువు తీయాలనుకున్నావ్.. తీసినవ్' అంటూ కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.


కలెక్టర్ లేకుండానే జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బీసీ బిడ్డగా నాకు అవమానం

జెండా ఆవిష్కరణ సందర్భంగా జరిగిన ప్రొటోకాల్ ఉల్లంఘనను విప్ తనకు జరిగిన అవమానంగా భావించినట్టు తెలిసింది. తనను అవమానించేందుకే ప్రజా పాలన దినోత్సవాన్ని కావాలనే తూతూమంత్రంగా ముగించారని విలేకరులతో జరిపిన చిట్‌చాట్‌లో 'ఆఫ్ ది రికార్డ్'గా ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పంద్రాగస్టు వేడుకల్లోనూ కలెక్టర్ తనకు స్వాగతం పలకలేదని ఓ మిత్రుడు గుర్తుచేశాడని, ఈ రోజు మరోమారు అదే జరిగిందని ఆయన వాపోయినట్టు తెలిసింది. బీసీ బిడ్డగా ఇది తనకు అవమానమేనని ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. ప్రొటోకాల్ ఉల్లంఘన విప్ టార్గెట్‌గా జరిగిందన్న చర్చ నడుస్తున్నది. ఆదికి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు కొంతకాలంగా పడటం లేదని తెసింది. తాజా ఘటన ఇద్దరి మధ్య మరింత దూరం పెంచింది. కలెక్టర్ వ్యవహారశైలిపై విప్ ఇప్పటికే అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. తాజా ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలని పలువురు చర్చించుకోవడం కనిపించింది.

భాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్‌గా నరసింహారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ అనుగు నరసింహారెడ్డిని రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఫారెన్ సర్వీసెస్ కింద డిప్యూటేషన్ పద్ధతిలో రెండేండ్ల కాల పరిమితితో ఆయన్ను నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కొంతకాలంగా సెలవులో ఉన్న భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణను తన సొంతశాఖ అయిన సహకార శాఖకు బదిలీ చేసింది. హరికృష్ణ సెలవులో ఉండడంతో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మి ప్రస్తుతం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కొనసాగుతుండగా, నరసింహారెడ్డి నియామకంతో ఆమెను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది.

సుదీర్ఘకాలం డైరెక్టర్‌గా హరికృష్ణ

సహకారశాఖ అదనపు రిజిస్ట్రార్‌గా ఉన్న మామిడి హరికృష్ణ సుమారు 11ఏండ్లపాటు భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా కొనసాగడం విశేషం. కవిగా, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్‌గా, చిత్రకారుడిగా, తెలంగాణ చరిత్ర పరిశోధకుడిగా సాహిత్యరంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హరికృష్ణను 2014, అక్టోబర్ 28న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్‌గా నియమించింది.

కాంగ్రెస్‌లో 'జూబ్లీహిల్స్' కుంపటి

- పట్టువీడని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్
- సీఎం వర్గానికి ధీటుగా పావులు కదుపుతున్న నేత
- ఖర్గేను ప్రసన్నం చేసుకునేందుకు దానం పాట్లు
- ఓ మంత్రి కోసమే అజార్‌ను తప్పించారని ప్రచారం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 17 (నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్‌లో ఆరని కుంపట్లను రగిల్చాయి. బీఆర్‌ఎస్‌తో పోటీ దేవుడెరుగు.. పార్టీలోనే అంతర్యుద్ధం జరుగుతున్నదని శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు సీఎం వర్గం, మరోవైపు స్థానిక నేతలు, ఇంకోవైపు సీనియర్ నేతల మధ్య పోరుతో నియోజకవర్గం కలగాపులగంలా తయారైందని పేర్కొంటున్నారు. తమ అభ్యర్థికే టికెట్ దక్కాలని సీఎం వర్గం పావులు కదుపుతుంటే, సీనియర్ నేత అంజన్‌కుమార్‌యాదవ్ తానే పోటీ చేస్తున్నానని ప్రకటించుకుంటున్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఏకంగా ఢిల్లీ నుంచి నరుక్కొస్తున్నారన్న ప్రచారం ఉన్నది. మిగతా ఆశావహులు సైతం ప్రయత్నాలు చేస్తున్నారు.

అజార్‌ను అందుకే తప్పించారా?

సాధారణంగా ఉప ఎన్నికల సమయంలో అధికార పార్టీ అభివృద్ధి-సంక్షేమం అంటూ అందరినీ కలుపుకుని పోయి ప్రచారం చేస్తుంటుంది. కానీ జూబ్లీహిల్స్‌లో మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి వర్గం ఒంటెత్తు పోకడ పోతున్నదని, అడ్డుగా ఉన్న నేతలను వ్యూహాత్మకంగా ఒక్కొక్కరినీ తప్పిస్తున్నదని ప్రచారం జరుగుతున్నది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అజారుద్దీన్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనకు టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అభ్యర్థిని ప్రకటించే వరకు ఆయనను కలుపుకొనిపోయి ప్రచారం చేయాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అజార్‌కు సమాచారం ఇవ్వకుండానే సీఎం వర్గం ప్రచారం మొదలుపెట్టిందని చర్చ జరుగుతున్నది. అజార్‌తో మొదటి నుంచీ విబేధాలు ఉన్న ఓ మంత్రి పావులు కదపడమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హెచ్‌సీఏ వివాదాన్ని పార్టీకి ముడిపెట్టిన మంత్రి, అజార్‌కు టికెట్ దక్కకుండా ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. దీంతో అజార్ నేరుగా హస్తినకు వెళ్లి సోనియా, రాహుల్‌ను కలవడంతో సీఎం వర్గం వ్యూహం మార్చిందని సమాచారం. ఆయన్ని బరిలో నుంచి తప్పించేందుకు ఎమ్మెల్సీ పదవిని తెరమీదికి తెచ్చారని ఓ సీనియర్ నేత విశ్లేషించారు.



బెడిసికొట్టిన 'స్థానిక' ప్రకటన

నియోజవర్గంలో తమ అభ్యర్థికి ప్రధాన పోటీదారుగా ఉన్న అజార్‌ను తప్పించడంతో.. ఇతర ఆశావహులను కూడా నిరాశపరిచేందుకు సీఎం వర్గం కొత్త ప్రతిపాదనను తెరమీదికి తెచ్చిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ 'స్థానికుడికే టికెట్' అనే ప్రకటన చేశారని అంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపిక నిర్ణయం ఏఐసీసీదే. స్థానికుడా? స్థానికేతరుడా? ఎవరిని బరిలో దించాలన్నది ఢిల్లీలో నిర్ణయం అవుతుంది. కానీ దానికి భిన్నంగా మంత్రి పొన్నం వ్యాఖ్యలు చేయడంతో ఊహించని ప్రతిఘటన ఎదురైంది. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తెర మీదకు వచ్చి, గట్టి కౌంటర్ ఇచ్చారు. 'నేను పారాచ్యూట్ నేతను కాను' అని స్పష్టంచేశారు. పొన్నం కంటే తానే సీనియర్‌నని అటు సీఎం వర్గానికి, ఇటు మంత్రికి ఒకేసారి కౌంటర్లతో ఝలక్ ఇచ్చారని నేతలు చెప్తున్నారు. స్థానికులకే టికెట్ అనే ప్రకటన బెడిసికొట్టడం, ఒక్కసారిగా విభేదాలు భగ్గుమనడంతో సీఎం రేవంత్ దిద్దుబాటు చర్యలకు దిగారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే 14న గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ అభ్యర్థి ఎంపిక ఏఐసీసీదేనని ప్రకటించారని చెప్తున్నారు. అయినా అంజన్‌కుమార్ యాదవ్ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ఒకవైపు అధిష్ఠానం నుంచి నరుక్కొస్తూనే, మరోవైపు క్షేత్రస్థాయిలో ఎటాక్ చేస్తున్నారు. ఇటీవలే పోస్టర్లు వేసి తాను వెనక్కి తగ్గనన్న సంకేతాలిచ్చిన ఆయన, బుధవారం కూడా పలు మీడియా సంస్థలతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో తాను పోటీ చేసేది పక్కా! అని స్పష్టం చేశారు. దీంతో అజార్‌నైతే పక్కకు తప్పించాంగానీ అంజన్‌ను ఎలా తప్పించాలనే దానిపై సీఎం వర్గం మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తున్నది.

అధిష్ఠానంతో టచ్‌లోకి దానం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా నేరుగా అధిష్ఠానం నేతలను కలిసేందుకు వెళ్లినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం వర్గం ఒక వ్యక్తిని అభ్యర్థిగా ఖరారు చేయించేందుకు ముందుగానే ఒప్పందాలు చేసుకున్నారని, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదనే నిర్ణయానికి దానం వచ్చినట్టు తెలిసింది. అందుకే నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోనే టచ్‌లోకి వెళ్లినట్టు స్పష్టమవుతుంది. రెండు, మూడు రోజులుగా దానం బెంగళూరులోనే మకాం వేసి ప్రయత్నాల్ని ముమ్మరం చేసినట్టు చెప్తున్నారు. మరికొందరు స్థానిక నేతలు సైతం రాష్ట్ర, జాతీయ పార్టీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం.

'ఓటుకు నోటు' నిజాలన్నీ చెప్తా

- ఎవరు పంపారో, ఎవరు పావుగా వాడుకున్నారో.. అన్నీ సుప్రీంకోర్టులోనే వెల్లడిస్తా
- జెరూసలెం మత్తయ్య బహిరంగ లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో ఏం జరిగిందనే నిజాలన్నీ సుప్రీంకోర్టుకు పూసగుచ్చినట్టు వివరిస్తానని ఈ కేసులో నాలుగో ముద్దాయిగా ఉన్న జెరూసలెం మత్తయ్య తెలిపారు. తనను అప్పటి నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ దగ్గరకు ఎవరు పంపారో, తనను ఎవరు పావుగా వాడుకున్నారో వివరంగా చెప్తానని అన్నారు. ఇన్నాళ్లకు తన పోరాటం, కృషి ఫలించిందని, ఓటుకు కోట్లు కేసును గురించిన పూర్తి నిజాలు ఏకంగా దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ముందు చెప్పేందుకు తనకు అవకాశం దొరికిందని పేర్కొన్నారు. ఇందుకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేసి, అప్రజాస్వామికంగా అధికారాన్ని పొందాలనుకొనే 'ఓటు దొంగలను' శాశ్వతంగా ఎన్నికల్లో పాల్గొనకుండా చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలపై బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ఓటుకు నోటు కేసులో తాను నిందితుడిని కాదని, బాధితుడినని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కేసులో ఇరుక్కున్న వాళ్లంతా బాగుపడ్డారని, పదవులొచ్చాయని, అంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. కానీ తాను మాత్రం ఇంకా సమస్యలు, కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నట్టు తెలిపారు. ఓటుకు నోటు కేసులో తనతో పాటు నిందితుడైన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబానికి ఎలాంటి సాయం చేయలేదని తెలిపారు. నిజానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటుందని ఆశించానని, కానీ ఆ విధంగా జరగలేదని పేర్కొన్నారు. తెరవెనుక ఏం జరుగుతున్నందో తెలియడం లేదని, ఎవరు ఎవరిని ఇరికించి ఎవరు తప్పించుకోవాలనుకుంటున్నారో తర్వాత వెల్లడిస్తానని తెలిపారు. తనను ఈ నేరానికి ప్రోత్సహించిన వ్యక్తి టీడీపీ నుండి కాంగ్రెస్‌లో చేరి అధికారంలోకి వచ్చి తనను మోసం చేసి వదిలేశారని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి తాను పెద్ద పోరాటమే చేస్తానని, ఎంత పెద్ద స్థాయి వ్యక్తులు ఎదురుపడ్డా భయపడేది లేదని స్పష్టం చేశారు.

సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి

గ్రూప్-1పై టీజీపీఎస్సీ అప్పీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై ఈ నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బుధవారం హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. సింగిల్ జడ్జి తుది తీర్పు గతంలో వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులకు విరుద్ధంగా ఉన్నదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నది. టీజీపీఎస్సీ తరపున అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి (లీగల్) ఆర్ సుమతి ఈ పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో 719 మంది అభ్యర్థులు ఒకే రకమైన మార్కులు సాధించడం, అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసంపై టీజీపీఎస్సీ ఇచ్చిన వివరణను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో 14.8% మంది టాప్-500 మందిలో ఉన్నారనేందుకు ఆధారాలు లేవని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన పరమేశ్ మట్టా, మరో 221 మంది అభ్యర్థులను ప్రతివాదులుగా చేర్చిన ఈ పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ త్వరలో విచారణ జరుపనున్నది.

గైర్హాజరైతే.. తల్లిదండ్రులకు ఎస్‌ఎంఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ బడుల్లో రోజురోజుకూ డుమ్మా కొట్టే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. దీంతో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేదిశగా పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించారు. ఏరోజు విద్యార్థి పాఠశాలకు గైర్హాజరైతే వెంటనే వారి తల్లిదండ్రుల రిజిస్టర్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యాసరచన పోటీలకు దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల్లోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6-10వ తరగతి వరకు గల విద్యార్థులు అక్టోబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మందులకు పైసల్లేవ్!

- టీజీఎంఎస్ఐడీసీకి ప్రభుత్వం రూ.1,019 కోట్ల బకాయిలు
- సరఫరాలు ఆపేస్తామంటూ మెడికల్ ఏజెన్సీల హెచ్చరిక
- మరో మూడు నెలల్లో స్టాక్ క్లోజ్,
- బంద్ అయిన 'ఆరోగ్యశ్రీ' సేవలు
- చలించని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యారోగ్య శాఖను గాలికి వదిలేసింది. 'ఆరోగ్యశ్రీ' సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ దవాఖానలకు ప్రభుత్వం రూ.1,400 కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆ సేవలు నిలిచిపోయాయి. మరోవైపు తెలంగాణ రాష్ట్ర వైద్యసేవల మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ)కు సైతం ప్రభుత్వం భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. అందులో భాగంగా ప్రతి నెలా టీజీఎంఎస్ఐడీసీకి రూ.50 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఏప్రిల్ నుంచి ఆ డబ్బులు కూడా చెల్లించడం లేదు. దీంతో మందులు, సర్జికల్స్, మెడికల్ ఎక్విప్‌మెంట్, హాస్పిటల్స్‌కు సంబంధించిన బకాయిలు కలిపి టీజీఎంఎస్ఐడీసీకి మొత్తం రూ.1,019 కోట్లు చెల్లించాల్సి ఉన్నది.

ప్రజారోగ్యం కుప్పకూలే పరిస్థితి

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఔషధ సరఫరాలను ఆపేస్తామని మెడికల్ ఏజెన్సీలు ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి స్పష్టం చేశాయి. వైద్యం కోసం సర్కారు దవాఖానలకు వెళ్లే పేదలకు ఎలాంటి సమస్యలు తలెత్తకూడదన్న మానవతా దృక్పథంతో ఇన్ని రోజులు సరఫరాలను కొనసాగించామని బకాయిలను చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఏజెన్సీల నిర్వాహకులు వాపోతున్నారు. మందుల స్టాక్ మరో 3 నెలల్లో అయిపోనుందని తెలుస్తున్నది. ఆ తర్వాత పరికరాలు, మందుల కొరతతో ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉన్నదని చెప్తున్నారు.

కేసీఆర్ హయాంలో ప్రతి నెలా చెల్లింపులు

బీఆర్‌ఎస్ హయాంలో బడ్జెట్ పెట్టి మరీ టీజీఎంఎస్ఐడీసీకి ప్రతి నెలా నిధులు కేటాయించడంతోపాటు 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని సమర్థంగా అమలు చేశారు. కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు బాసటగా నిలుస్తున్న 'ఆరోగ్యశ్రీ' పథకానికి మొండిచెయ్యి చూపుతున్నది. నెట్‌వర్క్ దవాఖానలకు బకాయిలు చెల్లించకుండా 'ఆరోగ్యశ్రీ' సేవలకు గండి కొట్టింది. దీంతో రేవంత్‌రెడ్డి సర్కారు తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కమిషనర్ గారూ.. రోడ్ల బాగుపట్టదా?

- బురదలో బైఠాయించి ఓ కుటుంబం నిరసన
- కరీంనగర్‌లో వినూత్న ధర్నా
- మరమ్మతులకు డిమాండ్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 17: రోడ్ల మరమ్మతు విషయంలో కరీంనగర్ నగరపాలక సంస్థ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ ఓ కుటుంబం బురద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపింది. నగరంలోని 9వ డివిజన్‌లో అలకపురికి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. వాహనాలు కాదు కదా.. నడిచే పరిస్థితి లేకపోయింది. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటూ కాలనీకి చెందిన దుంపేటి రాము వారి పిల్లలతోపాటు కాలనీ వాసులతో కలిసి నిరసన తెలిపారు. 'ఇంటిపన్ను వసూలులో ఉన్న శ్రద్ధ 9వ డివిజన్ రోడ్ల మీద లేదా? మేము ఇంతవరకు కట్టిన ఇంటిపన్ను వాపస్ ఇవ్వండి. లేదా రోడ్డు వేయండి ఎంసీకే కమిషనర్ గారు' అంటూ పోస్టర్‌ను ప్రదర్శించి నిరసన చేపట్టారు. అలాగే గుంతల రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. డివిజన్‌లోని ఆటోనగర్, అలకపురి, కోతిరాంపూర్, అయోధ్యపురి కాలనీల్లో రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు.


సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యవతి రాథోడ్, మాలోత్ కవిత, సీతారాంనాయక్

ఈ 19న లంబాడా ఆత్మగౌరవ సభ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 17: లంబాడా రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఈ నెల 19న ఇందిరా పార్కు వద్ద ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. లంబాడా జాతి నిర్వీర్యానికి కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ చాలా పోరాటాల ఫలితంగా లంబాడాలకు 1976లో ఎస్టీ రిజర్వేషన్ల ఫలాలు దక్కాయని తెలిపారు. 2022 సెప్టెంబర్ 17న బీఆర్‌ఎస్ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్.. గిరిజనుల రిజర్వేషన్లను పది శాతానికి పెంచారని గుర్తుచేశారు. నేడు కొన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీ, లంబాడాలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అది ఇరువర్గాలకు నష్టమని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీలు సీతారాంనాయక్, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, రిటైర్డ్ ఏడీజీపీ డీటీ నాయక్ పాల్గొన్నారు.

బాత్రూమ్‌లో 17లక్షలు!

- ఏసీబీ సోదాల్లో లభ్యమైన నగదు
- ఏడీఈకి 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : అవినీతి ఏడీఈ బినామీ రాజేశ్ ఇంట్లోని బాత్రూమ్‌లో రూ.17 లక్షల నగదు లభ్యమైంది. ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో నగదుతోపాటు వివిధ ప్రాంతాల్లో ఆస్తులకు సంబంధించి 20కి పైగా కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్‌కు చేవెళ్ల ఏడీఈ రాజేశ్‌ను బినామీగా గుర్తించారు. కాగా విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్‌కు ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను బుధవారం చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు బినామీల్లో ఒకరైన చేవెళ్ల ఏడీఈ రాజేశ్ ఇండ్లల్లో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

1,743 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు 1000 డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నది. అక్టోబర్ 8న ఉదయం 8గంటల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు వెల్లడించింది. అదేనెల 28 దరఖాస్తులకు చివరి గడువుగా నిర్ణయించినట్టు తెలిపింది. వివరాలకు www.tgprb.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వండి

- సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయండి
- సీఎం రేవంత్‌ను కోరిన టీచర్ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : ఇన్ సర్వీస్ టీచర్ల పాలిట శాపంగా మారిన టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీచర్ ఎమ్మెల్సీలు, తపస్, పీఆర్టీయూ టీఎస్ ముక్తకంఠంతో నినదించాయి. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరాయి. బుధవారం సచివాలయంలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నిర్వహించిన సమావేశం అనంతరం టీచర్ ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, మల్క కొమురయ్య, ఏవీఎన్‌రెడ్డి, పీఆర్టీ యూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ వేర్వేరుగా సీఎం రేవంత్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని సీఎంవో కార్యదర్శి శేషాద్రిని సీఎం ఆదేశించినట్టు ఎమ్మెల్సీలు ప్రకటించారు. యూటీఎఫ్, ఎస్టీఎఫ్ఐ పక్షాన సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని నిర్ణయించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ఢిల్లీలో ప్రకటించారు.


మహబూబాబాద్ జిల్లా సండ్రాలగూడెం జీపీ ఆఫీస్‌కు తాళం వేసిన యజమాని

అద్దె చెల్లించలేదని పంచాయతీకి తాళం

మహబూబాబాద్ జిల్లాలో ఘటన

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 17 : మహబూబాబాద్ జిల్లా సండ్రాలగూడెంలో రెండేండ్లుగా అద్దె చెల్లించడం లేదని గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి యజమాని బాబూమియా తాళం వేశారు. తన ఇంటిని జీపీ ఆఫీస్‌కు నెలకు రూ.800 మొత్తానికి అద్దెకు ఇచ్చానని, గతంలో అధికారులు ఆరు నెలలకోసారి అద్దె చెల్లించేవారని తెలిపాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కిరాయి కట్టడంలేదని చెప్పాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెప్పినా అధికారులు అద్దె ఇవ్వడం లేదని బాబూమియా తెలిపాడు.

హైదరాబాద్‌లో కుండపోత

- రహదారులు జలమయం
- స్తంభించినపోయిన జనజీవనం
- వాహనదారుల తీవ్ర ఇక్కట్లు
- హెచ్‌సీయూలో అత్యధికంగా 12.6 సెం.మీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): నగరంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దాదాపు నగరంలోని రహదారులన్నీ వరద కాల్వలను తలపించాయి. ఉద్యోగులు, ప్రయాణికులు ఇండ్లకు చేరుకోవడానికి నరకం చూశారు. గచ్చిబౌలీ, మియాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించి వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా హెచ్‌సీయూ, మియాపూర్, బంజారాహిల్స్, లింగంపల్లి, గచ్చిబౌలీ, చందానగర్, హఫీజ్‌పేట్, ఫతేనగర్, ఆర్‌సీపురం, బీహెచ్ఈఎల్, కేపీహెచ్‌బీ, మూసాపేట తదితర ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. అత్యధికంగా శేరిలింగంపల్లి సర్కిల్ హెచ్‌సీయూలో 12.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. మియాపూర్‌లో 11.23 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాగల రెండు రోజుల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.



మరో మూడు రోజులు భారీవర్షాలు

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రానున్న 3 రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దేశం నుంచి రుతుపవనాలు తిరోగమనం చెందుతున్న సమయంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని ఇదే పరిస్థితి మరో వారం ఉంటుందని పేర్కొంది. అక్టోబర్ 1 నాటికి దేశం నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమిస్తాయని స్పష్టంచేసింది. ఈ క్రమంలో పలు జిల్లాల్లో క్రమంగా సాధారణ పగటి ఉష్ణోగ్రతలు పెరిగి.. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని తెలిపింది. బుధవారం ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసినట్టు అధికారులు వెల్లడించారు. హనుమకొండ జిల్లా ఖాజీపేటలో అత్యధికంగా 6.38 సెంటీమీటర్ల వర్షం కురిసిందని పేర్కొన్నారు. ఇవాళ, రేపు కూడా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. నైరుతిలో సాధారణం కంటే 60 నుంచి 87 శాతం అధిక వర్షం కురిసిందని తెలిపింది.

వర్షపాతం నమోదు ఇలా!

ప్రాంతం	నమోదు(సెం.మీ)
హెచ్‌సీయూ	12.6
మియాపూర్	11.23
లింగంపల్లి	10.73
గచ్చిబౌలీ	9.43
ముషీరాబాద్	9.18
షేక్‌పేట్	8.93

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, ఆర్ఐ

10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులు

తల్లాడ, సెప్టెంబర్ 17 : ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ తహసీల్దార్, ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్.. ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ వై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 15 గుంటల పొలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తల్లాడ మండలంలోని ఓ రైతు నుంచి తహసీల్దార్ రూ.12 వేలు లంచం డిమాండ్ చేయగా.. చివరకు రూ.10 వేలకు అంగీకారం కుదిరింది. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వంకాయలపాటి సురేశ్, ఆర్ఐ మాలోతు భాస్కర్‌నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ బానోతు శివాజీ.. రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.